RNI Reg-No. APTEL/2002/07373

Postal Registration No.VJ/215/2025-27

# నేటి మనదేశమ్

NETIMANADESAM TELUGU DAILY

తెలుగు దినపత్రిక

Simultaneously published from Vijayawada, Visakhapatnam, Tirupati & Hyderabad

సంపుటి :24 Vol. No.24 సంచిక : 72 Issue No. 72 విజయవాడ Vijayawada సంపాదకులు: కె.ఎస్.రంగశాయి: బుధవారం 11-03-2026 Wednesday, March 11 2026 పేజీలు : 8 Pages: 8 వెల: రూ.1-00 Price Rs.1-00

## ప్రత్యేకాధికారుల పాలనలోకి మున్సిపాలిటీలు, కార్పోరేషన్లు

### ఎపి ప్రభుత్వం ఆదేశాలు జారీ

**అమరావతి, మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఏపీ వ్యాప్తంగా 11 మున్సిపల్ కార్పొరేషన్లు, 75 మున్సిపాలిటీలు, నగర పంచాయతీలకు ప్రభుత్వం ప్రత్యేక అధికారులను నియమించింది. 6 నెలలు లేదా ప్రజాప్రతినిధులు ఎన్నికయ్యేవరకు ప్రత్యేక అధికారులు పాలన సాగించనున్నారు. ఈ నిర్ణయం వెంటనే అమల్లోకి రానుంది. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, తిరుపతి, కడప, కర్నూలు, అనంతపురం, ఒంగోలు, విజయనగరం, మచిలీపట్నం, చిత్తూరు కార్పొరేషన్లలో ప్రత్యేక అధికారుల పాలన సాగనుంది. ఈ మేరకు పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ నోటిఫికేషన్ జారీ చేశారు.




# తెలుగు వైభవం ఉట్టిపడేలా అమరావతి

- క్రీడలు, పర్యాటకానికి పెద్దపీట వేసేలా ప్రణాళికలు
- వివిధ సంస్థలకు భూ కేటాయింపులు
- సీఆర్‌డీఏ అథారిటీ 59వ సమావేశంలో చంద్రబాబు

**అమరావతి, మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** తెలుగు వైభవం చాటేలా అమరావతి అభివృద్ధి జరగాలని సీఎం చంద్రబాబు అన్నారు. సెల్ఫ్ ఫైనాన్స్ ప్రాజెక్టులపై దృష్టి సారించాలన్నారు. క్రీడలు, పర్యాటకానికి పెద్దపీట వేసేలా ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. సీఎం చంద్రబాబు అధ్యక్షతన సచివాలయంలో సీఆర్‌డీఏ అథారిటీ 59వ సమావేశం జరిగింది. భూ కేటాయింపులు సహా వివిధ ప్రతిపాదనలకు సీఆర్‌డీఏ ఆమోదం తెలిపింది. ఈ సందర్భంగా అధికారులకు సీఎం పలు సూచనలు చేశారు. పెట్టుబడులు పెట్టేందుకు వచ్చే సంస్థలతో నిరంతరం సంప్రదింపులు జరపాలన్నారు. మరోవైపు సీబీఎస్‌ఈ కార్యాలయ నిర్మాణానికి మిగతా 2లో..

## యువ క్రికెటర్లకు ప్రేరణ

- పిఠాపురంలో జనసేన ఆవిర్భావ వేడుకలు రద్దు
- ఉమ్మడి జిల్లా, నగరం, మండల, పంచాయితీల్లోనే నిర్వహణ
- మార్పులను ప్రకటించిన జనసేనాని పవన్ కళ్యాణ్



**అమరావతి, మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో మార్పులు చేపట్టినట్లు పార్టీ అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ప్రకటించారు. ఈ నెల 14వ తేదీన పిఠాపురంలో జరగప తలపెట్టిన రాష్ట్రస్థాయి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించారు. ఎండల తీవ్రత కారణంగా పిఠాపురం ఆవిర్భావ సభను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్నట్లు పవన్ కళ్యాణ్ వివరించారు. ఈసారి ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఉమ్మడి జిల్లా, నగరం, మండల కేంద్రం, పంచాయతీల్లో ఘనంగా నిర్వహించాలని పవన్ కళ్యాణ్ పిలుపునిచ్చారు. మార్చి 14 జనసైనికులకు, వీర మహిళలకు, పార్టీ నాయకులకు పండగ లాంటి రోజని ఈ సందర్భంగా డిప్యూటీ సీఎం అన్నారు. పార్టీ పతాక ఆవిష్కరణ కార్యక్రమాన్ని మిగతా 2లో..

## చమురు ఆందోళన వేళ.. మోదీ కీలక భేటీ



**న్యూఢిల్లీ, మార్చి 10 (ఆర్ఎన్ఎ):** ఇరాన్ యుద్ధం భారత్‌లో ఇంధన ఆందోళనలు రేకెత్తిస్తోంది. దేశ ప్రజలకు చమురు, గ్యాస్ లభ్యతలో అంతరాయం కలగకుండా చూసేందుకు కేంద్రం చర్యలు ప్రారంభించింది. ఈ క్రమంలోనే మంగళవారం ప్రధాని నరేంద్రమోదీ కీలక భేటీ నిర్వహించారు. విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్, పెట్రోలియం శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురితో ఉన్నతస్థాయి చర్చలు జరిపారు. ఎల్‌పీజీ నిల్వలు, సరఫరాపై సమీక్ష జరిపారు. అలాగే యుద్ధంతో ఉత్పన్నమయ్యే అంతరాయాల గురించి చర్చించారని జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఇజ్రాయెల్-అమెరికా, ఇరాన్ యుద్ధంతో ప్రపంచ చమురు సరఫరాకు జీవనాడి అయిన హర్మూజ్ జలసంధి నుంచి నౌకల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. దీంతో పెట్రోల్, డీజిల్, గ్యాస్‌కు కృత్రిమ కొరత కలగకుండా కేంద్రం నిత్యావసర సరకుల చట్టాన్ని ప్రయోగించింది. బ్లాక్ మార్కెటింగ్, నిల్వలను నియంత్రించే ఉద్దేశంతో పెట్రోలియం శాఖ ఈ నిర్ణయం తీసుకుంది.

## ఎపిలో పెరుగుతున్న ఎండల తీవ్రత


### ముందస్తు చర్యలపై ప్రభుత్వం అప్రమత్తం... అధికారులతో సమీక్షించిన హోంమంత్రి అనిత



**అమరావతి, మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** రాష్ట్రంలో ఎండల తీవ్రత క్రమంగా పెరుగుతోంది. దీంతో ప్రభుత్వం అప్రమత్తం అయ్యింది. ముందస్తు చర్యలపై సమీక్షించింది. ఎండల తీవ్రత, వడగాల్పుల పరిస్థితులపై హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి వంగలపూడి అనిత మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఏపీఎస్‌డీఎంఏ కార్యాలయంలో జరిగిన ఈ సమావేశంలో కలెక్టర్లు, లైన్ డిపార్ట్‌మెంట్ల అధికారులు, విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా 'హీట్ వేవ్ యాక్షన్ ప్లాన్-2026'ను హోంమంత్రి ఆవిష్కరించారు. అధికారులందరూ ఈ ప్లాన్‌ను అనుసరించి ముందుకు సాగాలని ఆదేశించారు. సెంట్రల్ ఆంధ్ర, రాయలసీమ ప్రాంతాల్లో సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని ఏపీఎస్‌డీఎంఏ ఎండీ ప్రఖర్ జైన్ తెలిపారు. రాబోయే రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగి వడగాల్పులు ఎక్కువగా వీచే అవకాశం ఉందని మంత్రి అనిత హెచ్చరించారు. అధికారులు నిరంతరం అప్రమత్తంగా పనిచేయాలని.. వడదెబ్బ కారణంగా ఎలాంటి ప్రాణనష్టం జరగకుండా చూడాలని హోంమంత్రి ఆదేశాలు జారీ చేశారు. పశువుల రక్షణకు సంబంధించి సూచనలు జారీ చేయాలని సూచించారు. వడదెబ్బ బారిన పడిన వారి చికిత్స కోసం బెడ్లు, మందులు, అంబులెన్సులు సిద్ధం చేయాలని వైద్యశాఖను ఆదేశించారు. విద్యుత్ అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్లు.. ఎండ తీవ్రత జాగ్రత్తలపై విస్తృతంగా ప్రచారం చేయాలని సూచించారు. వృద్ధులు, పిల్లలు, బహిరంగ ప్రాంతాల్లో మిగతా 2లో..

## ఇంధన ధరలు దిగి వస్తాయి

- త్వరలోనే ఇరాన్ యుద్ధం ముగుస్తుంది
- ట్రంప్ సంచలన ప్రకటన



**వాషింగ్టన్, మార్చి 10 (ఆర్ఎన్ఎ):** ఇరాన్‌పై యుద్ధం కొనసాగుతుందని,వెనక్కి తగ్గేది లేదన్న ట్రంప్ కొంత మెత్త బడ్డారు. వెనక్కి తగ్గుతున్నట్లుగా కనిపిస్తున్నారు. ఇరాన్ కూడా గట్టి హెచ్చరికలు చేయడంతోనో ఏమో యుద్ధానికి త్వరలోనే ముగింపు దొరుకుతుందని అన్నారు. ఇరాన్ యుద్ధం త్వరలోనే ముగుస్తుందని, చమురు ధరలు కిందకు దిగి వస్తాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఇరాన్ విషయంలో తాము నిర్దేశించుకున్న లక్ష్యాలను సాధించడానికి చేరువలో ఉన్నామని, ఇరాన్‌పై దాడిని, మధ్యప్రాచ్యంలోని చెడును వదిలించడానికి అమెరికా చేసిన విహారయాత్రగా ట్రంప్ అభివర్ణించారు. ఆ మిగతా 2లో..

## స్పీకర్‌పై కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానం

### లోక్‌సభలో మొదలైన చర్చ



**న్యూఢిల్లీ, మార్చి 10 (ఆర్ఎన్ఎ):** లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్షాలు అవిశ్వాస తీర్మానం తీసుకొచ్చాయి. ఈ తీర్మానాన్ని కాంగ్రెస్ ఎంపీ మహమ్మద్ జావెద్ మంగళవారం సభలో ప్రవేశపెట్టారు. అనంతరం దీనిపై చర్చ ప్రారంభమైంది. ఇందుకోసం 10 గంటల సమయం కేటాయించారు. అనంతరం తీర్మానంపై ఓటింగ్ నిర్వహించనున్నారు. ఈ తీర్మానం పై చర్చ మిగతా 2లో..

## ఎపిలో పర్యాటక అభివృద్ధికి అవకాశాలు

- విస్తారమైన సముద్రతీరం, సహజ వనరులు ఉన్నాయి
- పెట్టుబడులు పెట్టడానికి రండి
- ముంబైలో జరిగిన ఎక్స్‌పోలో మంత్రి కందుల దుర్గేశ్ పిలుపు



**ముంబై, మార్చి 10 (ఆర్ఎన్ఎ):** ఏపీ పర్యాటక రంగానికి పారిశ్రామిక హోదా ఉందని, 2024-29 నూతన పర్యాటక పాలసీ ద్వారా ఇన్వెస్టర్లకు రాయితీలు కల్పిస్తున్నామని మంత్రి వెల్లడించారు. అంతర్జాతీయ స్థాయి థీమ్ పార్క్‌లు, వాటర్ ఫ్రంట్ అట్రాక్షన్స్, అడ్వెంచర్ జోన్‌ల ఏర్పాటుకు రాష్ట్రంలో అపార అవకాశాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. సుదీర్ఘ తీరప్రాంతం, గొప్ప సాంస్కృతిక వారసత్వం కలిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం.. పర్యాటక ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేయడానికి కట్టుబడి ఉందని మంత్రి తెలిపారు. ముంబైలో 24వ ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ అమ్యూజ్ మెంట్ పార్క్స్ అండ్ ఇండస్ట్రీస్(ఐఏఏపీఐ) ఎక్స్ పోలో పర్యటకశాక మంత్రి కందుల దుర్గేశ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మిగతా 2లో..

## ఇరాన్ యుద్ధ ప్రభావంతో ధరల మోత

- గ్యాస్ ధరలు పెరగడంతో పెట్రో ధరలపై ఆందోళన
- ఇప్పటికిప్పుడు ప్రమాదం లేదని వెల్లడించిన కేంద్రం



**న్యూఢిల్లీ, మార్చి 10 (ఆర్ఎన్ఎ):** పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు మనదేశ నిత్యావసరాలపై తీవ్ర ప్రభావం చూపించబోతున్నట్టు వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా పెట్రోల్, గ్యాస్, ఎరువుల దిగుమతులకు ఆటంకం ఏర్పడడంతో, అతి త్వరలోనే వీటి నిల్వలు నిండుకుంటాయని భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇదే సంర్భంలో గ్యాస్ ధరలు పెరిగాయి. అలాగే పెట్రో ధరలు పెరుగాయని అంటున్నారు. వీటి ప్రభావంతో నిత్యాసవరాలు కూడా పెరగక తప్పేలా లేదు. ఈ నేపథ్యంలో కేంద్రం స్పందించింది. ముఖ్యంగా పెట్రోల్ ధరలు పెరుగుతాయనే వార్తలను ఖండించింది. కొంతపాలం పాటు నష్టాలను చమురు కంపెనీలు భరిస్తాయని వెల్లడించింది. రాబోయే 6 నుంచి 8 వారాల వరకు ముడి చమురు, శుద్ధి చేసిన పెట్రోల్ నిల్వలు ఉన్నాయని కేంద్రం వెల్లడించింది. అలాగే ఎల్పీజీ సిలిండర్ల నిల్వలు కూడా ప్రస్తుతానికి సరిపోతాయని పేర్కొంది. అయితే గ్యాస్ సిలిండర్ల బుకింగ్ వ్యవధిని 25 రోజులకు పెంచుతూ మిగతా 2లో..

## ఇరిగేషన్ రంగానికి ప్రభుత్వం పెద్దపీట

- ప్రధాన సాగునీటి ప్రాజెక్టులు సత్వరం పూర్తి
- ప్రణాళికా బద్ధంగా పనులు సాగుతున్నాయి
- పోలవరం పనులు పరిశీలించిన మంత్రి నిమ్మల



**పోలవరం, మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** పోలవరం సహా రాయలసీమ, ఉత్తరాంధ్ర ప్రాంతాల్లోని ప్రధాన సాగునీటి ప్రాజెక్టులను క్రమపద్ధతిలో పూర్తి చేసేలా ప్రభుత్వం యాక్షన్ ప్లాన్ సిద్ధం చేసిందని రాష్ట్ర జలవనరుల శాఖ మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయిలు

## యువ క్రికెటర్లకు ప్రేరణ

జనసైనికులు, వీర మహిళలు, నాయకులు, ఉద్యమ సభ్యత్వం పొందినవారి సమక్షంలో ఎగురవేయాలని సూచించారు. పార్టీ సైద్ధాంతిక బలం, రాష్ట్ర అభివృద్ధికి కట్టుబడి ఏ విధంగా ముందుకు వెళ్తుందో పార్టీ శ్రేణులకు, ప్రజలకు వివరించాలన్నారు. ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సేవా కార్యక్రమాలు చేపట్టాలని జనసేన అధినేత పిలుపునిచ్చారు. రక్తదాన శిబిరాలు, ఆహార వితరణ, పర్యావరణ సంబంధిత కార్యక్రమాలు నిర్వహించాలని పవన్ సూచించారు. ఎండల తీవ్రత నేపథ్యంలో రాష్ట్ర స్థాయి కార్యక్రమాన్ని మార్చినట్లు జనసేన అధినేత తెలిపారు. ఈ దఫా జనసేన పార్టీ ఆవిర్భావ వేడుకలను రాష్ట్ర స్థాయిలో పిఠాపురంలో నిర్వహించాలని తొలుత నిర్ణయించామని.. వాతావరణ పరిస్థితులు ప్రతికూలంగా ఉంటాయనే రిపోర్టులను పరిగణనలోకి తీసుకుని.. అందుకు అనుగుణంగా వేడుకల నిర్వహణ స్వరూపాన్ని మార్చామని వివరించారు. ఆవిర్భావ వేడుకలను రాష్ట్ర స్థాయి కార్యక్రమంగా కాకుండా జిల్లా, సిటీ, మండల కేంద్రాల్లో నిర్వహిస్తున్నామన్నారు. కార్యకర్తల్లో ఉన్న ఉత్సాహాన్ని కొనసాగించేలా ఎక్కడికక్కడ స్థానికంగా వేడుకలను ఘనంగా నిర్వహించాలని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ ఆదేశించారు.

## ఏపిలో పెరుగుతున్న ఎండల తీవ్రత

పనిచేసే కార్మికులపై ప్రత్యేక దృష్టి సారించాలని హోంమంత్రి తెలిపారు. నిరంతరాయంగా తాగునీటి సరఫరా ఉండేలా చర్యలు చేపట్టాలని అధికారులను హోంమంత్రి ఆదేశించారు. తాత్కాలిక చలువ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. మార్కెట్లు, బస్టాండ్లు, కూడళ్లు వంటి జనసమూహ ప్రాంతాల్లో తప్పనిసరిగా చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎన్జీవోలు, కమ్యూనిటీ గ్రూపుల ద్వారా మంచినీరు, మజ్జిగ వంటి పంపిణీ కార్యక్రమాలు చేపట్టాలని హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి అనిత సూచించారు.

## ఇంధన ధరలు దిగి వస్తాయి

విహారయాత్ర స్వల్పకాలికంగానే ఉంటుందని తెలిపారు. మియామి గోల్ఫ్ క్లబ్‌లో రిపబ్లికన్ చట్ట సభ్యులతో జరిగిన సమావేశంలో ట్రంప్ ప్రసంగించారు. 'ఇరాన్ యుద్ధం ఈ వారంలోనే ముగుస్తుందా' అనే ప్రశ్నకు ట్రంప్ స్పందిస్తూ.. 'లేదు. కానీ త్వరలోనే ముగుస్తుంది' అని జవాబిచ్చారు. 'మా సైనిక లక్ష్యాన్ని పూర్తి చేసే దిశగా పెద్ద అడుగులు వేస్తున్నాం. ఇరాన్‌లోని బలగాలను పూర్తిగా తుడిచిపెట్టేశాం. అంతర్జాతీయ చమురు సరఫరాకు అంతరాయం కలిగిస్తే ఉపేక్షించేది లేదు. అలా చేస్తే ఇరాన్‌ను పూర్తిగా ధ్వంసం చేస్తాం' అని ట్రంప్ హెచ్చరించారు. మెరికా, ఇజ్రాయెల్‌పై దాడిని పొడిగించేందుకు ఇరాన్‌కు తగినంత సామర్థ్యం లేదు కాబట్టి, యుద్ధం త్వరలోనే ముగిసిపోతుందని ట్రంప్ పేర్కొన్నారు. అమెరికా–ఇజ్రాయెల్ దాడిలో ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణించడంతో ఆయన వారసుడిగా మొజ్తాబా ఖమేనీ ఎంపికైనట్టు వార్తలు వస్తున్నాయి. ఇరాన్ నూతన సుప్రీం లీడర్‌గా మొజ్తాబాను ఎంపిక చేయడం పట్ల తాను చాలా నిరాశ చెందానని, అయితే కొత్త సుప్రీం లీడర్‌పై దాడి చేసే ఉద్దేశం తనకు లేదని ట్రంప్ తెలిపారు.

## స్పీకర్‌పై కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానం

వేళ సభను నడిపేందుకు ప్రత్యేక సభాపతిని నియమించాలని విపక్షాలు కోరాయి. ఇందుకు అంగీకరించిన కేంద్రం.. సీనియర్ ఎంపీ, ఛైర్‌పర్సన్స్ ప్యానెల్ సభ్యుడు జగదాంబికా పాల్‌ను నియమించింది. ఆయన నేతృత్వంలో అవిశ్వాస తీర్మానంపై లోక్‌సభలో చర్చ కొనసాగుతోంది. రాష్ట్రపతికి ధన్యవాదాలు తెలిపే తీర్మానంపై చర్చలో మాట్లాడేందుకు విపక్ష నేత రాహుల్‌గాంధీకి అవకాశం ఇవ్వకపోవడం, ఎనిమిది మంది సభ్యులపై సస్పెన్షన్ వేటు వేయడం, కాంగ్రెస్ మహిళా ఎంపీలపై నిరాధార ఆరోపణలు చేసిన భాజపా ఎంపీ నిశికాంత్ దుబెపై చర్యలు చేపట్టకపోవడం వంటి కారణాలతో విపక్షాలు ఈ అవిశ్వాస తీర్మానాన్ని తీసుకొచ్చాయి. ఇందుకోసం 118 మంది ఎంపీల సంతకాలు సేకరించినట్లు తెలుస్తోంది. చర్చ అనంతరం అవిశ్వాస తీర్మానంపై ఓటింగ్ నిర్వహిస్తారు. ఈ తీర్మానం ఆమోదం పొందాలంటే సాధారణ మెజార్టీ అయిన 272 ఓట్లు కావాలి. ప్రస్తుతం లోక్‌సభలో భాజపా నేతృత్వంలోని ఎన్డీయేకు 293 సంఖ్యాబలం ఉంది. ప్రతిపక్షాలకు 238 మంది ఎంపీలు ఉన్నారు. దీంతో విపక్షాలు ఈ తీర్మానం నెగ్గే అవకాశాలు దాదాపు కన్పించట్లేదు.

## ఇరాన్ యుద్ధ ప్రభావంతో ధరల మోత

నిర్ణయం తీసుకుంది. ఇంతకు ముందు ఈ వ్యవధి 21 రోజులు ఉండేది. మనదేశంలో సగటున ఒక కుటుంబం ఏడాదికి 7 నుంచి 8 సిలిండర్లను మాత్రమే వినియోగిస్తున్నట్టు కేంద్రం పేర్కొంది. లాగే రాబోయే ఖరీఫ్ సీజన్‌కు సరిపడా ఎరువులు కూడా అందుబాటులో ఉన్నాయని ఫెర్టిలైజర్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా వెల్లడించింది అయితే ప్రస్తుత భౌగోళిక ఉద్రిక్తతలు, గ్యాస్ సరఫరాలో కోత యూరియా ఉత్పత్తులపై ప్రభావం చూపించే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేసింది. ప్రస్తుతం 177.31 లక్షల టన్నుల ఎరువులు నిల్వలున్నట్టు తెలిపింది. వాటిల్లో 59.30 లక్షల టన్నుల

# తెలుగు వైభవం ఉట్టిపడేలా అమరావతి

(మొదటి పేజీ తరువాయి)

80 సెంట్ల భూమి కేటాయింపునకు సీఆర్‌డీఏ ఆమోదం తెలిపింది. తుళ్లూరు ఎడ్యుకేషనల్ సొసైటీకి 3 ఎకరాలు, పంచాయతీరాజ్ విభాగంలోని ఏపీఎస్ ఐఆర్‌డీకి 5 ఎకరాల భూ కేటాయింపునకు అనుమతిచ్చింది. సచివాలయం, హెచ్‌వోడీ టవర్ల పనులకు రూ.2,316 కోట్లకు పాలనా అనుమతులిచ్చింది. రూ.119 కోట్లతో తెలుగు కల్చరల్ సెంటర్ నిర్మాణానికి సీఆర్‌డీఏ ఆమోదం తెలిపింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వివిధ సంస్థలకు భూ కేటాయింపులు, జీవోఎంల నిర్ణయాలు, సచివాలయం, హెచ్‌ఓడీ భవనాల్లో మౌలిక సదుపాయాల కల్పన వంటి ముఖ్య అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది. ఈ సమావేశంలో ఈపీసీ పద్ధతిలో తెలుగు కల్చరల్ సెంటర్ ఏర్పాటు చేయడంపై సమీక్ష జరిగింది. అలాగే రాజధాని పరిధిలో కన్వెన్షన్ సెంటర్ నిర్మాణంపై కూడా వివరంగా చర్చించారు. వివిధ సమావేశాలు, కార్యక్రమాలు నిర్వహించుకునేలా కన్వెన్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తోంది. ఈ సమావేశంలో పురపాలక శాఖ మంత్రి పి.నారాయణ, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, సీఎస్ సాయి ప్రసాద్‌తో పాటు పట్టణాభివృద్ధి, సీఆర్డీఏ, ఏపీడీసీఎల్ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

# ఏపిలో పర్యాటక అభివృద్ధికి అవకాశాలు

(మొదటి పేజీ తరువాయి)

ఆయన ఏపీలో అమ్యూజ్‌మెంట్, థీమ్ పార్క్‌లు, వాటర్ పార్క్‌లు, అడ్వెంచర్ జోన్‌ల ఏర్పాటుకు ఇన్వెస్టర్లను ఆహ్వానించారు. ఏపీలో వినోద రంగాన్ని అభివృద్ధి చేయడానికి అనువైన వాతావరణం ఉందన్నారు. విమానాశ్రయాల విస్తరణ, మెరుగైన రవాణా సౌకర్యాలు, పెరుగుతున్న పట్టణీకరణ వంటివి రాష్ట్రాన్ని పెట్టుబడులకు అత్యంత అనువైన ప్రాంతంగా మార్చాయని ఆయన వివరించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ దార్శనికతతో 'స్వర్ణాంధ్ర పర్యాటక విజన్ 2047'ను రూపొందించామని మంత్రి దుర్గేశ్ చెప్పారు. హోటళ్లు, థీమ్ పార్క్‌లు, రిసార్టుల కోసం భూమి కేటాయింపు పక్రియను సరళతరం చేస్తూ.. దేశంలోనే మొదటిసారిగా ఈ విధానాన్ని తీసుకొచ్చామని ఆయన ప్రకటించారు. రూ.50 కోట్ల కంటే ఎక్కువ పెట్టుబడి పెట్టే వారికి ఎస్‌ఐపీబీ ద్వారా భూమి కేటాయింపులు జరుగుతాయని మంత్రి దుర్గేశ్ తెలిపారు. గత ఏడాది 102 ఒప్పందాల ద్వారా రూ.18,448 కోట్ల పర్యాటక పెట్టుబడులను ఆకర్షించామని వెల్లడించారు. అమరావతి, విశాఖపట్నం, తిరుపతి నగరాల్లో భారీ మెగా అమ్యూజ్‌మెంట్ పార్క్‌ల పెట్టుబడులకు ఆహ్వానిస్తున్నామని ఆయన తెలిపారు. అమరావతి గ్రీన్‌ఫీల్డ్ రాజధానిగా అద్భుత అవకాశాలను కలిగి ఉందన్నారు. విశాఖపట్నం ప్రీమియర్ కోస్టల్ టూరిజం హబ్‌గా అభివృద్ధి చెందుతోందని చెప్పారు. తిరుపతిలో భక్తుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో ఫ్యామిలీ ఎంటర్‌టైన్‌మెంట్‌కు అనువైన ప్రాంతమని మంత్రి వివరించారు. టైర్-2, టైర్-3 నగరాల్లో చిన్న తరహా అమ్యూజ్‌మెంట్ పార్క్‌లు తక్కువ పెట్టుబడితో త్వరగా పూర్తయ్యే అవకాశం ఉందని, త్వరితగతిన రాబడిని అందిస్తాయని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. ఏపీ పర్యాటక రంగం కొత్త శకంలోకి ప్రవేశిస్తోందని అన్నారు. కూటమి ప్రభుత్వ సంస్కరణలు, మౌలిక సదుపాయాలు, పెట్టుబడిదారుల అనుకూల విధానాలు విజయానికి బాటలు వేస్తాయని ఇన్వెస్టర్లకు మంత్రి దుర్గేశ్ పిలుపునిచ్చారు. వినోద రంగంలో నూతన ఆవిష్కరణలు, వేలాది ఉద్యోగాల సృష్టికి రాష్ట్రం అండగా ఉంటుందన్నారు. రేపటి ఉజ్వల పర్యాటక భవిష్యత్తును నిర్మించడంలో భాగస్వాములు కావాలని ఇన్వెస్టర్లను ఆహ్వానించారు. సృజనాత్మకతకు, ఇంజనీరింగ్ నైపుణ్యానికి నిదర్శనమైన ఈ ప్రతిష్ఠాత్మక సదస్సులో పాల్గొనడం తన అదృష్టమన్నారు మంత్రి. వినోద రంగాన్ని అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్తున్న దార్శనికులకు ఇది ఒక అద్భుతమైన వేదిక అని చెప్పుకొచ్చారు. ఏపీలో అంతర్జాతీయ స్థాయి థీమ్ పార్క్‌ల ఏర్పాటుకు కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని వెల్లడించారు. ఏపీలో పర్యాటక ప్రాంతాల్లో అంతర్జాతీయ స్థాయి మౌలిక వసతుల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఏపీని పర్యాటకుల గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామని చెప్పారు. ఆధునిక పర్యాటక రంగంలో అమ్యూజ్‌మెంట్, థీమ్ పార్క్‌లు కీలక స్తంభాలుగా ఎదిగాయన్నారు. నేటి కాలంలో కుటుంబాలు వినూత్న అనుభూతుల కోసం, యువత సాహస క్రీడల కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. ఐఏఏపీఐ గత కొన్ని దశాబ్దాలుగా భద్రతా ప్రమాణాలు, వృత్తిపరమైన శిక్షణ, ఆవిష్కరణలలో అగ్రగామిగా ఉంటూ.. ఈ రంగాన్ని ముందుకు నడిపిస్తోందని మంత్రి పేర్కొన్నారు. ఻ారతదేశంలో అమ్యూజ్‌మెంట్ రంగం ఏటా 15శాతం వృద్ధి సాధిస్తోందని మంత్రి తెలిపారు. 2030 నాటికి రూ.25,000 కోట్లకు చేరుకుంటుందని అంచనా వేశారు. ప్రస్తుతం దేశంలో సుమారు 300 అమ్యూజ్‌మెంట్ పార్క్‌లు, 2,500 ఇండోర్ సెంటర్లు ఉన్నాయని తెలిపారు. 'ఏపీ పర్యాటకంలో పెట్టుబడులు పెట్టండి, భరోసా కల్పించే బాధ్యత మాది' అని ముందైే వేదికగా ఇన్వెస్టర్లను మంత్రి కందుల దుర్గేశ్ ఆహ్వానించారు.

# ఇరిగేషన్ రంగానికి ప్రభుత్వం పెద్దపీట

(మొదటి పేజీ తరువాయి)

మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. మంగళవారం పోలవరం ప్రాజెక్టు పనులను మంత్రి రామానాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఇరిగేషన్ రంగానికి గతంలోనూ, ప్రస్తుతం కూడా కూటమి ప్రభుత్వం పెద్దపీట వేసి ప్రాజెక్టులు పూర్తి చేసే దిశగా చర్యలు తీసుకుంటోందని చెప్పారు. ప్రాజెక్టుల నిర్మాణ నాణ్యత విషయంలో ఎక్కడా రాజీపడకూడదని ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించారని ఆయన వెల్లడించారు. గత ప్రభుత్వంలో కీలకమైన డయాఫ్రం వాల్ ధ్వంసం కావడంతో, నాణ్యత, ప్రజా భద్రత దృష్ట్యా కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణాన్ని చేపట్టామన్నారు. సెంట్రల్ వాటర్ కమిషన్ (సిడబ్ల్యుసి) డిజైన్స్ ప్రకారం పోలవరం పనులు జరుగుతున్నాయని, అంతర్జాతీయ నిపుణుల ప్యానల్ సూచనలు పాటిస్తూ నిర్మాణం కొనసాగుతోందన్నారు. పోలవరం ప్రాజెక్ట్ అథారిటీ ప్రతిరోజూ డిజైన్ల ప్రకారం జరుగుతున్న పనులను పర్యవేక్షిస్తోందని, పనుల పురోగతిని కేంద్ర ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు తెలియజేస్తున్నామని చెప్పారు. కొత్త డయాఫ్రం వాల్ మొత్తం 1372 మీటర్లకు గానూ ఇప్పటికే 1300 మీటర్లు పూర్తయ్యాయని, ఈ నెలాఖరుకల్లా పూర్తి అవుతుందని పేర్కొన్నారు. అదే విధంగా ఈసిఆర్‌ఎఫ్ డ్యాం నిర్మాణ ప్రాంతంలో నేలను గట్టిపరచే వైబ్రో కాంప్యాక్షన్ పనులు పూర్తి చేశామని, ఈ ఏడాది జూన్ నాటికి కుడి, ఎడమ కాలువల అనుసంధాన పనులు కూడా పూర్తి చేస్తామని తెలిపారు. నిర్వాసితులకు పరిహారం చెల్లింపుల విషయమై 2016లో చంద్రబాబు ప్రభుత్వం రూ.700 కోట్లు పంపిణీ చేయగా, కూటమి ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చిన తరువాత రెండు దఫాలుగా రూ.1900 కోట్లు అందించిందన్నారు. ప్రాజెక్టు నిర్మాణంపై వస్తున్న సూచనలు, సలహాలు, విమర్శలను ప్రభుత్వం స్వాగతిస్తుందని మంత్రి చెప్పారు. అయితే ప్రాజెక్టు నిర్మాణ నాణ్యత, భద్రతా ప్రమాణాల విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడే ప్రసక్తే లేదని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు.

# హామీ మేరకు అంగన్‌వాడీలను ఆదుకోవాలి

### జీతాలు పెంచి వెంటనే అమలు చేయాలి... అంగన్‌వాడీ ప్రతినిధుల డిమాండ్

**విజయవాడ, మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** ఇటీవల అంగన్‌వాడీ ఉద్యోగులు మరోమారు కదం తొక్కారు. వేతనాలు పెంచాలని డిమాండ్ చేశారు. అయితే వారి సమస్యలు పరిష్కరిస్తామని మంత్రి గుమ్మడి సంధ్యారాణి ప్రకటించారు. నిజానికి వేతనాలు పెంచుతామని, వారి సమస్యలు పరిష్కరిస్తామని ప్రతిపక్షంలో ఉండగా టిడిపి హామీలు గుప్పించింది. కానీ కూటమి అధికారంలోకి వచ్చాక నిర్బంధం విధించడం దారుణం. శాంతియుతంగా మహా ధర్నా నిర్వహించి, శిబిరంలోనే నిద్రిస్తున్న వెయ్యిమందికిపైగా మహిళల పట్ల అమానుషంగా వ్యవహరించింది. పిన్నులతో గుచ్చడం, తాళ్లు వేసి, ముసుగుగుడ్డ కప్పి బలవంతంగా వ్యానుల్లో కుక్కడం, బ్యాగులు, సెల్‌ఫోన్లు సైతం తీసుకోనీయకపోవడం, అరెస్టు చేసి వంద కిలోమీటర్లకు పైగా దూరంలోని ప్రాంతాలకు తరలించడం చూశాం. దీనిపై సిఎం చంద్రబాబు ఎక్కడా కనీసం విచారం ప్రకటించలేదు. అంగన్‌వాడీ ఉద్యోగుల నియామకంలో కాంట్రాక్టర్లు, ఏజెంట్లు వంటి మధ్యవర్తులెవరూ ఉండరు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రెగ్యులర్ ఉద్యోగుల్లో చిట్టచివర ఉన్న వారికి చెల్లించే కనీస వేతనం, డిఎ, ఇతర అలవెన్సులు కలిపి రూ.26 వేలు ఇవ్వాలి. కార్మికులకు పిఎఫ్, ఇఎస్‌ఐ, పెన్షన్ అమలు చేయడం ప్రభుత్వ బాధ్యత. ఇవేవీ వారికి అమలు చేయడం లేదు. తెలంగాణ ప్రభుత్వం ఇచ్చే వేతనం కంటే వెయ్యి రూపాయలు అదనంగా ఇస్తామని నాటి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మాటమార్చి, అంగన్‌వాడీ ఉద్యమంపై ఎస్మా ప్రయోగించి అప్రతిష్ఠ పాలైంది. 42 రోజుల సమ్మె అనంతరం సమస్యలపై ఒప్పందం చేసుకుంది. నాటి ఉద్యమానికి మద్దతు ప్రకటించి, మెరుగైన వేతనాలిస్తామని ఊరూవాడా శిబిరాల్లో ప్రకటించిన టిడిపి కూటమి నేతలు ఇప్పటికైనా మాట నిలబెట్టుకోవాలి. చట్టసభ వేదికగా మంత్రి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరుతున్నారు. 2024 జూన్ నుంచి వేతనం పెంచుతామని గత ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాన్ని సైతం కూటమి ప్రభుత్వం అమలు చేయలేదు. తెలంగాణలో రూ.2,150 అధిక వేతనం ఇస్తున్నారు. మరో రూ.5 వేలు పెంచుతామని ఆ రాష్ట్ర మంత్రి ప్రకటించారు. చాలా రాష్ట్రాల్లో ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించారు. ఏడేళ్లుగా వేతనాలు పెరగకపోవడం, ధరలు విపరీతంగా పెరగడంతో జీవనం దుర్భరంగా మారడం, అధికారంలోకి వచ్చి 22 నెలలైన తరువాత కూడా సర్కారులో చలనం లేకపోవడం వల్లే మహాధర్నాకు దిగామని అంగన్‌వాడీలు అన్నారు. పిల్లలకు, బాలింతలకు, గర్భిణులకు పౌష్టికాహారాన్ని అందించడం, చిన్నారులకు ప్రీప్రైమరీ విద్యను అందించడం, ప్రభుత్వ పథకాలన్నీ క్షేత్రస్థాయిలో అమలు చేస్తున్న అంగన్‌వాడీలను నిర్లక్ష్యం చేయడం తగదు. ఉమ్మడి ఏపిలో గుర్రాలతో తొక్కించి అప్రతిష్టను మూటగట్టుకున్న గత అనుభవాన్ని టిడిపి కూటమి ప్రభుత్వం మరచిపోరాదు. కార్మికులను, కష్టజీవులను అణచివేయాలని చూస్తే ఉద్యమాలు ఎగసిపడతాయన్నది గుర్తించాలని అంగన్‌వాడీ ప్రతినిధులు అన్నారు.

# ప్రతి ఇంట్లో సూర్యఘర్ వెలుగులు

### పథకంపై ప్రజల్లో అవగాహన పెంచాలి... సూర్యాంధ్ర ప్రగతి శకటాల ద్వారా జనజాగృతి... ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ



**విజయవాడ, మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** సౌరశక్తి వినియోగంపై ప్రజలను ప్రోత్సహిస్తూ ప్రతి ఇంట్లో సూర్యఘర్ వెలుగులు నింపుదామని.. పీఎం సూర్యఘర్ పథకంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు సూర్యాంధ్ర ప్రగతి శకటాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. నేషనల్ సోలార్ ఎనర్జీ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్ఎస్ఈఎఫ్ఐ) – సూర్యాంధ్ర ప్రగతి రథ శకటాలను కలెక్టర్ డా. జి.లక్ష్మీశ మంగళవారం కలెక్టరేట్‌లో జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ విద్యుత్ బిల్లుల నుంచి విముక్తి లభించడంతో పాటు పర్యావరణ హిత జీవితానికి ఈ పథకం దోహదం చేస్తుందన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల చేయూతతో అమల్లో ఉన్న పీఎం సూర్యఘర్ – ముఫ్త్ బిజ్లీ యోజన పథకం ద్వారా 60 శాతం వరకు రాయితీతో సోలార్ వ్యవస్థను ఏర్పాటు చేసుకొని విద్యుత్ వినియోగదారులు ఉత్పత్తిదారులుగా మారొచ్చన్నారు. ఇంటి అవసరాలకు ఉపయోగించుకోగా మిగిలిన విద్యుత్‌ను గ్రిడ్‌కు అమ్మడం ద్వారా అదనపు ఆదాయం కూడా పొందవచ్చని పేర్కొన్నారు. విద్యుత్ స్వయం సమృద్ధితో విద్యుత్ కొనుగోలుపై ఆధారపడాల్సిన అవసరం లేదన్నారు. ఇంటి యజమానులు, అపార్టుమెంట్లు, హౌసింగ్ సొసైటీలు, చిన్న, మధ్యతరహా వ్యాపారస్తులు, రైతులు పథకానికి అర్హులని వివరించారు. పథకాన్ని సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సహించేందుకు ఎన్ఎస్ఈఎఫ్ఐ – సూర్యాంధ్ర ప్రగతి రథాల ద్వారా గ్రామాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు వివరించారు. ఈ రథం ద్వారా పీఎం సూర్యఘర్ పథకం ప్రయోజనాలు, దరఖాస్తు విధానం, సబ్సిడీ వివరాలు ప్రజలకు తెలియజేయడం జరుగుతుందని, ఎన్ఎస్ఈఎఫ్ఐ సీఈవో సుబ్రహ్మణ్యం పులిపాక మార్గనిర్దేశనంతో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషిచేస్తున్నట్లు సంస్థ ప్రతినిధి సీహెచ్ ఉదయ్ తెలిపారు.

### టీటీడీకి పది లక్షల విరాళం

**తిరుపతి, మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** టిటిడి ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రీ బాలాజీ వర ప్రసాదిని స్కీంకు రూ.10 లక్షల విరాళం అందింది. హైదరాబాద్ కు చెందిన కియోరా ఇన్‌ఫ్రా కన్‌స్ట్రక్షన్ కంపెనీ ఎండీ డా. కోడెల శివరామకృష్ణ తన కుటుంబ సభ్యులతో కలిసి ఈ విరాళాన్ని అందించారు.


దక్షిణ మధ్య రైల్వే
మమ్మల్ని అనుసరించండి: @SCRRailwayIndia దక్షిణ మధ్య రైల్వే టెండర్ నోటీసుల వివరాలు మా వెబ్‌సైట్‌లో చూడవచ్చు: www.scr.indianrailways.gov.in

**టెండర్ నోటీసు సంఖ్య: G/E.29/Tr./ టెండర్ నోటీసు/62/2025-26** PUB/2070

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్ / ట్రాక్షన్ / గుంతకల్, భారత రాష్ట్రపతి తరఫున మరియు వారి తరఫున క్రింది పనుల కోసం ఈ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

టెండర్ నం.: GTL-TRD-29-eTN-94-2025-26
పని పేరు: GTL డివిజన్‌లో విశ్వసనీయత మరియు భద్రతను మెరుగుపరచడం కోసం ఎర్తింగ్ స్టేషన్, బ్యాటరీ సెట్లు మరియు PSI పరికరాలను అప్‌గ్రేడ్ చేయుట.సుమారు అంచనా విలువ (₹): 1,27,22, 645.22/-
EMD (అర్నెస్ట్ మనీ డిపాజిట్) (₹): 2,13,600/-

టెండర్ ముగింపు తేదీ & సమయం: 31.03.2026 మధ్యాహ్నం 15:00 గంటలకు.
గమనిక:
1.టెండర్ దరఖాస్తుదారులు టెండర్ పత్రాలను www.ireps.gov.inవెబ్‌సైట్ నుండి ఉచితంగా డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.
టెండర్ బిడ్డింగ్ చేయడానికి మరియు ఇతర వివరాల కోసం http://www.ireps.gov.in వెబ్‌సైట్‌లో లాగిన్ అవ్వాలి. ఏవైనా సవరణలు (Corrigendum) ఉంటే అవి ఆన్‌లైన్‌లో మాత్రమే విడుదల చేయబడతాయి.

సీనియర్ డివిజనల్ ఎలక్ట్రికల్ ఇంజనీర్, ట్రాక్షన్, గుంతకల్

**ఈ-టెండర్ నోటీసు సంఖ్య: B/E.EGS/ 21/2025-26 తేదీ: 05.03.2026** PUB/2071

భారత రాష్ట్రపతి తరఫున మరియు వారి తరఫున, క్రింద సంతకం చేసిన అధికారి క్రింది పనుల కోసం క్రింద పేర్కొన్న తేదీన మధ్యాహ్నం 15:00 గంటల వరకు ఈ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

క్రమ సంఖ్య: 01 టెండర్ నం.: B/E.29/I/EGS/37/ 25-26 తేదీ: 03.03.2026 పని పేరు: BZA డివిజన్ – (i) సరైన రేటింగ్ ఉన్న UG (అండర్‌గ్రౌండ్) కేబుల్స్ ఏర్పాటు చేయడం ద్వారా విద్యుత్ సరఫరా విశ్వసనీయతను మెరుగుపరచడం మరియు బలపరచడం. (ii) స్టేషన్లకు మరియు AT కేబుల్స్‌కు విద్యుత్ సరఫరా చేస్తున్న లోపభూయిష్టమైన UG కేబుల్స్‌ను మార్చడం (BZA డివిజన్‌లో).
టెండర్ అంచనా విలువ (₹): 5,92,33,942.86
E.M.D./బిడ్ సెక్యూరిటీ (₹): 4,46,200
టెండర్ పత్రాల ధర (₹): లేదు పని పూర్తి చేయుటకు గడువు: 6 నెలలు టెండర్ ముగింపు తేదీ: 25.03.2026

క్రమ సంఖ్య: 02 టెండర్ నం.: B/E.29/I/EGS/38/ 25-26 తేదీ: 03.03.2026 పని పేరు: BZA డివిజన్: (i) ELS/BZA – ప్రతిపాదిత విస్తరించిన ML బే (02 స్పాన్లు) లో 500 టన్నుల హైడ్రాలిక్ వీల్ ప్రెస్ మెషిన్ ఏర్పాటు చేయుటకు అవసరమైన విద్యుత్ ఏర్పాట్లు. (ii) BZA డివిజన్‌లో ట్రాక్ మెషిన్ క్యాంపింగ్ కోచెస్‌కు తాత్కాలిక భద్రతా చర్యలుగా విద్యుత్ ఏర్పాట్లు కల్పించడం (మొత్తం 27 కోచెస్).
టెండర్ అంచనా విలువ (₹): 1,20,48,608.00
E.M.D./బిడ్ సెక్యూరిటీ (₹): 2,10,300
టెండర్ పత్రాల ధర (₹): లేదు (Nil)
పని పూర్తి చేయుటకు గడువు: 6 నెలలు
టెండర్ ముగింపు తేదీ: 25.03.2026

క్రమ సంఖ్య: 03 టెండర్ నం.: B/E.29/I/EGS/39/ 25-26 తేదీ: 05.03.2026 పని పేరు: BZA డివిజన్ – 1)SSE/Works/TUNI విభాగంలోని వై-సైడ్ స్టేషన్లలో దివ్యాంగుల సౌకర్యాలు ఏర్పాటు చేయడం (ADEN/ TUNI సబ్-డివిజన్ కింద). 2)BZA–VSKP సెక్షన్: చెబ్రోలు–దువ్వాడ స్టేషన్ల మధ్య జల సరఫరా వ్యవస్థ & RO ప్లాంట్లు ఏర్పాటు చేయడం.3)GLU, REG, NASP: SSE/W/TUNI సెక్షన్‌లో PF సంఖ్య 1,2 & 3 వద్ద IRS రకపు ప్లాట్‌ఫాం షెల్టర్స్ నిర్మించడం.4)ADEN/SLO సబ్-డివిజన్: ANV స్టేషన్‌లో ప్లాట్‌ఫారం 1,2 & 3 పై IRS రకపు షెల్టర్స్ పై కవర్ ఏర్పాటు చేయడం. 5)ADEN/SLO సబ్-డివిజన్: PAP, GLP, MPU & BVL స్టేషన్లలో ప్లాట్‌ఫారం 1,2 & 3 పై IRS రకపు షెల్టర్స్ పై కవర్ ఏర్పాటు చేయడం (Sr.DEN/North/BZA పరిధిలో). విద్యుత్ ఏర్పాట్లు కూడా ఇందులో భాగంగా ఉంటాయి.
టెండర్ అంచనా విలువ (₹): 72,13,355.44
E.M.D./బిడ్ సెక్యూరిటీ (₹): 1,44,300
టెండర్ పత్రాల ధర (₹): లేదు (Nil)
పని పూర్తి చేయుటకు గడువు: 12 నెలలు
టెండర్ ముగింపు తేదీ: 27.03.2026

1.పని పూర్తి వివరాలు, పైటెండర్ల సాదృశ్యమైన ప్రకృతి, అర్హత ప్రమాణాలు మొదలైన టెండర్ షరతులు/ఇతర వివరాలు "www.ireps.gov.in" వెబ్‌సైట్‌లో ప్రచురించబడిన టెండర్ పత్రాలలో లభ్యమవుతాయి.
2.టెండర్‌లో పాల్గొనదలచిన అభ్యర్థులు టెండర్ ముగింపు తేదీకి ముందే వెబ్‌సైట్ "www.ireps.gov.in" ను సందర్శించి, ఏవైనా మార్పులు/సవరణలు (corrigenda) గమనించాలని సలహా ఇవ్వబడుతోంది.

డివిజనల్ రైల్వే మేనేజర్ (ఎలక్ట్రికల్), విజయవాడ

**ఈ-టెండర్ నోటీసు సంఖ్య: 490/DRM/W/GNT** PUB/2072

క్రింద పేర్కొన్న పనుల కోసం సంతకం చేసిన అధికారి 07.04.2026 మధ్యాహ్నం 3:30 గంటల వరకు ఈ-టెండర్లను ఆహ్వానిస్తున్నారు.

క్రమ సంఖ్య: 01 టెండర్ ID: 2847 Sr DEN/DEN: Sr DEN/West పని వివరణ: TFTR – GNT–KCC సెక్షన్‌లో NBR–MAG స్టేషన్ల మధ్య Cess విస్తరణ/ మరమ్మత్తులు (DEN/West/GNT సెక్షన్‌లో). ట్రాక్‌ల మధ్య Cess పని: 1,17,565 క్యూమ్ Cess విస్తరణ: 36,034 క్యూమ్ Toe Bank: 51,870 క్యూమ్ Central Drain: 9,600 మీటర్లు
సుమారు విలువ (₹): 13,11,98,221/-
బిడ్ సెక్యూరిటీ (₹): 8,06,000/-

1. ఈ-బిడ్‌లను ఆన్‌లైన్‌లో సమర్పించడానికి చివరి తేదీ: 07.04.2026 మధ్యాహ్నం 3:30 గంటల వరకు. వివరణాత్మక సమాచారం కోసం వెబ్‌సైట్ www.ireps.gov.in లో లాగిన్ చేయండి.
2. ఏవైనా భవిష్యత్తులోని సమాచారం/సవరణలు (Corrigendum) ఈ-పోర్టల్ www.ireps.gov.in ద్వారా తెలియజేయబడతాయి.

డివిజనల్ రైల్వే మేనేజర్ (వర్క్స్), గుంటూరు
A2625

టెండర్‌కు సంబంధించిన మరిన్ని నిబంధనలు / వివరాలు తెలుసుకోవడానికి మరియు టెండర్ పత్రాలు డౌన్‌లోడ్ చేసుకోవడానికి దయచేసి క్రింది వెబ్‌సైట్లను సందర్శించండి: https://www.ireps.gov.in లేదా www.scr.indianrailways.gov.in



దక్షిణ మధ్య రైల్వే
మమ్మల్ని అనుసరించండి: @SCRRailwayIndia దక్షిణ మధ్య రైల్వే టెండర్ నోటీసుల వివరాలు మా వెబ్‌సైట్‌లో చూడవచ్చు: www.scr.indianrailways.gov.in

**ఇ-వేలం నోటీసు నం. BZA-27-2025-26** PUB/2079

భారత రాష్ట్రపతి తరపున, విజయవాడ డివిజన్‌లోని దక్షిణ మధ్య రైల్వే సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, పద్దెనిమిది సంవత్సరాలు పైబడిన భారతీయ పౌరులను మరియు కంపెనీలు/ సంస్థలను IREPS యొక్క 'ఇ-వేలం లీజింగ్' మాడ్యూల్ ద్వారా ఇ-వేలం కోసం ఆహ్వానిస్తున్నారు: www.ireps.gov.in విజయవాడ డివిజన్‌పై ప్రకటనలు మరియు ఇతర NFR మరియు పార్కింగ్ కాంట్రాక్టులను అప్పగించడానికి. ఇ-వేలం షెడ్యూల్ ఇక్కడ వివరించబడింది.

| షెడ్యూల్ రకం ఒప్పందం | వేలంలో ఆఫర్ చేయబడిన లాట్ల సంఖ్య | వేలం షెడ్యూల్ తేదీ మరియు ప్రారంభ సమయం |
|---|---|---|
| పార్కింగ్ | సమల్కోట్ (SLO) రైల్వే స్టేషన్ వద్ద సాధారణ ద్విచక్ర వాహనాల పార్కింగ్ లాట్లు | 16.03.2026 @11.00 Hrs |
| | "గుడూరు (GDR) రైల్వే స్టేషన్ వద్ద సాధారణ నాల్గచక్ర వాహనాల పార్కింగ్ స్టాండ్, సింగరాయకొండ (SKM) రైల్వే స్టేషన్ వద్ద ప్రీమియం మరియు సాధారణ ద్విచక్ర వాహనాల పార్కింగ్ స్టాండ్, టణుకు (TNKU) రైల్వే స్టేషన్ వద్ద సాధారణ ద్విచక్ర మరియు సాధారణ నాలుగు చక్రాల వాహనాల పార్కింగ్ స్టాండ్." | 25.03.2026 @11.00 hrs |

A2635 సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్, విజయవాడ

## నేటి మనదేశమ్ సంపాదకీయం

# యువ క్రికెటర్లకు ప్రేరణ

తొలిసారిగా కపిల్ దేవ్ సార్థ్యంలోని క్రికెట్ టీమ్ ప్రపంచ కప్ గెలిచిన 1983 నుంచి ఇప్పటి వరకు అనేక మార్పులు వచ్చాయి. క్రికెట్‌లో రూల్స్ మారాయి. అనేక నిబంధనలు వచ్చి పడ్డాయి. ట్వంటీ ట్వంటీ వచ్చింది. కొత్తగా ఐపిఎల్ మ్యాచ్‌లు వచ్చాయి. ఇవన్నీ కూడా యువ క్రెటర్లను ఆకర్షిస్తున్నాయి. ఇలా ఎన్ని మార్పులు వస్తున్నా..భారత్ క్రికెట్ వన్నె తగ్గకుండా పోరాడుతున్న స్ఫూర్తి అభినందనీయం. అంతేకాదు.. భారత్ క్రికెట్‌లో కొత్త నీరు నిరంతరంగా ప్రవహిస్తూనే ఉంది. సచిన్ టెండూల్కర్, గంగూలీ, యువరాజ్ సింగ్, జడేజా, వీరేంద్ర సెహ్వాగ్ ఇలా ఎందరో క్రికెటర్లు మన టీమ్ పనితనాన్ని మెరుగు పర్చారు. ధోనీ, విరట్ కోహ్లీ, రోహిత్ శర్మ లాంటి వారు క్రికెట్ స్వరూపాన్నే మార్చేశారు. ఇక మొన్న జరిగిన టీ ట్వంటీ వరల్డ్ కప్ పోటీల్లో భారత్ మరోమారు సత్తా చాటింది. ఇందులో గమనించాల్సిన విషయం ఏమంటే సంజూ శంసన్ విశ్వరూపం. అతడి ఆటతీరు చూడగానే సమయాను కూలంగా ధోనీలా, విరాట్‌లా, రోహిత్ శర్మలా విజృంభించగల నైపుణ్యం కనిపించింది. అన్నింటికి మించి అతను చేసిన ఓ చిన్న పని భారత ఔన్నత్యాన్ని, క్రికెట్ గొప్పతనాన్ని చాటింది. ఇంగ్లడ్తో జరిగిన సెమీస్‌లో సెంచరీ మిస్ అయిన సంజూ శాంసన్ మ్యాన్ ఆఫ్‌ది మ్యాచ్‌గా ఎన్నికయ్యాడు. కానీ భారత్ విసిరిన 250 పైన పరుగుల ఛాలెంజ్‌లో ఇంగ్లడ్ యువ కిశోరం బెథెల్ అద్భుతంగా రాణించాడు. ఒంటరి పోరుతో సెంచరీతో భారత్‌కు వణుకు పుట్టించాడు. అతను ఔట్ కాకుండా ఉంటే...భారత్ వెనుదిరుగేదే. సంజూ శాంసన్ తనకు దక్కిన మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును బెథెల్‌కు అందించారు. అతనే నిజమైన హీరో అని పొగిడారు. సంజూ చేసిన ఈ ఒక్క పనితో భారత్ గొప్పతనాన్ని ప్రపంచానికి చాటింది. అయితే అదే సంజూను మనం గుర్తించి, జట్టులోకి తీసుకోవడం లో రాజకీయాలు ఆడామని ఒప్పుకోవాల్సిందే. ప్రతిభకు ఏదీ అడ్డం కాదని, క్రీడల్లో రాజకీయాలు ఉండరాదని మనం గుర్తించాలి. అందులే ఇలాంటి వారందరినీ స్ఫూర్తిగా యువతలో కొత్త ఆశలు చిగురింప చేశారు. క్రికెట్‌లోచోటు దక్కేది 11 మందికే అని తెలిసినా భారత యువరక్తం ఇప్పుడు లక్షల్లో శిక్షణ తీసుకుంటున్నారు. తాము క్రికెటర్లుగా ఎదగాలనుకుంటున్నారు. ఇలాంటి వారు జాతీయ జట్టులో చోటు దక్కించుకోకున్నా, క్రికెట్‌ను నిలబడెతున్నారని తెలుసుకోవాలి. అందుకే ఇప్పుడు ఎక్కడ చూసినా క్రికెట్ కోచింగ్ సెటర్లు వెలిశాయి. ప్రతి ఇంట్లో ఒకరు క్రికెట్ బ్యాట్ పట్టుకుని మైదానంలోకి పరుగెడుతున్నాడు. ఇది ఓ రకంగా ప్రేరణ. యువతకు స్ఫూర్తి. అటు విమెన్ క్రికెట్ అయినా, ఇటు మెన్ క్రికెట్ అయినా ప్రతి ఒక్కరూ శిక్షణకు దిగుతున్నారు. మొత్తంగా టీమిండియా వరుసగా రెండోసారి, మొత్తంగా మూడో పర్యాయం టీ20 ప్రపంచకప్‌లో చాంపియన్‌గా నిలిచింది. అభిషేక్ శర్మ, సంజూ శాంసన్, ఇషాన్ కిషన్, తిలక్ వర్మ వంటి యోధులు ఇప్పుడున్న జట్టుకు వెన్నముక గా నిలిచారు. జస్‌ప్రీత్ బుమ్రా బౌలింగ్‌ను ముందుండి నడిపించాడు. అవసరమనుకున్న ప్రతిసారీ వికెట్ పడగొట్టి ప్రస్తుత తరంలో ప్రపంచ అత్యుత్తమ బౌలర్‌గా తనపేరును సార్థకం చేసుకున్నాడు. హార్దిక్ పాండ్యా, శివమ్ దూబే, అక్షర్ పటేల్ ఆల్‌రౌండ్ మెరుపులతో టీమిండియా ఆధిపత్యానికి ఎదురులేక పోయింది. జట్టులోని ఆటగాళ్లంతా కలిసికట్టుగా కదంతొక్కి ప్రపంచకప్ సంగ్రామంలో భారత్ మరోమారు విశ్వవిజేతగా ఆవిర్భవించడంలో విశేషంగా దోహదపడ్డారు. సమర్థ నాయకుడిగా ముందుండి నడిపించిన సూర్యకుమార్ జట్టు విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఈ విజయంతో భారత్‌కు ఐసీసీ ట్రోఫీలు అందించిన దిగ్గజాలు కపిల్ దేవ్, ఎంఎస్ ధోనీ, రోహిత్ శర్మ సరసన నిలిచాడు. ప్రపంచ క్రికెట్‌లో ఆధిపత్యాన్ని చాటుకుంటున్న భారత జట్టు సరికొత్త అధ్యాయాన్ని లిఖించింది. కపిల్ డెవిల్స్, ధోనీ సేన, రోహిత్ బృందం అద్భుత విజయాలను మరిపిస్తూ.. మరో విశ్వకప్పును ఒడిసి పట్టుకుంది. న్యూజిలాండ్‌ను ఏకపక్షంగా నిలువరించిన సూర్యకుమార్ సేన యావద్భారతావని గర్వించే ప్రదర్శన కనబరచింది. రెండేళ్ల క్రితం జరిగిన టోర్నీలో టైటిల్ గెలిచిన భారత జట్టు ఈసారి ట్రోఫీ నిలబెట్టుకొని సరికొత్త చరిత్ర సృష్టించింది. మొత్తంగా మూడోసారి ఈ కప్పును దక్కించుకొని మరే జట్టుకూ సాధ్యమవని అరుదైన ఘనతను అందుకొంది. ఈ అద్భుతానికి సాక్షిగా నిలిచిన అహ్మదాబాద్ స్టేడియంలో మూడేళ్లక్రితం వన్డే ప్రపంచకప్ ఫైల్లో ఎదురైన పరాజయ భారాన్ని దించేసుకుంది. ఆతిథ్య జట్టుకు కప్పు దక్కదన్న సెంటిమెంట్‌ను పటాపంచలు చేసింది. ఇలా ఎన్నో రికార్డుల పరంపరలు, మధురస్మృతులను క్రికెట్ అభిమానులకు అందించిన భారత జట్టు విజయం చిరస్మరణీయం. అహ్మదాబాద్ స్టేడియంలో పరుగులను రాబట్టడం కష్టమే అయినా, 255 పరుగుఉల కొట్టి, పటిష్టమైన న్యూజిలాండ్ జట్టును ధీకొటటిన తీరు యువ క్రికెటర్లకు స్ఫూర్తాదాయకం. క్రికెట్ అభిమానలకు విమెన్స్ డే ఆదివారం పండ గనింపింది. రెండేళ్ల క్రితం టీ20 ప్రపంచకప్ గెలిచిన టీమిండియాలోని రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, రవీంద్ర జడేజాలాంటి కీలక ఆటగాళ్లు ఇప్పుడు జట్టులో లేరు. అయినా, ఆ సీనియర్లు లేరన్న లోటు లేకుండా యువ క్రికెటర్లు అద్భుతంగా రాణించారు. ఇదే టీమిండియా బలం అని నిరూపించారు. కొత్త రక్తం వస్తూనే ఉంటుందని నిఊపించారు. టీమిండియా ఈసారి టోర్నీ ఆసాంతం అద్భుమైన ప్రదర్శనతో ఆకట్టుకుంది. టోర్నమెంట్ మొత్తంగా సూపర్–8 దశలో దక్షిణాఫ్రికాతో పరాజయం మినహా అన్ని మ్యాచుల్లోనూ విజయదుందుభి మోగించి సత్తా చాటుకుంది. మూడుసార్లు 250కి పైగా స్కోర్లు నమోదు చేయడం మన జట్టు యువ బ్యాటర్ల సత్తాకు నిదర్శనం. ఛేదన అయినా, లక్ష్యాన్ని నిర్దేశించడంలో అయినా జట్టు రాటుదేలిందనే చెప్పాలి. ఇలాగే కొనసాగితే రేపు జరిగే అనేక పోటీల్లో విజయం మనదే అవుతుంది. ఈ చిరస్మరణీయ గెలుపులో ఆటగాళ్ల పట్టుదల, ప్రతిభకు తోడు కోచ్ గౌతమ్ గంభీర్ పాత్ర ఎనలేనిది.

# భూ ఆక్రమణలపై పిడి యాక్ట్ ఏమయ్యింది

## దురాక్రమణదారులపై దమ్ముంటే చర్య తీసుకోవాలి... గీతం వర్సిటీ భూ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాల్సిందే... సిపిఎ కార్యదర్శి శ్రీనివాసరావు డిమాండ్



**విజయవాడ,మార్చి10(ఆర్ఎన్ఎ):** అతి పెద్ద భూ దురాక్రణదారు ప్రభుత్వమేనని సిపిఎం విమర్శించింది. ప్రభుత్వ, పేదల భూములాక్రమిం చిన పెత్తందారులపై చర్యలు తీసుకోవాలని సిపిఐ(యం) డిమాండ్ చేసింది. దీనికి సంబంధించి మంగళవారం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాస రావు ఓ ప్రకటనను విడుదల చేశారు. భూ అక్రమాలకు పాల్పడితే పీడీ యాక్ట్ పెడతామని హెచ్చరించిన ముఖ్యమంత్రి భూ దురాక్రమణలకు పాల్పడిన పెత్తందార్లు, కార్పొరేట్లు, ప్రజా ప్రతినిధులపై చర్య తీసుకొని తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నదన్నారు. ' మీ భూమి మీ హక్కు అంటున్న చంద్రబాబు నాయుడు గారు ఆచరణలో 'మీ భూమి మా హక్కు ' అన్నట్లుగా వ్యవహరిస్తున్నారని ఎద్దేవా చేశారు. అవసరం వున్నా లేకున్నా అభివృద్ధి జపం చేస్తూ వేలాది ఎకరాలను రైతుల నుండి వారి ఇష్టా ఇష్టాలతో నిమిత్తం లేకుండా సర్కార్ బలవంతంగా గుంజుకుంటున్నదని ధ్వజమెత్తారు. ప్రశ్నించిన వారిపై పీడీ యాక్ట్ పెడుతున్నారని అన్నారు. తప్పుడు కేసులు బనాయిస్తున్నారని చెప్పారు. రైతులను, కూలీలను, ఉత్పత్తిదారులను బెదిరిస్తున్నారని దుయ్యబట్టారు. ప్రభుత్వానికి ధైర్యం ఉంటే ? ఈ నిరంకుశ పద్ధతులకు స్వస్తి చెప్పి దురాక్రమణకు పాల్పడుతున్న బడా వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని కోరారు. విశాఖ గీతం యూనివర్సిటీ యాజమాన్యం ప్రభుత్వ భూమిని కబ్జా చేసినా ఏమి చర్యలు తీసుకున్నారు ? అని ప్రశ్నించారు. కానీ రైతుల భూముల కోసం పోరాడుతున్న అప్పలరాజును పిడియాక్టు కింద జైలుకు పంపించిన ఘనత చంద్రబాబు ప్రభుత్వానిది అని మండిపడ్డారు. ఇలాంటివి చాలా ఉదారణలున్నాయని తెలిపారు. పరిశ్రమలు పెట్టి ఉపాధి కల్పిస్తామని నమ్మబలికి ఏళ్ళు గడుస్తున్నా పరిశ్రమలు పెట్టకుండా భూములను తాకట్టు పెట్టి బ్యాంకు రుణాలు తీసుకొని ఎగ్గొట్టినవారు, పరిశ్రమలు పెట్టకుండా రియల్ ఎస్టేటుకు మళ్లించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని సిపిఐ(యం) రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తున్నదన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనేతర భూస్వాములు అధికారులతో కుమ్మక్కై అక్రమంగా భూములు తమ స్వాధీనంలో పెట్టుకున్నారని ఆరోపించారు. గిరిజన పేదలకు న్యాయం దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. నలభై యాభై సంవత్సరాలుగా దళితులు తదితర నిరుపేదలు సాగు చేసుకుంటున్న అసైన్డ్ భూములను పెత్తందార్లు లాగేసుకున్నారని ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ప్రభుత్వం పేదల భూ హక్కులను గుర్తించడం లేదు అని చెప్పారు. రొయ్యలు, చేపల చెరువులకు బినామీగా అసైన్డ్ భూములు మారిపోయాయన్నారు. దీర్ఘకాలంగా 22 ఏ కింద పేద, మధ్య తరగతి రైతుల భూములను వివాదంగా మార్చిన వాటిపై అధికారుల చుట్టూ కాళ్లరిగేటట్లు తిరుగుతున్నా పరిష్కారం కావడం లేదని వివరించారు. ఏడాదిలోగా పరిష్కరిస్తామని వాగ్దానం చేసిన చంద్రబాబు ప్రభుత్వం రెండేండ్లయినా పరిష్కరించడంలో విఫలమైందని, ఇప్పుడు మళ్లీ ఇంకో సంవత్సరం అంటున్నారు? దీనికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చి జూన్‌లోగా పరిష్కరించాలని సిపిఐ(యం) కోరుతున్నదని వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు.

# రంగానాయక్ సాగర్‌పై ఎందుకీ తాత్సారం

## ఆందోళన చేస్తున్న రైతుల అరెస్ట్ దుర్మార్గం... మండిపడ్డ కేంద్రమంత్రి బండి సంజయ్



**హైదరాబాద్, మార్చి 10 (ఆర్ఎన్ఎ):** రాజన్న సిరిసిల్ల జిల్లాలో రంగనాయక్ సాగర్ కెనాల్ పనులు పూర్తి చేయాలంటూ నిరసనకు దిగిన రైతులను అరెస్ట్ చేయడాన్ని కేంద్రమంత్రి బండి సంజయ్ ఖండించారు. సమస్యలపై ఆందోళన చేస్తే అరెస్ట్ చేస్తారా అని ప్రశ్నించారు. ఇదేనా ప్రజాప్రభుత్వం తీరు అంటూ విమర్శలు గుప్పించారు. మంగళవారం కేంద్రమంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని రైతులు నిరసన చేస్తే వారిని అరెస్ట్ చేస్తారా అంటూ మండిపడ్డారు. రంగనాయక్ సాగర్ నుంచి పెద్దలింగాపూర్, తంగళ్లపల్లి మండలానికి నీళ్లిచ్చే కాలువ పనులను ఎందుకు పూర్తి చేయడం లేదని కేంద్రమంత్రి ప్రశ్నించారు. రూ.3 కోట్ల నిధులు విడుదలయ్యాయని స్థానిక ఎమ్మెల్యే ప్రకటించి ఏడాది దాటినా పనులు ఎందుకు ప్రారంభించలేదని అడిగారు. కాలువ పనులు పూర్తి చేసి ఉంటే 9,500 ఎకరాలకు సాగునీరు అందేదని ఆయన స్పష్టం చేశారు. అధికారంలో ఉన్నన్నాళ్లు రంగనాయక్ సాగర్ ద్వారా సిరిసిల్ల జిల్లాకు నీరివ్వని కేటీఆర్ రైతు ద్రోహి అని బండి సంజయ్ ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పాలకుల వైఫల్యాల వల్ల రైతులు వరుసగా పంటలు నష్టపోతున్నారని కేంద్రమంత్రి అన్నారు. తక్షణమే పనులు ప్రారంభించకపోతే ఆయా ప్రాంత రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. న్యాయం చేయాలని అడిగిన రైతులను అరెస్ట్ చేయడం అన్యాయమన్నారు. రైతులకు సంఘీభావం తెలిపిన బీజేపీ జిల్లా అధ్యక్షులు గోపీ సహా పార్టీ నాయకులను స్టేషన్‌కు తరలించడం అక్రమమని కేంద్రమంత్రి తీవ్రంగా మండిపడ్డారు. రైతులపై కేసులు నమోదు చేస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని హెచ్చరించారు. తక్షణమే రైతులను, బీజేపీ నేతలను బేషరతుగా విడుదల చేయాలన్నారు. రంగనాయక్ సాగర్ 11వ ప్యాకేజీ నుంచి ఎల్ఎం 4, ఎల్ఎం 6 ద్వారా కాలువ పనులను పూర్తి చేయాలని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ డిమాండ్ చేశారు.

# వేట్లపాలెం బాణాసంచా కేంద్రం పేలుడు ఘటనలో సేవలందించిన మహిళా అధికారులకు ఘన సత్కారం



**కాకినాడ, మార్చి 10 (నేటి మనదేశమ్ ప్రతినిధి):** కాకినాడ జిల్లా వేట్లపాలెం గ్రామంలోని బాణాసంచా తయారీ కేంద్రంలో ఇటీవల చోటుచేసుకున్న పేలుడు ఘటన సమయంలో వెంటనే స్పందించి సహాయక చర్యల్లో చురుకుగా పాల్గొని బాధితులకు సేవలందించిన ఇద్దరు మహిళా అధికారులను అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఘనంగా సత్కరించారు. రాజ్యసభ సభ్యులు శ్రీ సానా సతీష్ బాబు గారి ఆదేశాల మేరకు కాకినాడలోని ఆయన కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో పెద్దాపురం ఎస్ఐ మౌనిక, సామర్లకోట ఎంపీడీవో హిమా మహేశ్వరిలకు కార్యాలయం ఇన్‌చార్జ్ మేకా లక్ష్మణ్ మూర్తి, కాకినాడ నగరపాలక సంస్థ మాజీ డిప్యూటీ మేయర్ అరిగెల శ్రీనివాసరావు (బున్ని) పుష్పగుచ్ఛాలను అందించి, శాలువా కప్పి సత్కరించారు.. ఈ సందర్భంగా కార్యాలయం ఇంచార్జ్ మేకా లక్ష్మణ్ మూర్తి మాట్లాడుతూ వేట్లపాలెం పేలుడు ఘటన సమయంలో పరిస్థితులు క్లిష్టంగా ఉన్నప్పటికీ వెంటనే ఘటన స్థలానికి చేరుకుని గాయపడిన వారికి సహాయక చర్యలు చేపట్టడం, స్థానిక అధికారులతో సమన్వయం చేసుకుంటూ బాధితులకు తక్షణ సహాయం అందించడం అభినందనీయమని పేర్కొన్నారు. ప్రమాదకర పరిస్థితుల్లో కూడా ధైర్యసాహసాలతో విధులు నిర్వహిస్తూ మానవత్వాన్ని చాటారని కొనియాడారు. మహిళలు అన్ని రంగాల్లో తమ ప్రతిభను నిరూపించుకుంటూ సమాజానికి సేవలందిస్తున్నారని అన్నారు. అత్యవసర పరిస్థితుల్లో మహిళా అధికారులు చూపిన ధైర్యం, సేవాభావం ఇతరులకు ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. సమాజానికి విశిష్ట సేవలందించిన మహిళలను మహిళా దినోత్సవం సందర్భంగా సత్కరించడం గర్వకారణమని అన్నారు. ఈ సందర్భంగా ఎస్ఐ మౌనిక, ఎంపీడీవో హిమా మహేశ్వరి మాట్లాడుతూ వేట్లపాలెం ఘటన చాలా దురదృష్టకరమని పేర్కొన్నారు. విధుల్లో భాగంగా బాధితులను ఆదుకోవడం తమ బాధ్యతగా భావించి సహాయక చర్యల్లో పాల్గొన్నామని తెలిపారు. జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీతో పాటు మొత్తం జిల్లా యంత్రాంగం సమన్వయంతో పనిచేయడం వల్ల సహాయక చర్యలు సమర్థవంతంగా నిర్వహించగలిగామని చెప్పారు. తమ సేవలను గుర్తించి సత్కరించిన రాజ్యసభ సభ్యులు శ్రీ సానా సతీష్ బాబు గారికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంకమరెడ్డి రామునాయుడు,ఆనంద్ న్యూటన్,లాయర్ దుర్గాప్రసాద్,జిన్నూరు బాబ్జి, బర్ల శ్రీనివాస్,కోటిపల్లి సతీష్,బొబ్బిలి దొరబాబు, పబ్బినీడి అజయ్ కుమార్, కార్యాలయ సిబ్బంది, స్థానిక నాయకులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

# న్యాయవ్యవస్థ అవినీతి పాఠ్యాంశం తొలగించాం

## పుస్తకాన్ని అందుబాటులో లేకుండా చేశాం... సుప్రీం కోర్టుకు ఎన్‌సిఇఆర్‌టి బహిరంగ క్షమాపణలు

**న్యూఢిల్లీ,మార్చి10(ఆర్ఎన్ఎ):** 8వ తరగతి సోషల్ పాఠ్యపుస్తకంలో వివాదాస్పద అధ్యాయంపై 'నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ ఎన్‌సిఇఆర్‌టి మంగళవారం సుప్రీంకోర్టుకి బహిరంగ క్షమాపణలు తెలిపింది. న్యాయ వ్యవస్థలో 'అవినీతి'గురించి పాఠ్యపుస్తకంలో ప్రస్తావించడంపై సుప్రీంకోర్టు రెండు వారాల క్రితం ఎన్‌సిఇఆర్‌టిని మందలించిన సంగతి తెలిసిందే. ఈ అధ్యాయంపై సుమోటోగా కేసు నమోదు చేసిన సుప్రీంకోర్టు.. పాఠ్యపుస్తకాన్ని ఉపసంహరించుకోవాలని ఆదేశించింది. దీంతో ఎన్‌సిఇఆర్‌టి మంగళవారం ఒక ప్రకటన విడుదల చేసింది. ఎన్‌సిఇఆర్‌టి డైరెక్టర్ , సభ్యులు పుస్తకంలో ప్రకటించిన అద్యాయానికి బేషరతుగా, తగిన అర్హతతో కూడిన క్షమాపణలు చెబుతున్నాం. మొత్తం పుస్తకం ఉపసంహరించబడింది. అందుబాటులో లేదని పేర్కొంది. ఈ కారణంగా కలిగిన అసౌకర్యానికి చింతిస్తున్నాం. సభ్యుల అవగాహనకు అభినందిస్తున్నాం అని పేర్కొంది. విద్యా సమాచారంలో ఖచ్చితత్వం, సున్నితత్వం మరియు బాధ్యతతో కూడిన అత్యున్నత ప్రమాణాలను నిర్వహించడానికి ఎన్‌సిఇఆర్‌టి కట్టుబడి ఉందని పేర్కొంది. వివరాల్లోకి వెళితే.. జాతీయ విద్యా పరిశోధన శిక్షణ మండలి ఎన్‌సీఈఆర్‌టీ 8వ తరగతి సాంఘిక శాస్త్రం పాఠ్యపుస్తకంలో 'న్యాయవ్యవస్థలో అవినీతి'ని పాఠ్యాంశంగా చేర్చటం దేశ వ్యాప్తంగా తీవ్ర చర్చకు దారి తీసిన సంగతి తెలిసిందే. ఆ పుస్తకంపై దేశ అత్యున్నత న్యాయ స్థానం సుప్రీంకోర్టు బ్లాంకెట్ బ్యాన్ విధించిన రెండు వారాల తర్వాత ఈ వివాదంపై ఎన్‌సీఈఆర్‌టీ స్పందించింది. సోమవారం బహిరంగ క్షమాపణలు చెప్పింది. పుస్తకం మొత్తాన్ని ఉపసంహరించుకున్నామని వెల్లడించింది. ఈ మేరకు ఓ ప్రకటన విడుదల చేసింది. ప్రస్తుతం ఆ పుస్తకాన్ని పూర్తిగా ఉపసంహరించుకోవడం జరిగింది. అది ఇప్పుడు అందుబాటులో లేదు' అని స్పష్టం చేసింది. పాఠ్యాంశంపై సుప్రీంకోర్టు తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేసింది. ఆ పాఠ్యాంశాన్ని న్యాయ వ్యవస్థపై ప్రణాళికాబద్ధమైన, లోతైన దాడిగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ అభివర్ణించారు. న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేందుకు ఈ భూమ్మీద ఎవరినీ అనుమతించ నని తేల్చి చెప్పారు. బుక్‌పై నిషేధం విధించారు. అన్ని కాపీలను సీజ్ చేయాలని అధికారులను ఆదేశించారు. అంతేకాదు.. ఆన్‌లైన్ ద్వారా పుస్తకం మొత్తం

# మిలియన్ మార్చ్‌కు 15 ఏళ్లు

## ఉద్యమ ప్రస్తానంలో కీలక ఘట్టం :కెటిఆర్ ట్వీట్

**హైదరాబాద్,మార్చి10(ఆర్ఎన్ఎ):** స్వరాష్ట్ర సాధన కోసం ట్యాంక్‌బండ్‌పై యావత్ తెలంగాణ ప్రజలు ఏకమై గర్జించి నేటికి 15 ఏళ్లు పూర్తయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గుర్తుచేశారు. స్వరాష్ట్ర సాధన కోసం నాడు ఉద్యమ ప్రస్థానం ఉవ్వెత్తున ఎగిసిందని, తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసేలా చేసిన కీలక ఘట్టాల్లో మిలియన్ మార్చ్ ఒకటని ఆయన పేర్కొన్నారు. 2011 మార్చి 10న మిలియన్ మార్చ్ సందర్భంగా నిర్బంధాలు, దిగ్బంధాలు, అడ్డంకులు, బ్యారికేడ్‌లు, ఇనుపకంచెలు ఇవేవీ తెలంగాణ ఉద్యమకారుల స్ఫూర్తిని దెబ్బతీయలేకపోయాయని కేటీఆర్ ఎక్స్ ఖాతాలో రాసుకొచ్చారు. లక్షల గొంతుకలు తెలంగాణ రాష్ట్రం కోసం ట్యాంక్‌బండ్‌పై నినదించిన అద్భుత పోరాట రూపానికి నేటితో 15 ఏళ్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు. తెలంగాణ అమరవీరులకు జోహార్లు, జై తెలంగాణ అంటూ తన పోస్టును ముగించారు. ఈ పోస్టుకు మిలియన్ మార్చ్ నాటి కొన్ని ఫొటోలను షేర్ చేశారు. కింది పోస్టులో ఆ ఫొటోలను మీరూ చూడవచ్చు..

# స్టార్టప్‌లకు, ఆధునిక సాంకేతిక అభివృద్ధికి ఆర్‌ఆర్‌క్యాట్ మద్దతు






**ఇండోర్, మార్చి 10 (పిఐబి):** అణుశక్తి విభాగం పరిధిలో పనిచేస్తున్న దేశంలోని ఆరు ప్రముఖ పరిశోధనా కేంద్రాలలో ఒకటైన రాజా రామన్న సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ , ఇండోర్, స్టార్టప్‌లకు సాంకేతిక మార్గదర్శకత్వం మరియు పరిశోధనా సహాయాన్ని అందిస్తూ ముందుకు సాగుతోంది. పార్టికల్ యాక్సిలరేటర్లు, లేజర్లు మరియు సంబంధిత సాంకేతికతల రూపకల్పన, పరిశోధనల్లో నైపుణ్యం కలిగిన ఆర్‌ఆర్‌క్యాట్, సామాజిక మరియు పారిశ్రామిక ప్రయోజనాలున్న అనువర్తనాలను అభివృద్ధి చేయడంలో యువ ఆవిష్కర్తలకు సహకరిస్తోంది. 1984లో స్థాపించబడిన ఈ కేంద్రం తరువాత రాజా రామన్న సెంటర్ ఫర్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీగా పేరు మార్చబడింది. యాక్సిలరేటర్లు, లేజర్ సాంకేతికతలలో కేంద్రం విశేష నైపుణ్యాన్ని అభివృద్ధి చేసుకుంది. ఈ సాంకేతికతలు కమ్యూనికేషన్స్, పరిశ్రమలు, వైద్య రంగాలలో ఉపయోగ పడుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మీడియా ప్రతినిధులతో జరిగిన పరస్పర చర్చలో టెక్నాలజీ డెవలప్‌మెంట్ అండ్ సపోర్ట్ గ్రూప్ డైరెక్టర్ డా. జిష్ణు ద్వివేది మాట్లాడుతూ విశాఖపట్నంలో ప్రోటాన్ యాక్సిలరేటర్ వ్యవస్థను ఏర్పాటు చేసే దిశగా ఆర్‌ఆర్‌క్యాట్ పనిచేస్తోందని తెలిపారు. ఇందుకు అవసరమైన సాంకేతికతలు ప్రస్తుతం పరీక్ష దశలో ఉన్నాయని, ఈ సదుపాయం పూర్తిగా స్థాపించేందుకు రెండు దశాబ్దాలు పట్టవచ్చని చెప్పారు. భారత్‌లో సమృద్ధిగా లభించే థోరియం నుండి యురేనియం ఉత్పత్తికి ఈ వ్యవస్థ సహాయపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఆర్‌ఆర్‌క్యాట్‌లో జాతీయ స్థాయి ప్రయోగశాలలు ఉన్నాయని, వాటిలో పరిశ్రమలు, వైద్య సంస్థలు మరియు విద్యాసంస్థలు వినియోగదారుల ప్రయోగాలు నిర్వహిస్తున్నాయని డా. ద్వివేది తెలిపారు. లీనియర్ యాక్సిలరేటర్ల ఆధారంగా అభివృద్ధి చేసిన ఎలక్ట్రాన్ బీమ్ రేడియేషన్ సదుపాయం ద్వారా వైద్య పరికరాల శుద్ధీకరణ జరుగుతుండగా, ఈ సాంకేతికతను 35కు పైగా దేశాలకు వాణిజ్యపరంగా ఎగుమతి చేస్తున్నట్లు తెలిపారు. "శాస్త్రీయ జ్ఞానం సామాజిక ప్రయోజనాలకు చేరేలా పరిశోధన కార్యక్రమాలను ఆర్‌ఆర్‌క్యాట్ కొనసాగిస్తోంది," అని ఆయన చెప్పారు. ఆర్‌ఆర్‌క్యాట్‌లోని ఏఐసీ పీఐఈ--హబ్ డైరెక్టర్ డా. క్రైస్ట్ ప్రకాష్ పాల్ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాల్లో పరిశ్రమలు మరియు స్టార్టప్‌లతో 32 ఒప్పందాలు కుదుర్చుకున్నామని, ప్రస్తుతం తొమ్మిది స్టార్టప్‌లు కేంద్రంతో కలిసి పనిచేస్తున్నాయని తెలిపారు. వాటిలో ఒక స్టార్టప్ పారిశ్రామిక వినియోగదారుల కోసం మెటల్ 3డి ప్రింటింగ్ సాంకేతికతపై పని చేస్తుండగా, మిషన్ క్రిటికల్ ఫోటోనిక్స్ అనే స్టార్టప్ రైల్వేలు, విమానాలు, వంతెనలలో ఉపయోగించే ఫైబర్ ఆధారిత ఆప్టికల్ సెన్సర్లను అభివృద్ధి చేస్తోంది. మరో స్టార్టప్ ఎంఆర్ఐ యంత్రాల్లో ఉపయోగించే 30 కెల్విన్ క్రయోకూలర్ల అభివృద్ధికి ఆర్‌ఆర్‌క్యాట్ మద్దతు అందిస్తోంది. తక్కువ ఖర్చుతో కూడిన మెటల్ 3డి ప్రింటర్లపై ఆర్‌ఆర్‌క్యాట్ పేటెంట్లు కలిగి ఉందని, అలాగే కేంద్రం అభివృద్ధి చేసిన లేజర్ సాంకేతికతలు పరిశ్రమలకు పాడైపోయే యంత్రాలను పునరుద్ధరించడంలో సహాయపడుతున్నాయని డా. పాల్ తెలిపారు. ఈ కార్యక్రమం పి ఐ బి వార్షిక టూర్‌లో భాగంగా కొంతమంది మీడియా ప్రతినిధులను మధ్యప్రదేశ్ తీసుకు వెళ్ళారు. ఈ బృందంలో పెద్ద పేపర్లైన ఈనాడు, సాక్షి , ఆంధ్రజ్యోతి, విశాలాంధ్ర, ఇంగ్లీష్ దినపత్రికలు ది హిందూ, హ్యాంసిండియా మరియు స్కై లైన్ మరియు చిన్న పత్రిక రాయలసీమ సమయం ప్రతినిధులు మరియు ఎలక్ట్రానిక్ మీడియాకు సంబంధించి దూరదర్శన్ , మున్సఫ్ టీవీ ప్రతినిధులు పాల్గొన్నారు, స్కై లైన్ దినపత్రిక తరపున విజయవాడ బ్యూరో నించి స్టాఫ్ రిపోర్టర్ పాల్గొన్నారు.

# గుడ్లు ఎక్కువ రోజులు నిల్వ ఉండాలంటే



గుడ్డులో మంచి పోషక విలువలు, ప్రోటీన్స్ ఉంటాయి. ఇంట్లో పిల్లలు, పెద్దలు వీటిని తింటుంటారు. దీంతో ఎక్కువమొత్తంలో కొనుగోలు చేస్తుంటాం. అయితే సరైన పద్ధతిలో వాటిని నిల్వ చేసుకోకపోతే త్వరగా పాడైపోతాయి. అలా పాడవ్వకుండా ఎక్కువ రోజులు నిల్వ ఉండాలంటే ఏం చేయాలో చూద్దాం.


సాల్మెనెల్లా బ్యాక్టీరియా గుడ్ల షెల్, లోపల ఉంటుంది. ఈ బ్యాక్టీరియా పెరుగుదల గది ఉష్ణోగ్రత కంటే చల్లగా ఉంటుంది. ఫ్రిజ్లో పెడితే బ్యాక్టీరియా గుడ్డుపైనే కాకుండా మిగతా పదార్థాలపై కూడా వ్యాపిస్తుంది.. అందుకే వీటిని ఎట్టి పరిస్థితులలో ఫ్రిజ్‌లో పెట్టకూడదు.

కోడిగుడ్డు ఎక్కువకాలం తాజాగా ఉండాలంటే వాటిని ఎక్కువగా కదపడకూడదు. వెడల్పుగా ఉండే భాగాన్ని పైకి వచ్చేలా వెడల్పు తక్కువ ఉండే భాగాన్ని కిందికి వచ్చేలా ఉంచాలి.

అలాగే గుడ్ల పైన పెంకుపై కొద్దిగా నూనె రాసి పెడితే, కనీసం 10 నుండి 12 రోజుల వరకూ తాజాగా ఉంటాయి.


టిష్యూ పేపర్లలో చుట్టి నిల్వ చేసుకున్నా ఎక్కువ రోజులు తాజాగా ఉంటాయి.

# కిడ్నీ సమస్యలు ఉంటే..



మనం ఆరోగ్యంగా ఉండేందుకు సహాయపడే వాటిల్లో ముఖ్యమైనవి కిడ్నీలు. ఇవి రక్తంలోంచి వ్యర్థాలను, విష తుల్యాలను వడపోస్తాయి. మూత్రం రూపంలో వాటిని బయటకు వెళ్లగొడతాయి. అందుకే కిడ్నీలను జాగ్రత్తగా చూసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. మనం తినే పదార్థాలు, తాగే పానీయాలన్నీ జీర్ణమయ్యాక రక్తం ద్వారా కిడ్నీలకు చేరు కుంటాయి. శరీరానికి హాని కలిగించే కొవ్వు, ఉప్పు, చక్కెరలనూ ఇవి శుద్ధి చేస్తాయి. వీటిని ఎక్కువగా తింటే అధిక రక్తపోటు, ఊబకాయం, మధుమేహం వంటి సమస్యలకూ దారితీస్తుంది. ఇవి కిడ్నీలకూ చేటు చేస్తాయి. కాబట్టి కూరగాయలు, పండ్లు, పొట్టుతీయని ధాన్యాలతో కూడిన మంచి ఆహారం ఎక్కువగా తినాలి. ముఖ్యమైన పోషకాలు కిడ్నీలకు చేరుకునేలా, మూత్రం రూపంలో వ్యర్థాలు బయటకు వెళ్లిపోయేలా చేయటానికి నీరు తోడ్పడుతుంది. తగినంత నీరు తాగకపోతే కిడ్నీల్లో రక్తాన్ని శుద్ధిచేసే నెఫ్రాన్లు పనిచేయటం మానేస్తాయి. ఒంట్లో నీటిశాతం తరచూ తగ్గుతుంటే కిడ్నీలు దెబ్బతినొచ్చు. కాబట్టి దాహం వేసినంతవరకూ ఆగకుండా మధ్యమధ్యలో నీళ్లు తాగటం మంచిది. ఒకవేళ వేడి వాతావరణంలో ఉంటే ఇంకాస్త ఎక్కువగానూ తాగాలి. మంచి ఆహారం మాదిరిగానే వ్యాయామమూ గుండె జబ్బు, మధుమేహం నివారణకు తోడ్పడుతుంది. పరోక్షంగా కిడ్నీ జబ్బు ముప్పు తగ్గుతుంది. అలాగని వెంటనే జిమ్‌లకు వెళ్లి, భారీ కసరత్తులు చేస్తారేమో. ఇది తగదు. శక్తికి మించిన.. ముఖ్యంగా ఉన్నట్టుండి అతిగా వ్యాయామం చేయటమూ కిడ్నీలను దెబ్బతీయొచ్చు. కాబట్టి నెమ్మదిగా వ్యాయామాలు ఆరంభించాలి. రోజుకు కనీసం అరగంట సేపైనా నడవాలి. కిడ్నీ జబ్బు ముప్పును తెలుసు కోవటం చాలా ముఖ్యం. ఇంట్లో ఎవరైనా గుండెజబ్బు, అధిక రక్తపోటు, మధుమేహం, కిడ్నీ వైఫల్యం గలవారుంటే ఇది మరింత ప్రధానం. కిడ్నీ పనితీరును తెలిపే పరీక్షలతో జబ్బులను ముందుగానే పట్టుకోవచ్చు. పరిస్థితి చేజారకుండా చూసుకోవచ్చు.

# తమలపాకుతో ఆరోగ్యానికి మేలు



ఈ కాలంలో విరివిగా దొరికే తమలపాకులు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని నిపుణులు అంటున్నారు. తమల పాకులోని ఔషధ గుణాలు అన్ని రకాల సమస్యల నుంచి శరీరాన్ని రక్షిస్తాయి. తమలపాకులో శరీరానికి అవసరమైన విటమిన్ సి, థయామిన్, నియాసిన్, రైబోఫ్లావిన్, బీటా కెరోటిన్, కాల్షియం, కార్బోహైడ్రేట్లు, ప్రొటీన్లు, ఫైబర్, కాపర్, ఫాస్పరస్, ఐరన్ వంటి పలు పోషకాలు ఉన్నాయి.

తమలపాకులోని ఔషధ గుణాలు దగ్గు, బ్రాంకైటిస్, ఉబ్బసం వంటి శ్వాసకోశ వ్యాధుల చికిత్సలో ఉపయోగపడతాయి. తమలపాకులను నమలడం వల్ల ఔషధ గుణాలు నేరుగా శరీరానికి లభించి ఆయా సమస్యలను దూరం చేస్తాయి.

తమలపాకులోని యాంటీ హైపర్‌గ్లైసీమిక్ లక్షణాలు రక్తంలోని షుగర్ లెవెల్స్‌ను అదుపులో ఉంచడానికి సహాయ పడతాయి.

ఒత్తిడి, ఆందోళన సమస్యలకు తమలపాకులతో ఉపశమనం పొందవచ్చు.

# నత్తల విసర్జకాలు, తేనెటీగల విషంతో బ్యూటీ ప్రొడక్ట్స్!




కొరియన్ అమ్మాయిలు ఎంత తెల్లగా ఉంటారో తెలిసిందే. వారి ముఖం చక్కగా కాంతివంతంగా ఎలా ఉంటుందో చెప్పవలసిన అవసరం లేదు. గ్లాస్ మాదిరిగా ముఖం మెరిసిపోతుంది. చిన్న మచ్చ కూడా ఉండదు. అలాంటి అందం సొంతం చేసుకోవాలంటే కొరియన్ బ్యూటి ప్రోక్ట్సలో వాడే వాటి గురించి తెలుసుకోవాల్సిందే. కొరియన్ పురుషులు, స్త్రీలు గ్లామర్ విషయంలో చాలా కేర్ తీసుకుంటారు. వాళ్ల చర్మ సంరక్షణ ఉత్పత్తుల్లో వాడే వాటిని చూస్తే షాకవ్వతాం. ఎందుకంటే వాళ్లు చాలా విభిన్నమైన వాటితో ఫేస్‌క్రీంలు తయారు చేస్తారు. బహుశా అందుకే కాబోలు వారు అంత అందంగా ఉంటారు. కొరియన్ బ్యూటీ ప్రొడక్ట్స్‌లో ఏం ఉపయోగిస్తారో చూస్తే




షాకవ్వుతారు.

### నతల విసర్జకాలు లేదా నత్తల జిగురు

నత్తల విసర్జకాల్లో అల్లాంటోయిన్, కొల్లాజెన్, ఎలాస్టిన్, గ్లైకోలిక్ యాసిడ్, విటమిన్ ఏ, సీలు, యాంటీబయాటిక్ పెప్టైడ్స్ తదితరాలు ఉంటాయి. నత్త విసర్జకాలు లేదా నత్త జిగురు వృద్ధాప్య ఛాయల్ని తగ్గిస్తాయి. చర్మాన్ని హైడ్రేటడ్‌గా ఉంచుతాయి. ఇందులో ఉండే యాంటీఆక్సిడెంట్, యాంటీమైక్రోబయల్ మొటిమల వల్ల అయ్యే గాయాలను నయం చేయడమే గాక మృతకణాలను తొలగిస్తుంది. చర్మం ప్రకాశవంతంగా మెరుస్తూ ఉంటుంది. ఇందులో జింక్ కూడా ఉంటుంది. ఇది చర్మాన్ని తేమగా మృదువుగా చేస్తుంది. నత్త విసర్జకాలతో తయారు చేసిన కొరియన్ ప్రొడక్ట్‌లకు విపరీతమైన డిమాండ్ ఉందట. వీటిని వాడితే కచ్చితంగా కొరియన్ అమ్మాయిల్లా తెల్లగా ఉంటారని చెబుతున్నారు సౌందర్య నిపుణులు.



### తేనెటీగల జిగురు

తేనెటీగల నుంచి లభించే ఈ రెసిన్‌ని ఆంగ్లంలో ప్రొపోలిస్ అంటారు. పుప్పొడి అనేది యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ పదార్థం. ఇది ముడుతలను తగ్గించే లక్షణాలతో పాటు మొటిమల బారిన పడే చర్మం, బ్రేక్‌అవుట్‌లకు చికిత్స చేయడంలో సహాయపడుతుంది. యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండటం వల్ల, పుప్పొడి చర్మానికి కలిగే నష్టాలను నియంత్రిస్తుంది. పుప్పొడి చర్మంపై సున్నితమైన మెరుపును వదులుతుంది. ఇది క్రమం తప్పకుండా అప్లై చేస్తే చర్మంలోని మృతకణాలను తొలగించి యవ్వన రూపాన్ని ఇస్తుందని కొరియన్లు గట్టిగా విశ్వసిస్తారట.

### రంధ్రాలను తగ్గించేందుకు "ముత్యం"..

కొరియన్ బ్యూటీ ఉత్పత్తులలో ముత్యాలు చాలా కాలంగా



ముఖ్యమైన పదార్థంగా ఉన్నాయి.ముత్యాలు మొటిమలను తొలగించడంలో ఉపయోగపడతాయని చెబుతారు. అలాగే ముఖంపై విస్తరించిన రంధ్రాలను తగ్గిస్తాయని, చర్మం వృద్ధాప్యం బారిన పడకుండా నివారిస్తుందని విశ్వసిస్తారు.

### తేనెటీగ విషం

తేనెటీగ విషం ఆమ్ల స్వభావం కలిగి ఉంటుంది. తేనెటీగలు బెదిరినప్పుడు వాటిని స్రవిస్తాయి. అనేక చర్మ సంరక్షణ సంస్థలు సీరమ్స్, మాయిశ్చరైజర్స్ వంటి ఉత్పత్తులకు తేనెటీగ విషాన్ని వాడతాయి.ఈ పదార్థాలు చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. ఇందులో వాపును తగ్గించే లక్షణాలు ఉంటాయి. యాంటీ బాక్టీరియల్ ప్రభావాలను అందిస్తుంది, ముడతలను తగ్గిస్తుంది.అదే విధంగా వెదురు, యుసా (ఒక రకమైన పండు), సెంటెల్లా ఆసియాటికా, బిర్చ్ సాప్ వంటి అనేక పదార్థాలు కొరియన్ సౌందర్య ఉత్పత్తులలో ఉపయోగిస్తారు.

# పశ్చిమ ఆసియాలోని పరిస్థితిపై రాజ్యసభలో విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్. జైశంకర్ సుమోటో ప్రకటన

**న్యూఢిల్లీ, మార్చి 10 (పిఐబి)**పశ్చిమ ఆసియాలో చోటుచేసుకుంటున్న తాజా పరిణామాల గురించి ఈ ఎగువ సభకు తెలియజేయడానికి నేను నిలుచున్నాను. ఈ పరిణామాలు మనందరికీ తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. గౌరవ సభ్యులకు తెలిసినట్లుగా ఈ తాజా సంఘర్షణ 2026 ఫిబ్రవరి 28న ప్రారంభమైంది. ఇది ఒకవైపు ఇజ్రాయెల్, అమెరికా.. మరోవైపు ఇరాన్ మధ్య కాల్పులు మాత్రమే కాకుండా అనేక గల్ఫ్ దేశాలపై దాడులు కూడా జరిగాయి. ఇరాన్ నాయకత్వ స్థాయిలో ఉన్నవారితో సహా అనేకమందికి ప్రాణనష్టం సంభవించటంతో పాటు ఈ ప్రాంతంలో మౌలిక సదుపాయాలు కూడా ధ్వంసమయ్యాయి.

2. మొట్టమొదటగా ఫిబ్రవరి 28న ప్రభుత్వం ఒక ప్రకటన విడుదల చేస్తూ ఈ పరిస్థితిపై తీవ్ర ఆందోళనను వ్యక్తం చేసింది. అన్ని పక్షాలు సంయమనం పాటించాలని.. ఉద్రిక్తతలు పెరగకుండా చూడాలని, ప్రజల భద్రతకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరింది. ఉద్రిక్తతలను తగ్గించడానికి, మూల కారణాలను పరిష్కరించడానికి చర్చలు, దౌత్య మార్గాలను అనుసరించాలని మేం నమ్మాం.. ఇప్పటికీ నమ్ముతున్నాం. అధ్యక్షా, ఈ ప్రాంతంలోని అన్ని దేశాల సార్వభౌమాధికారం, ప్రాంతీయ సమగ్రతను గౌరవించడం కూడా అత్యంత ఆవశ్యకం.

3. పరిస్థితి తీవ్రత దృష్ట్యా గౌరవనీయ ప్రధానమంత్రి అధ్యక్షతన మార్చి 01న భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఎస్) సమావేశమైంది. ఇరాన్‌పై జరిగిన వైమానిక దాడులు, ఆ తర్వాత పలు గల్ఫ్ దేశాలలో జరిగిన దాడుల గురించి ఈ కమిటీకి వివరించాం. ఈ ప్రాంతంలోని భారతీయ సమాజం భద్రత, రక్షణపై సీసీఎస్ ఆందోళన వ్యక్తం చేసింది. ప్రాంతీయ భద్రతతో పాటు ఆర్థిక, వాణిజ్య కార్యకలాపాలపై పడే ప్రభావంపై కూడా ఇది దృష్టి సారించింది. ఈ ప్రాంతం గుండా ప్రయాణిస్తున్న భారతీయులు, ఆయా దేశాల్లో ప్రణాళికలో ఉన్న పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి కమిటీకి తెలియజేశాం. ఈ సమస్యలకు పరిష్కారం చూపేలా తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత మంత్రిత్వ శాఖలు, విభాగాలను కమిటీ ఆదేశించింది. గౌరవనీయ ప్రధానమంత్రి తాజా పరిణామాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. సమర్థవంతమైన చర్యలు తీసుకునేందుకు సంబంధిత మంత్రిత్వ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయి.

4. ఈ పోరాటం మరింత తీవ్రతరమైంది.. ఆ ప్రాంతంలో భద్రతా పరిస్థితి గణనీయంగా క్షీణించింది. వాస్తవానికి ఈ సంఘర్షణ ఇతర దేశాలకు కూడా వ్యాపించిందని.. దీనివల్ల భారీ విధ్వంసం, మరణాలు సంభవిస్తున్నాయని మేం గమనించాం. మొత్తం ప్రాంతంలో సాధారణ జీవనం, ఆర్థిక కార్యకలాపాలు స్పష్టంగా ప్రభావితమయ్యాయి. కొన్ని సందర్భాల్లో అవి పూర్తిగా నిలిచిపోయాయి. అందువల్ల చర్చలు, దౌత్య మార్గాలను అనుసరించాలని మార్చి 03న మేం మరొకసారి ఉద్ఘాటించాం. ఈ సంఘర్షణ త్వరగా ముగియాలని భావిస్తున్నట్లు తెలిపాం. ప్రాణనష్టం పట్ల సంతాపం వ్యక్తం చేయడంలో ఈ గౌరవ సభ నాతో ఏకీభవిస్తుందని నేను నమ్ముతున్నాను.

5. గౌరవ అధ్యక్షా.. ప్రపంచ శాంతి, భద్రతపై ప్రతికూల ప్రభావం చూపే ఏ పరిణామమైనా తీవ్ర ఆందోళన కలిగించే విషయమే. అయితే ప్రస్తుతం కొనసాగుతున్న ఈ సంఘర్షణ భారత్‌కు మరింత ఆందోళనకరమైన అంశం. పొరుగు ప్రాంతంలో మనం ఉన్నందున పశ్చిమ ఆసియా స్థిరంగా, శాంతియుతంగా ఉండటంలో మనకు ప్రత్యక్ష ప్రయోజనాలు ఉన్నాయని తెలుసు. గల్ఫ్ దేశాల్లో దాదాపు ఒక కోటి మంది భారతీయ పౌరులు నివసిస్తూ పని చేస్తున్నారు. అలాగే ఇరాన్‌లో కూడా చదువు కోసం లేదా ఉపాధి కోసం వెళ్లిన కొన్ని వేల మంది భారతీయులు ఉన్నారు. మన ఇంధన భద్రతకు ఈ ప్రాంతం చాలా కీలకమైనది. చమురు, గ్యాస్ సరఫరా చేసే అనేక ముఖ్యమైన దేశాలు ఇక్కడ ఉన్నాయి.

6. అధ్యక్షా.. గల్ఫ్ ప్రాంతం మనకు ఒక ప్రధాన వాణిజ్య భాగస్వామి కూడా. ఏటా దాదాపు 200 బిలియన్ డాలర్ల వ్యాపారం ఇక్కడ జరుగుతోంది. గత దశాబ్ద కాలంలో ఈ ప్రాంతం నుంచి భారత ఆర్థిక వ్యవస్థలోకి భారీగా పెట్టుబడులు వచ్చాయన్న విషయం కూడా ఈ సభకు తెలుసు. అందువల్ల ప్రస్తుతం మనం గమనిస్తున్న సరఫరా గొలుసులో తీవ్ర అంతరాయాలు, అస్థిరత వాతావరణం చాలా తీవ్రమైన అంశాలు. అంతేకాకుండా సరకు రవాణా నౌకలపై జరుగుతున్న దాడులు కూడా ఇందులోకి వస్తాయి. వీటిలో సిబ్బందిగా భారతీయ పౌరులు అధిక సంఖ్యలో ఉంటున్నారు. దురదృష్టవశాత్తు ఇటువంటి ఘటనల్లో ఇప్పటికే ఇద్దరు భారతీయ నావికులను మనం కోల్పోయాం. ఒకరు ఇంకా ఆచూకీ లేకుండా ఉన్నారు. వారి మరణాల పట్ల సంతాపం తెలియజేయడంలో ఈ సభ నాతో ఏకీభవిస్తుందని నాకు తెలుసు.

7. గౌరవ అధ్యక్షా.. 2025 జూన్‌లో జరిగిన 12 రోజుల యుద్ధం నుంచి పశ్చిమ ఆసియాలోని పరిస్థితిని ప్రభుత్వం నిరంతరం అంచనా వేస్తూనే ఉంది. పెరుగుతున్న ఉద్రిక్తతలను మేం గమనించాం. దానికి అనుగుణంగా ఇరాన్‌లోని భారతీయ సమాజానికి హెచ్చరికలు జారీ చేశాం. 2026 జనవరి 5న విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ భారతీయ పౌరులకు ఇరాన్‌కు అనవసర ప్రయాణాలను నివారించాలని సూచించింది. ఇప్పటికే అక్కడ నివసిస్తున్న వారు దౌత్య కార్యాలయం వద్ద తమ పేర్లను నమోదు చేసుకోవాలని, తగిన జాగ్రత్తలు పాటించాలని.. ఎంబసీ వెబ్‌సైట్, సోషల్ మీడియా ఖాతాలను గమనిస్తూ ఉండాలని కోరాం. ప్రయాణాలను నివారించాలనే సూచనను మరింత కఠినంగా పునరుద్ఘాటిస్తూ 2026 జనవరి 14న రెండో సలహా ఉత్తర్వును విడుదల చేశాం. అదే సమయంలో ముంబయిలోని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ కూడా 2026 జనవరి 14న భారతీయ నావికుల కోసం ప్రత్యేక సూచనలు జారీ చేస్తూ దౌత్య కార్యాలయం హెచ్చరికలను పాటించాలని, తీరప్రాంతాల్లో అనవసర కదలికలను నివారించాలని కోరింది. ఉద్యోగ కల్పిన, సరకు రవాణా కంపెనీలు భారతీయ నావికులను ఇరాన్‌కు పంపవద్దని కూడా ఆదేశించడమైంది.

8. అధ్యక్షా.. మారుతున్న పరిస్థితులపై మా అంచనాను ప్రతిబింబిస్తూ టెహ్రాన్‌లోని భారత దౌత్య కార్యాలయం 2026 జనవరి 14న ఒక సలహా ఉత్తర్వును జారీ చేసింది. విద్యార్థులు, యాత్రికులు, వ్యాపారవేత్తలు, పర్యాటకులతో సహా భారతీయ పౌరులందరూ వాణిజ్య విమానాలతో పాటు అందుబాటులో ఉన్న అన్ని రవాణా మార్గాల ద్వారా ఇరాన్‌ను విడిచి వెళ్లాలని కోరింది. ఏదైనా సహాయం కోసం దౌత్య కార్యాలయాన్ని సంప్రదించాలని వారికి సూచిస్తూ 24x7 హెల్ప్‌లైన్ నంబర్లను అందించాం. ఫిబ్రవరి 23న మరొక సలహా ఉత్తర్వు ద్వారా ఈ సూచనలను మళ్లీ గట్టిగా పునరుద్ఘాటించాం. కొందరు ఈ హెచ్చరికలను పాటించి దేశం విడిచి వెళ్లగా మరికొందరు వీటిని బేఖాతరు చేస్తూ ఇంకా ఇరాన్‌లోనే ఉండిపోయారు. ఇరాన్ నుంచి సముద్రంలో వేటకు వెళ్లే మన మత్స్యకారులతో కూడా మేం నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాం. 2026 ఫిబ్రవరి 28 వరకు ఉన్న పరిస్థితి ఇది.

9. యుద్ధం మొదలైన వెంటనే భారత రాయబార కార్యాలయం టెహ్రాన్‌లోని అనేక మంది భారతీయ విద్యార్థులను టెహ్రాన్ నుంచి



సురక్షిత ప్రదేశాలకు తరలించడానికి చర్యలు చేపట్టింది. ఈ నెల 3న అత్యవసర సంప్రదింపుల కోసం హెల్ప్‌లైన్‌లను ఏర్పాటు చేయాలని సూచనలు జారీ అయ్యాయి. అదేవిధంగా, పర్యాటకుల అంతర్గత రవాణా కోసం సౌకర్యాలు కల్పించాం. వాణిజ్య కారణాల వల్ల ఇరాన్‌లో ఉన్న భారతీయ పౌరులు అర్మేనియా ద్వారా స్వదేశానికి తిరిగి రావడానికి ఏర్పాట్లు చేశాం. టెహ్రాన్‌లోని రాయబార కార్యాలయం పూర్తి స్థాయి అప్రమత్తతో పనిచేస్తోంది. ఈ క్లిష్ట సమయంలో భారతీయ పౌరులకు మద్దతునివ్వడానికి, వివిధ దేశాలకు ప్రయాణించాల్సిన భారతీయ పౌరులకు సహాయం చేయడానికి వారు పూర్తిగా కట్టుబడి ఉన్నారు. నావికుల విషయంలోనూ డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ షిప్పింగ్ ఈ నెల 2న వెలువరించిన ఉత్తర్వుల ద్వారా తక్షణ ప్రతిస్పందన, సమన్వయం, సహాయ చర్యల కోసం సత్వర ప్రతిస్పందన బృందాన్ని ఏర్పాటు చేసింది. ఇది నిరంతర ప్రాతిపదికన పనిచేస్తుంది.

10. గౌరవనీయ సభాధ్యక్షా... ఈ ప్రాంతంలోని ప్రతి భారతీయ రాయబార కార్యాలయం ఇదే విధమైన సూచనలు జారీ చేసిందని మీ ద్వారా సభకు తెలియజేయాలనుకుంటున్నాను. ఇజ్రాయెల్‌లోని రాయబార కార్యాలయం ఫిబ్రవరి 28, మార్చి 1 తేదీల్లో... యూఏఈ ఫిబ్రవరి 28, మార్చి 5 తేదీల్లో... బహ్రెయిన్ ఫిబ్రవరి 28... ఖతార్ ఫిబ్రవరి 28, మార్చి 5 తేదీల్లో... కువైట్ ఫిబ్రవరి 28, మార్చి 8 తేదీల్లో... సౌదీ అరేబియా ఫిబ్రవరి 28, మార్చి 8 తేదీల్లో... ఒమన్ ఫిబ్రవరి 28, మార్చి 5 తేదీల్లో... ఇరాక్ ఫిబ్రవరి 28, మార్చి 5 తేదీల్లో సూచనలను జారీ చేశాయి. పరిస్థితిని పర్యవేక్షించడానికి... బాధితులు, వారి కుటుంబాల ప్రశ్నలకు సమాధానం ఇవ్వడానికి... ఎమ్ఈఏ ప్రత్యేక కంట్రోల్ రూమ్‌నూ ఏర్పాటు చేసింది. ఈ నెల 7న ప్రస్తుత పరిస్థితిని గురించి ఎమ్ఈఏ తాజా సమాచారాన్ని అందించింది.

11. దుబాయ్, దోహా, అబుదాబి వంటి కేంద్రాల్లో చిక్కుకున్న ప్రయాణికులకు సహాయం చేయడానికి మన దౌత్యవేత్తలు కృషి చేస్తున్నారు. వారు యూఏఈ నుంచి ఒమన్, ఖతార్, కువైట్ వరకు... బహ్రెయిన్ నుంచి సౌదీ అరేబియా వరకు భారతీయ పౌరుల రవాణాను సులభతరం చేశారు. గగనతలం పాక్షికంగా తెరిచిన ప్రతిచోటా... భారతీయ ప్రయాణికులు తిరిగి రావడానికి వీలుగా షెడ్యూల్ చేయని విమానాలు సహా వాణిజ్య విమానాలనూ ఏర్పాటు చేసి వారిని తరలించేందుకు అన్ని ఏర్పాట్లు చేశాం. నిన్నటి వరకు దాదాపు 67,000 మంది భారతీయులను వారి గమ్యస్థానాలకు తరలించడం పూర్తయింది. అధ్యక్షా... ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను మనకు తెలియజేసేందుకు పౌర విమానయాన మంత్రిత్వ శాఖ విడుదల చేసిన సమాచార కరపత్రం గురించి ఈ రోజు నాకు సమాచారం అందింది. ఈ నెల 7వ తేదీన 51 విమానాలు, 8వ తేదీన 49 విమానాలు భారత్ చేరుకున్నాయి. 9వ తేదీన 50 విమానాలు అక్కడ సిద్ధంగా ఉంచాం. కాబట్టి ఈ ప్రాంతంలో చిక్కుకున్న వారిని, అక్కడ నుంచి వివిధ ప్రాంతాలకు ప్రయాణించాల్సిన వారిని, ఈ ప్రాంతం నుంచి అత్యవసరంగా తిరిగి రావాల్సిన వారిని సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చడం కోసం అన్ని ప్రయత్నాలు చేస్తున్నామని సభకు తెలియజేస్తున్నాను.

12. గౌరవనీయ అధ్యక్షా.. ఈ సమయంలో ప్రభుత్వం సంబంధిత దేశాలతోనూ సన్నిహిత సంబంధాలను కొనసాగించింది. గౌరవనీయ ప్రధానమంత్రి స్వయంగా యూఏఈ అధ్యక్షుడు, ఖతార్ అమీర్, సౌదీ అరేబియా క్రౌన్ ప్రిన్స్, కువైట్ క్రౌన్ ప్రిన్స్, బహ్రెయిన్ రాజు, ఒమన్ సుల్తాన్, జోర్డాన్ రాజు, ఇజ్రాయెల్ ప్రధానమంత్రితో మాట్లాడారు. ప్రతి సందర్భంలోనూ భారతీయుల క్షేమానికి ప్రాధాన్యమిస్తామని ఆయా దేశాల నుంచి మనకు హామీలు వచ్చాయి. ఈ దేశాల్లోని నా సహచరులనూ నేను ఎప్పటికప్పుడు సంప్రదిస్తూ అవసరమైన చర్యలు చేపడుతూ ఉన్నాను. యునైటెడ్ స్టేట్స్ విషయంలోనూ దౌత్య మార్గాల ద్వారా మనం క్రమం తప్పకుండా సంబంధాలను కొనసాగించాం. ఇరాన్‌తో సంబంధాల విషయంలో ప్రయత్నాలు కొనసాగుతున్నప్పటికీ ఈ విషయంగా స్పష్టత రావడానికి కొంత సమయం పట్టవచ్చు. ఇప్పటికే ఫిబ్రవరి 28న, ఈ నెల 5న నేను ఆ దేశ విదేశాంగ మంత్రి అరాఘ్చితో మాట్లాడాను. రాబోయే రోజుల్లోనూ మేం ఈ ఉన్నత స్థాయి చర్చలు కొనసాగిస్తాం.

13. అధ్యక్షా... ప్రస్తుతం కొచ్చిలో నిలిపి ఉంచిన ఇరానియన్ నౌక గురించిన సమాచారం తెలుసుకోవడం కోసం సభ ఆసక్తిగా ఉంది. ఫిబ్రవరి 28న ఈ ప్రాంతంలోని మూడు నౌకలను మన ఓడరేవుల్లో నిలపడానికి అనుమతి కోరుతూ ఇరాన్ వైపు నుంచి అభ్యర్థన వచ్చింది. దీనికి ఈ నెల 1న అనుమతి లభించింది. వాస్తవానికి ఐరిస్ లావన్ నౌకను ఈ నెల 4న కొచ్చిలో నిలిపారు. ఆయా నౌకల సిబ్బంది ప్రస్తుతం భారత నావికాదళ కేంద్రాల్లో ఉన్నారు. ఇది సరైన పని అని మేం నమ్ముతున్నాం. ఈ మానవతా సాయానికి గానూ ఇరాన్ విదేశాంగ మంత్రి తమ దేశం తరపున మనకు కృతజ్ఞతలు తెలిపారు.

14. గౌరవనీయ అధ్యక్షా... ఈ యుద్ధం కారణంగా మన ఇంధన భద్రత విషయంగా ఎదురయ్యే సమస్యలను దృష్టిలో ఉంచుకుని ఈ సమస్య పరిష్కారానికి నేను ప్రయత్నిస్తున్నాను. ఇంధన మార్కెట్ల జవాబుదారీతనం, ఖర్చులు, నష్టాలను పరిగణనలోకి తీసుకుని ప్రభుత్వం సమస్య పూర్తిస్థాయి పరిష్కారానికి కట్టుబడి ఉంది. భారతీయ వినియోగదారుల ప్రయోజనాలే మన ప్రథమ ప్రాధాన్యం. అవసరమైన చోట, ఈ అస్థిర పరిస్థితిలో మన ఇంధన సంస్థల ప్రయత్నాలకు భారత దౌత్య బృందం మద్దతునిస్తోంది.

15. గౌరవనీయ అధ్యక్షా... మన విధానానికి సంబంధించిన మూడు మార్గదర్శక అంశాలను ప్రస్తావించి నేను నా ప్రసంగాన్ని ముగిస్తాను: భారత్ శాంతిని కోరుకుంటుంది. చర్చలు, దౌత్యపరమైన మార్గాల్లో పరిష్కారం కోసం ముందుకు రావాలని ఆయా దేశాలను భారత్ కోరుతోంది. ఉద్రిక్తతలను తగ్గించడం, సంయమనం పాటించడం, పౌరుల భద్రతను నిర్ధారించడాన్ని మనం సమర్థిస్తాం. ఈ ప్రాంతంలోని భారతీయుల క్షేమం, భద్రతకే మన ప్రాధాన్యం. ఆ లక్ష్యంతో ఈ ప్రాంత ప్రభుత్వాలతో కలిసి పనిచేయడం కొనసాగిస్తాం. ఇంధన భద్రత, వాణిజ్య కార్యకలాపాలు సహా మన జాతీయ ప్రయోజనం ఎల్లప్పుడూ అత్యంత ముఖ్యమైనది.

## పెనుగంచిప్రోలు వెండి కిరీటాల పేరిట రూ.3 లక్షలు మోసం.. వ్యాపారిపై ఫిర్యాదు



**నందిగామ మార్చి 10 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పెనుగంచిప్రోలు శ్రీ తిరుపతమ్మ అమ్మవారికి వెండి కిరీటాలు చేయిస్తానని చెప్పి రూ.3 లక్షలు తీసుకుని కనిపించకుండా పోయిన వ్యాపారిపై భక్తుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల ప్రకారం గుంటూరు జిల్లా వినుకొండకు చెందిన మన్నే వెంకటేశ్వరరావు రెండు సంవత్సరాల క్రితం ఆలయానికి చెందిన ఒక వ్యక్తి పరిచయంతో తెనాలికి చెందిన ఓ వ్యాపారికి రూ.3 లక్షలు ఇచ్చారు. అమ్మవారికి వెండి కిరీటాలు తయారు చేసి ఇవ్వాలని చెప్పి ఈ డబ్బులు తీసుకున్నట్లు తెలిపారు అయితే డబ్బులు తీసుకున్న తర్వాత నుంచి వ్యాపారి ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అజ్ఞాతంలోకి వెళ్లిపోయాడని బాధితుడు వాపోయాడు. పలుమార్లు సంప్రదించేందుకు ప్రయత్నించినప్పటికీ అతని నుంచి స్పందన రాలేదని పేర్కొన్నారు. దీంతో మోసపోయానని గ్రహించిన వెంకటేశ్వరరావు పెనుగంచిప్రోలు పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు ఘటనపై విచారణ చేపట్టారు. డబ్బులు తీసుకుని పరారైన వ్యాపారిని గుర్తించి చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

## యూనివర్శిటి ఏర్పాటుకు అనుమతి,' నిధులు మంజూరు చేసి న్యాయం చేయాలని విజ్ఞప్తి

**ప్రకాశం జిల్లా కి యూనివర్సిటీ లు, ట్రిబుల్ ఐ.ఐ.టి, సంగీత కళాశాల, ఫైన్ ఆర్ట్స్ కళాశాల యూనివర్శిటి ఏర్పాటుకు అనుమతి,' నిధులు మంజూరు చేసి న్యాయం చేయాలని ఒంగోలు శాసన సభ్యులు గౌ " శ్రీ దామచర్ల జనర్ధన్ కి ఒంగోలు సిటిజన్ అసోసియేషన్ అధ్యక్షుడు కొల్లా మధు విజ్ఞప్తి.**



**ఒంగోలు మార్చి 10 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ప్రకాశం జిల్లా వెనుక బడిన జిల్లాలో యునివర్సిటిలు ఒక్కటి కూడా లేక పోవడం విచారకరం విద్యా శాఖ మంత్రి వర్యులు శ్రీ నారా లోకేష్ గారు పాదయాత్ర సందర్భంగా అధికారంలో కి వచ్చిన వెంటనే యూనివర్సి టికి నిధులు మంజూరు చేస్తాను అని ప్రకటన చేయడం జరిగింది. దాని తరువాత చాల సార్లు అర్జీలు ఇవ్వడం జరిగింది. ఆరు నెలల క్రితం విద్యా శాఖ మంత్రివర్యులు గౌ. శ్రీ. నారా లోకేష్ గారు కేంద్ర విద్యా శాఖ మంత్రివర్యులు కి ఆంధ్ర కేసరి యూనివర్సిటీ కి 50 కోట్లు మంజూరు చేయాలని కోరడం జరిగింది ఆరు నెలలు గడిచింది.ఇంత వరకు ఒక్క అడుగు ముందుకు పడలేదు. ఈ కింద ఉన్న 4 నుంచి 5 యూనివర్సిటీలు 2018 సంవత్సరం చివర నెలలో శంకుస్థాపన ముఖ్యమంత్రివర్యులు గౌ " శ్రీ నారా చంద్రబాబునాయుడు గారు చేశారు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు అదిమూడు నాళ్ళ ముచ్చటగా మిగిలింది. జిల్లా ప్రజలు ఇతర జిల్లాలకు వెళ్ళే బాధ ఆర్థికశీగా కూడ ఇబ్బందులు తొలిగింది అనుక్కున్నారు. కానీ ప్రభుత్వం మారింది.గత ప్రభుత్వం లో ఒక్క అడుగు కూడ పడలేదు. ఇప్పుడు కొత్త ప్రభుత్వం వచ్చి 20 నెలల గడుస్తున్న ఎందుకో ఒక్క రూపాయి నిధులు మంజూరు కాలేదు వెనుక బడిన ప్రకాశం జిల్లాకి యూనివర్సిటిలకు నిధులు మంజూరు చేసి నిర్మాణాలు పూర్తి చేయాలని కోరడంజరిగింది. త్వరలో ట్రిబుల్ ఐఐటి ఒంగోలు నగరానికి మంజూరు చేయడం జరుగుతుంది అని, సంగీత కళాశాలల, ఫైన్ ఆర్ట్స్ కళాశాల,ఆర్ట్ గ్యాలరీ ఏర్పాటు చేయడం జరుగుతుంది అని ఒంగోలు శాసన సభ్యులు వద్దకు వెళ్ళిన ఒంగోలు సిటిజన్ అసోసియేషన్ ప్రతినిధి బృందానికి తెలియ జేయడం జరిగింది. సైన్స్ సెంటర్ ఒ ప్లానిటోరియం గతం లో 2018 లో మిని స్టేడియం లో ముఖ్యమంత్రి శంకుస్థాపన చేయడం జరిగింది 20 కోట్లు కేటాయించడం జరిగింది. తిరిగి మరల ప్రయత్నం చేయడం జరుతుంది.

పోతురాజు కాల్వ ఆధునికరణ రెండు వైపుల రెండు రోడ్డు ఏర్పాటు చేయలని 130 కోట్లతో త్వరలో నిధులు మంజూరు వైన తరువాత పన్నులు మొదలు పెడతాం .

ఓల్లూరు, పెళ్ళూరు చెరువులు కలిపి నెల్లూరు రోట్టెల పండుగ తరహా పర్యాటక పుణ్య క్షేత్రంగా అభివృద్ధి చేయడానికి ఉడా చైర్మన్ శ్రీ. ౘఖ రియాజ్ గారిని టూరిజ మంత్రి వర్యులు గౌ. శ్రీ కందుల దుర్గేష్ గారిని భాధ్యత తీసుకొని 10 కోట్లు తో అభివృద్ధి కి విజ్ఞప్తి చేయాలని చెప్పడం జరిగింది.ఒంగోలు శాసన సభ్యులు శ్రీ దామచర్ల జనర్ధన్ గారు.

ఈ క్రింది కొన్ని యూనివర్సిటీ లు 2018 లో గతంలో శంకుస్థాపన లు జరిగింది ముఖ్య మంత్రి వర్యులు

1. ఆంధ్ర కేసరి యూనివర్సిటీ
2. ట్రిబుల్ ఐ.ఐ.టి యూనివర్సిటీ
3. మైనింగ్ యూనివర్సిటీ
4. వెటర్నరీ యూనివర్సిటీ
5. సంగీత కళాశాల మరియు యూనివర్సిటీ
6. ఫైన్ ఆర్ట్స్ కళాశాల మరియు యూనివర్సిటీ , ఆడిటోరియం
7. హాస్పిటాలిటి మేనేజ్మెంట్ కళాశాల మరియు యూనివర్సిటీ
8. సైన్స్ సెంటర్ మరియు ప్లానిటోరియం.

ఈ రోజు ఉదయం ఒంగోలు సిటిజన్ అసోసియేషన్ ప్రతినిధి బృందం ఒంగోలు శాసన సభ్యులు అర్జీలు ఇవ్వడంజరిగింది

కొల్లా మధు, వేమూరి సుబ్బారావు, జగిరాల చెంచయ్య, కుర్రా ప్రసాద్, తోట రామస్వామి తదితరులు

## గుంటూరు జిల్లాలో హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ ప్రారంభం



**గుంటూరు మార్చి 10 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** జిల్లాలో హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ ప్రారంభ మైంది. గుంటూరు బృందావన్ గార్డెన్స్‌లోని ఆయుష్మాన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కలెక్టర్ తమీమ్ అన్సారియా దీనిని ప్రారంభించారు. మట్నత్తం 83 కేంద్రాల్లో 90 రోజుల పాటు ఈ వ్యాక్సినేషన్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. తల్లి దండ్రులు తప్పకుండా తమ బాలికలకు ఈ వ్యాక్సిన్ వేయించాలని విజ్ఞప్తి చేశారు. 14 ఏళ్లు నిండిన బాలికలు సర్వైకల్ క్యాన్సర్ బారిన పడకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ వ్యాక్సిన్‌ను ఉచితంగా అందిస్తున్నాయని తెలిపారు. గుంటూరు జిల్లాలో 14 ఏళ్లు నిండిన బాలికలు 14 వేల మంది ఉన్నారని.. వ్యాక్సిన్ వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

## ఈపురుపాలెం పీహెచ్‌సీని సందర్శించిన జిల్లా వైద్యాధికారులు



**బాపట్ల మార్చి 10 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** బాపట్ల జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎస్. విజయమ్మ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ రత్న మన్మోహన్ మంగళవారం ఈపురుపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా, పీహెచ్‌సీలో జరుగుతున్న హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ ప్రక్రియను అధి కారుల బృందం పరిశీలిం చింది. ఆరోగ్య సమీక్ష ఆశా డే సమావేశంలో పాల్గొని, ఏబిహెచ్ఏ ఐడిల సృష్టి, ఎలక్ట్రానిక్ హెల్త్ రికార్డులు (ఈహెచ్ఆర్), గర్భిణీ సేవలు (ఏఎన్‌సీ), శిశు సంరక్షణ పురోగతిని సమీక్షించారు.

## జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయం లో అష్టాదశ శక్తిపీఠం ల ప్రతిష్ట




**నరసరావుపేట మార్చి 10 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పల్నాడు జిల్లా కేంద్రంలో నరసరావుపేట మండల పరిధిలోని ఉప్పలపాడు వై జంక్షన్ వద్ద గల శ్రీ జ్ఞాన సరస్వతి దేవాలయంలో ఈనెల 12వ తేదీన అష్టాదశ శక్తి పీఠం ల ప్రతిష్ట నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు డాక్టర్ జగన్మోహన్ రెడ్డి తెలిపారు మంగళవారం ఆలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డాక్టర్ జగన్మోహన్ రెడ్డి మాట్లాడుతూ... భారతదేశంలో అత్యంత ప్రాధాన్యత కలిగిన శక్తి పీఠాలు 18 ఉన్నాయన్నారు. మన రాష్ట్రంలో నాలుగు శక్తి పీఠాలు ఉండగా మిగిలినవి దేశంలోనీ ఇతర రాష్ట్రాల్లో ఉన్నాయన్నారు. భక్తుల సౌకర్యార్థం 18 శక్తి పీఠాలను నరసరావుపేటలోని జ్ఞాన సరస్వతి అమ్మవారి ఆలయంలో అన్నపూర్ణయ్య సిద్ధాంతి ఆధ్వర్యంలో ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. మహాబలిపురంలో రాతి విగ్రహాలను తయారు చేయించి ఈ నెల 12వ తేదీ ఉదయం 9.21 నిమిషాలకు ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించ తలపెట్టినట్లు తెలిపారు. నరసరావుపేట పరిసర ప్రాంత భక్తులు కార్యక్రమానికి హాజరై శక్తిపీఠం అమ్మవార్లను దర్శించుకుని అమ్మవారి కృపకు పాత్రులు కాగలరని తెలిపారు.

## అర్బన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి



**చిలకలూరిపేట మార్చి 10 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** గుంటూరు రేంజ్ ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి మంగళవారం చిలకలూరిపేట అర్బన్ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా సందర్శించారు. వార్షిక తనిఖీలలో భాగంగా స్టేషన్‌కు చేరుకున్న ఆయన, రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించడంతో పాటు స్టేషన్ ప్రాంగణాన్ని ముమ్మరంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఐజీ మాట్లాడుతూ పట్టణంలో శాంతిభద్రతలు సంతృప్తికరంగా ఉన్నప్పటికీ, నేరాల సంఖ్యను తగ్గించేందుకు సిబ్బంది పటిష్టమైన చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు.ముఖ్యంగా పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరితగతిన పరిష్కరించి, బాధితులకు న్యాయం చేయాలని సిబ్బందికి సూచించారు.క్షేత్రస్థాయిలో పోలీసులకు ఉన్న సిబ్బంది కొరత మరియు ఇతర సమస్యలను గుర్తించినట్లు తెలిపిన ఐజీ, వాటిని త్వరలోనే పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. విధి నిర్వహణలో అలసత్వం వహించకుండా, ప్రజలకు అందుబాటులో ఉంటూ నేర నియంత్రణకు కృషి చేయాలని ఆయన స్పష్టం చేశారు.

## మైలవరం ట్రిపుల్ రైడ్ చేసే వారిపై తక్షణ చర్యలు...



**నందిగామ మార్చి 10 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మైలవరంలో సోమవారం సాయంత్రం పోలీసులు విస్తృతంగా వాహన తనిఖీలు నిర్వహించారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ తనిఖీలు చేపట్టినట్లు ఎస్సై-2 గిరి సాయి తెలిపారు. ఈ సందర్భంగా మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇస్తే సంబంధిత వాహనాలను వెంటనే సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు. ట్రిపుల్ రైడ్ చేసే వారిపై కూడా కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అలాగే హెల్మెట్ ధరించకుండా ప్రయాణించే వారు, వాహనాలకు సరైన పత్రాలు లేకుండా తిరిగేవారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. తనిఖీల సమయంలో పలువురు వాహనదారులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ప్రజలు రహదారి భద్రతా నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రాంతంలో శాంతి భద్రతలు కాపాడేందుకు ప్రతి ఒక్కరూ పోలీసులకు సహకరించాలని ఎస్సై గిరి సాయి కోరారు. పోలీసులు చేపట్టిన ఈ తనిఖీలతో మైలవరం పట్టణంలో కొంతసేపు రద్దీ నెలకొంది.

## బాలికల ఆరోగ్య రక్షణకు హెచ్పీవీ టీకా ప్రారంభం...



**నందిగామ మార్చి 10 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** రెడ్డిగూడెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హెచ్పీవీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. బాలికల ఆరోగ్య పరిరక్షణలో ఈ టీకా ఎంతో ముఖ్యమైనదని పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ మణిబాబు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గర్భాశయ క్యాన్సర్ నివారణలో హెచ్పీవీ టీకా కీలక పాత్ర పోషిస్తుందని చెప్పారు. 14 సంవత్సరాలు పూర్తై 15 సంవత్సరాల లోపు ఉన్న బాలికలకు ఈ టీకాను ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ఈ టీకాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. అర్హత కలిగిన బాలికలను తల్లిదండ్రులు ఆరోగ్య కేంద్రాలకు తీసుకువచ్చి టీకా వేయించుకోవాలని సూచించారు. బాలికల భవిష్యత్ ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్య సిబ్బంది కోరారు.


## ఎంపీ కేశినేని చిన్నీ వివరణ ఇవ్వాలి

### : ఎమ్మార్పీఎస్ నాయకుల డిమాండ్...



**నందిగామ మార్చి 10 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** నెమలి వేణుగోపాల స్వామి కళ్యాణ మహోత్సవం సందర్భంగా చోటుచేసుకున్న అవమానకర ఘటనపై ఎంపీ కేశినేని చిన్నీ తక్షణమే స్పందించి వివరణ ఇవ్వాలని ఎమ్మార్పీఎస్ నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం నిర్వహించిన సమావేశంలో ఎంఎస్పీ జాతీయ అధ్యక్షుడు మందా వెంకటేశ్వర్లు మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ఎలీషా, నాయకుడు మానికొండ రామకృష్ణ మాట్లాడుతూ ఈ ఘటనపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే మాదిగల బలం ఏమిటో నియోజకవర్గ స్థాయిలో చూపిస్తామని హెచ్చరించారు. దళిత ఎమ్మెల్యే కొలికపూడి జోలికి వస్తే సహించబోమని స్పష్టం చేశారు. ఈ ఘటనపై ఎంపీ కేశినేని చిన్నీ వెంటనే స్పందించి ప్రజలకు స్పష్టమైన వివరణ ఇవ్వాలని వారు కోరారు.

## చిలకలూరిపేట మున్సిపాలిటీకి స్పెషల్ ఆఫీసర్‌గా పల్నాడు జాయింట్ కలెక్టర్




**చిలకలూరిపేట మార్చి 10 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** చిలకలూరిపేట పురపాలక సంఘం ప్రస్తుత కౌన్సిల్ గడువు ఈనెల 18వ తేదీతో ముగియనుంది. ఈ నేపథ్యంలో, పురపాలక సంఘం పాలనలో ఎటువంటి ఆటంకాలు కలగకుండా చూసేందుకు ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టింది. కౌన్సిల్ పదవీ కాలం పూర్తికాగానే మున్సిపాలిటీ బాధ్యతలను పర్యవేక్షించేందుకు స్పెషల్ ఆఫీసర్ (ప్రత్యేక అధికారి) గా పల్నాడు జిల్లా జాయింట్ కలెక్టర్‌ను నియమిస్తూ ప్రభుత్వం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది.ఈనెల 18వ తేదీ నుంచి ప్రస్తుత పాలకవర్గం బాధ్యతల నుండి తప్పుకోనుండగా, మరుసటి రోజు నుండి జాయింట్ కలెక్టర్ ప్రత్యేక అధికారిగా పాలనా వ్యవహారాలను పర్యవేక్షించనున్నారు. స్థానిక సంస్థల ఎన్నికలు జరిగి, కొత్త పాలకవర్గం కొలువుదీరే వరకు ఈ ప్రత్యేక అధికారి పాలన కొనసాగనుంది.

## చదువుల తల్లి సావిత్రిబాయి పూలే వర్ధంతి



**చిలకలూరిపేట మార్చి 10 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పట్టణంలోని స్థానిక మహాత్మ జ్యోతిరావు పూలే సావిత్రిబాయి పూలే కాంస్య విగ్రహాలకీ పూలదండలు వేసి పూలతో ఘనంగా నివాళులర్పించడం జరిగింది ముఖ్య అతిథులుగా జ్యోతి చైతన్య సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఉప్పాల భాస్కర్ రావు , ఉపాధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు ప్రధాన కార్యదర్శి మారు బోయిన శ్రీనివాసరావు, బీసీ నాయకులు రిటైర్డ్ ఎక్సైజ్ సీఐ గోరంట్ల నారాయణరావు యాదవ్ మాట్లాడుతూ దేశంలోనే మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలుగా స్త్రీ విద్య కుపునాది వేసి విద్యా దీపం వెలిగించిన విప్లవ మహిళ, విద్య అనే ఆయుధంతో స్త్రీలలో చైతన్యం పెంపొందించి అజ్ఞానాన్ని కులవాదాన్ని, మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా పోరాడిన మహాత్మురాలు సావిత్రిబాయి పూలే అన్నారు. వితంతు పునర్వివాహాలను చేయించిన గొప్ప మానవతావాది అని అన్నారు. భారతదేశంలోనే మొట్టమొదటి బాలికల పాఠశాల స్థాపించి వారికి చదువు చెప్పే క్రమంలో పేడ నీళ్లు రాళ్లు విసిరిన వాటిని తప్పించుకొని వెళ్లి విద్యా అందించిన గొప్ప సంఘసంస్కర్త, అనాథ పిల్లల కోసం ఆశ్రమాలు స్థాపించి ప్లేగు వ్యాధి ప్రబలినప్పుడు వారిని ధైర్యంగా ఆమె హాస్పిటల్స్ చేర్చి వైద్యం అందించి చివరికి ఆ ప్లేగు వ్యాధితో మరణించడం జరిగింది,పూలే చైతన్య జ్యోతి సేవా సంఘం చిలకలూరిపేట నియోజకవర్గ అధ్యక్షులు నిడమానూరు వెంకట్ , టౌన్ అధ్యక్షులు మందాడి ఫణికుమార్ ,కమిటీ మెంబర్స్ దాసరి శ్రీనివాసరావు దాసరి వెంకటేశ్వర్లు పట్టణ టిడిపి బీసీ సెల్ అధ్యక్షురాలు శ్రీమతి,టి.కాసులు,కొండవీటి గోపి,బీసీ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి పోటు శ్రీనివాసరావు, పలువురు బీసీ సంఘం నాయకులు పాల్గొని ఘన నివాళులు అర్పించారు.

## ఒంటిమిట్ట రామయ్య క్షేత్రానికి చేరిన ముత్యాలు



**ఒంటిమిట్ట మార్చి 10 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి ఆలయానికి 110 కిలోల ముత్యాలు మంగళవారం చేరాయి. రామయ్య క్షేత్రంలో ఈనెల 26 నుంచి శ్రీరామనవమి వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభం కానున్నాయి. వచ్చే నెల (ఏప్రిల్) 1న సీతారాముల కల్యాణం కన్నులపండువగా నిర్వహించాలని తితిదే అధికారులు ప్రణాళికను రూపొందించారు. ఆ దిశగా ముమ్మర ఏర్పాట్లు చేస్తున్నారు. జానకి రాముల పరిణయం వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు 110 కిలోల ముత్యాలు తెప్పించాలని తితిదే అధికారులు నిర్ణయించారు. నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే, తితిదే ధర్మకర్తల మండలి సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి రాములోరి పెళ్లికి అవసరమైన ముత్యాలను కానుకగా బహూకరించాలని ముందుకొచ్చారు. హైదరాబాద్‌లో సోమవారం వీటిని కొనుగోలు చేశారు. కిలో ధర రూ.15,500. మొత్తం 110 కిలోలకు నెల్లూరు ఎంపీ ప్రభాకర్ రెడ్డి, కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతి రెడ్డి దంపతులు రూ.17.05 లక్షలు చెల్లించారు. ఈరోజు ఉదయం రామాలయానికి ఈ ముత్యాలు చేరాయి. ఆలయ తనిఖీ అధికారి నవీన్ కుమార్ పరిశీలించారు. ఈనెల 27న శ్రీరామనవమి రోజు సీతారాముల కల్యాణం కోసం ముత్యాల తలంబ్రాలు 1.75 లక్షల ప్యాకెట్లు తయారు చేస్తామని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, మంత్రులు, ప్రభుత్వ పెద్దలు, రాష్ట్ర ఉన్నతాధికారులు, సామాన్య భక్తులుకు పంపిణీ చేయాలని ఏర్పాట్లు చేస్తున్నారు.

## టైరు పేలి.. టొమాటోలు తరలిస్తున్న వాహనం బోల్తా



**తొట్టంబేడు మార్చి 10 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం మల్లిగుంట సమీపంలో రేణిగుంట – నాయుడుపేట జాతీయ రహదారిపై టొమాటో లోడుతో వెళ్తున్న మినీ లగేజీ వాహనం టైరు పేలి బోల్తా పడింది. మంగళవారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగింది. స్థానికుల వివరాల మేరకు.. మదనపల్లి నుంచి నెల్లూరుకు టొమాటోలు తరలిస్తున్న మినీ లగేజీ వాహనం టైరు పేలడంతో అదుపుతప్పి బోల్తాపడింది. దీంతో వాహనంలో ఉన్న టొమాటోలు రహదారిపై చెల్లాచెదురుగా పడ్డాయి. వాహనం రోడ్డుకు అడ్డంగా పడడంతో ఆ మార్గంలో వహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సమాచారం అందుకున్న తొట్టంబేడు పోలీసులు, టోల్ సిబ్బంది ఘటనా స్థలికి చేరుకొని వాహనాన్ని పక్కకు తీయించి రాకపోకలను క్రమబద్ధీకరించారు. డ్రైవర్‌తో పాటు మరో ఇద్దరు సురక్షితంగా బయటపడ్డారు.




# అంతు చిక్కని ప్రభాస్ ఆలోచనలు



టాలీవుడ్ టాప్ హీరోల్లో అత్యధిక డిమాండ్ ఉన్నది ఎవరికయ్యా అంటే ఠక్కున గుర్తొచ్చే పేరు ప్రభాస్. తెలుగులోనే కాదు హిందీలోనూ గ్యారెంటీ మార్కెట్ సంపాదించుకున్న డార్లింగ్ ఏకకాలంలో మూడు సినిమాలు సెట్స్ మీద పెట్టిన సంగతి తెలిసిందే. ఫౌజీ బ్యాలన్స్ ఉండగానే స్పిరిట్ మొదలైపోయింది. దీని గురించి మాట్లాడుతుండగానే కల్కి 2ని స్టార్ట్ చేశారు. ఇదంతా ఊహకందని వేగం. జూనియర్ ఎన్టీఆర్ డ్రాగన్ తో ప్రశాంత్ నీల్ బిజీ ఉన్నప్పటికీ ఈ ఏడాదిలోనే సలార్ 2 శౌర్యంగపర్వం మొదలైపోతుందని ఇన్ సైడ్ టాక్. రాజా సాబ్ వైఫల్యాన్ని ప్రభాస్ లైట్ తీసుకున్నాడు. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీకి ఊరట దక్కేందుకు నిర్మాత విశ్వప్రసాద్ కు మరో మూవీ హామీ ఇచ్చాడు. తనను కలుస్తున్న దర్శకులను నో అనకుండా కథలు వింటున్నాడు. ఇప్పుడీ డిస్కషన్ కు కారణం ఒక ఫోటో. మలయాళంలో కల్ట్ కంటెంట్ గా చెప్పుకునే ఎకో, కిష్కింధకాండం దర్శకుడు దింజిత్ అయ్యతన్ ఇటీవలే ప్రభాస్ ని కలుసుకున్నాడు. ఏదైనా స్టోరీ చెప్పడానికేమోనని అభిమానులు అనుమాన పడుతున్నారు. ఇతను ఇటీవలే ధనుష్ ని కూడా కలిశాడు. ఒకవేళ నిజంగా డార్లింగ్ కాంబోలో మూవీ ఏదైనా ప్లానింగ్ ఉందేమోనని ఫ్యాన్స్ కి సందేహం కలుగుతోంది. అలాని ఎగ్జైట్ మెంట్ కూడా లేదు. ఎందుకంటే మల్లువుడ్ దర్శకుల శైలి మన కమర్షియల్ ఫార్ములాకు సూట్ అవ్వదు. వాళ్ళ స్లో నెరేషన్, డిటైలింగ్ మన ఆడియన్స్ ఓటిటిలో చూస్తారు తప్పించి థియేటర్లలో భరించలేరు. అందుకే ప్రేమలు, మంజుమ్మల్ బాయ్స్ లాంటి ఒకటి రెండు తప్ప మిగిలిన మలయాళ సినిమాలేవీ తెలుగులో థియేటర్ డబ్బింగ్ కాలేదు. అలాంటప్పుడు ప్రభాస్ కు ఈ జానర్లు, బ్యాక్ డ్రాప్ లు అంతగా సెట్ కావు. ప్రస్తుతానికి జరిగింది కేవలం కలయిక కాబట్టి ఆ ఫోటోని బట్టి కంక్లూజన్ కు రాలేం కానీ ప్రభాస్ కు కనక సదరు డైరెక్టర్ల శైలి, స్టోరీ నచ్చితే ఓకే చెప్పేందుకు వెనుకాడడు. అదే ఫ్యాన్స్ ని టెన్షన్ కు గురి చేస్తోంది. మొత్తానికి స్పీడ్ తగ్గించకుండా వరసగా సినిమాలు చేసేందుకు ఉత్సాహం చూపిస్తున్న ప్రభాస్ డైరీ ఇంకో మూడు సంవత్సరాల దాకా చాలా బిజీగా ఉంది. ఈలోగా ఏమేం కాంబోలు కుదురుతాయో చూడాలి.

## నోరు జారిన నటకిరీటి... మరో కొత్త వివాదం



అదేంటో సీనియర్ నటులు రాజేంద్రప్రసాద్ పదే పదే నోరు జారే తప్పులు చేస్తూనే ఉన్నారు. రాబిన్ హుడ్ టైంలో ఆస్ట్రేలియా క్రికెటర్ డేవిడ్ వార్నర్ ని ఉద్దేశించి కామెంట్ విసరడం, ఎస్వి కృష్ణారెడ్డి పుట్టినరోజు వేడుకలో ఆలీని ఏకవచనంతో బూతు అర్థం వచ్చేలా పిలవడం సోషల్ మీడియాలో చాలా వైరలయ్యాయి. ఇక్కడ చెప్పింది రెండు ఉదాహరణలే కానీ ఇంకా బోలెడు ఎగ్జాంపుల్స్ ఉన్నాయి. తాజాగా ఒక ఈవెంట్లో కాంతారావుని పొగిడే క్రమంలో తమిళ లెజెండరీ నటులు ఎంజిఆర్ ని కాస్త అభ్యంతరకర భాషలో తగ్గించి రాజేంద్రప్రసాద్ మాట్లాడ్డం వివాదానికి దారి తీస్తోంది. కత్తివీరుడు కాంతారావునిం చూసి ఎంజిఆర్ తెగ భయపడేవాడని, బిజినెస్ మెన్ లో మహేష్ బాబు బ్రహ్మీజీకి వార్నింగ్ ఇచ్చిన రేంజ్ లో పోల్చేసరికి అక్కడున్న వారు ఆశ్చర్యానికి గురయ్యారు. నిజానికి ఆ కంపారిజన్ అవసరం లేదు ప్రాక్టికల్ గా మాట్లాడితే ఎంజిఆర్ చూసిన ఎత్తులు, అందుకున్న శిఖరాగ్రం కాంతారావు చేరుకోలేదు. దేవుడిగా కొలవబడలేదు. ఇప్పటికీ ఎంజిఆర్ ఫోటో వాడుకుని సినిమాలు తీసే దర్శకులు ఉన్నారు. కార్తీ వా వాతియర్ ఆ కోవలోకే వస్తుంది. కానీ మనకు ఎన్టీఆర్ ఎలాగో తమిళులకు ఎంజిఆర్ అలాగన్న మాట. తమిళనాడులో మనం చూసే స్థానిక పార్టీల రాజకీయ అధిపత్యానికి ఆద్యులు ఎంజిఆరే. అలాంటిది ఎంజిఆర్ ని కాంతారావుతో పోలుస్తూ అంత మాట అనేసరికి కోలీవుడ్ మూవీ లవర్స్ భగ్గుమంటున్నారు. పద్మశ్రీ వచ్చిన వేళ నటకిరీటి ఇలా స్లిప్ కావడం ఎంత మాత్రం సమర్థనీయం కాదు. వయసు ప్రభావం కావొచ్చు వేరే ఏదైనా కారణం కావొచ్చు, పదే పదే ఇలా దొరికిపోవడం ఆయన వయసు, అనుభవానికి సరికాదు. మనం మనం వంద అనుకుని సారీలు చెప్పుకోవచ్చు. అదేం తప్పు కాదు. కానీ మనకు సంబంధమే లేని ఎంజిఆర్ ని తీసుకొచ్చి చులకన చేయడమే బాలేదు. కాంతారావు అద్భుతమైన ఆర్టిస్టు. అందులో సందేహం లేదు. ఆయన సినిమాలు, వేసిన గొప్ప పాత్రల గురించి పొగడాల్సింది పోయి ఇలా కాంట్రావర్సీ చేసుకోవడం ఏమిటో.

## తొమ్మిది రోజులే ఉంది భగత్ గారూ !



పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ కౌంట్ డౌన్ వేగంగా జరిగిపోతోంది. మార్చి 26 రావాల్సిన ఉస్తాద్ భగత్ సింగ్ హఠాత్తుగా మార్చి 19కే రిలీజ్ కావాలని నిర్ణయం తీసుకోవడంతో ఒక్కసారిగా అభిమానుల్లో కదలిక వచ్చేసింది. దర్శకుడు హరీష్ శంకర్ సోషల్ మీడియాలో యాక్టివ్ గా ఉంటూ ఫ్యాన్స్ నుంచి ఎప్పటికప్పుడు రియాక్షన్లు విశ్లేషించే పని చేసుకుంటూనే ఇంకోవైపు పోస్ట్ ప్రొడక్షన్ వ్యవహారాలు, రీ రికార్డింగ్ మొదలైన వర్క్స్ లో టీమ్ చాలా బిజీగా ఉంది. అయితే ఫ్యాన్స్ ఖంగారు పడుతున్న విషయం ఒకటుంది. ఇప్పటిదాకా రెండు పాటలు వచ్చాయి. టైటిల్ సాంగ్ కి మిశ్రమ స్పందన వచ్చింది. దేఖ్ లేంగే సాలాకు మొదట్లో హడావిడి కనిపించింది కానీ చికిరి చికిరి అంత మేజిక్ చేయలేదు. మూడోది కాలర్ ఏత్తరా అంటూ రేపు రిలీజ్ చేయబోతున్నారు. ట్రైలర్ ఇంకో రెండు మూడు రోజుల్లో సిద్ధం కావాలి. చివరి నిమిషం దాకా నానబెట్టేందుకు దీనికి ఓజికు ఉన్నంత హైప్ లేదు. అందుకే సరైన ప్లానింగ్ చాలా అవసరమవుతోంది. మిగిలింది తొమ్మిది రోజులే. ఒకపక్క దురంధర్ రివెంజ్ అడ్వాన్స్ బుకింగ్స్ హోరెత్తిపోతున్నాయి. హైదరాబాద్ ఒకటే కాదు అన్ని మెయిన్ సెంటర్స్ లో టికెట్ల అమ్మకాలు చేసేస్తున్నారు. చాలా షోలు ఆల్రెడీ హౌస్ ఫుల్ అయ్యాయి. ఉస్తాద్ భగత్ సింగ్ కు రాత్రి ప్రీమియర్లు ఉండకపోవచ్చు. అదే జరిగితే మరుసటి రోజు మార్చి 19 తెల్లవారుజాము నాలుగు నుంచి బెనిఫిట్ షోలు వేయొచ్చు. తెలంగాణలో లేకుండా ఏపీలో మాత్రమే టికెట్ హైక్స్ తీసుకునే అవకాశం ఉందట. ఓపెనింగ్స్ విషయంలో ఎవరికీ డౌట్ లేదు కానీ ఉస్తాద్ భగత్ సింగ్ మీద ఆసక్తి రెట్టింపు కావాలంటే సరైన కంటెంట్ వదలాలి. ఇప్పటిదాకా శ్రీలీల, రాశిఖన్నా, పార్తిబన్ పాత్రలను పోస్టర్లలో చూడటమే లైవ్ దర్శనం జరగలేదు. దాంతో పాటు పోలీస్ ఆఫీసర్ డ్రెస్ ఉన్న పవన్ వేరియేషన్స్ ని జనంలోకి ఇంకా బాగా తీసుకెళ్లాలి. పబ్లిసిటీ ఎక్కువ చేయకపోయినప్పటికీ ఒక ప్రీ రిలీజ్ ఈవెంట్ తో అంచనాలు ఎక్కడికో వెళ్ళిపోతాయనే నమ్మకంతో టీమ్ ఉంది. చూడాలి మరి ఏం జరగనుందో.

## పుష్ప ఫ్లవర్ డైలాగ్... మంచు లక్ష్మి ముందే



పుష్ప అంటే ఫ్లవర్ అనుకుంటివా ఫైర్.. వైల్డ్ ఫైర్ అనే డైలాగ్ ఎంత పాపులర్ అయిందో తెలిసిందే. పుష్ప: ది రైజ్ రిలీజైనపుడు ఈ డైలాగ్ సోషల్ మీడియాను ఒక ఊపు ఊపేసింది. కాల క్రమంలో కల్ట్ స్టేటస్ తెచ్చుకుంది. ఐతే ఇప్పుడు మంచు లక్ష్మి ప్రధాన పాత్ర పోషించిన లేచింది మహిళా లోకం సినిమాలోనూ అచ్చం ఇలాంటి డైలాగే ఉంది. దాన్ని మంచు లక్ష్మే పలికింది. పుష్ప డైలాగ్‌ను మీరు కాపీ కొట్టారేంటి అని అడిగితే.. తమది కాపీ డైలాగ్ కాదని నవ్వుతూనే స్పష్టం చేసింది మంచు లక్ష్మి. పుష్ప సినిమా కంటే ముందే తమ మూవీ షూటింగ్ పూర్తయిందని.. అల్లు అర్జున్ కంటే ముందే తాను ఫ్లవర్-ఫైర్ డైలాగ్ చెప్పానని ఆమె వెల్లడించింది. సుకుమార్ గారికి కూడా ఈ విషయం చెబుతున్నా అంటూ ఆమె క్లారిటీ ఇచ్చింది. ఇక లేచింది మహిళా లోకం మూవీలో మోహన్ బాబు కల్ట్ మూవీ పెదరాయుడులోని ఫిష్ అండ్ ఫిషర్ మ్యాన్ డైలాగ్‌తో పాటు మంచు విష్ణు ఒక ప్రెస్ మీట్లో ఆవేశంతో అన్న లెట్ దెమ్ నో అంకుల్ డైలాగ్‌ను అనుకరించే ప్రయత్నం చేశారు. దీని గురించి మంచు లక్ష్మిని అడిగితే.. అవి తన ప్రమేయం లేకుండా సినిమాలో పెట్టిన డైలాగులని.. తానేమీ డబ్బులిచ్చి రాయించుకోలేదని.. వీటితో తనకేం సంబంధం లేదని ఆమె స్పష్టం చేసింది. సోషల్ మీడియాలో జరిగే ట్రోలింగ్, కామెంట్ల గురించి స్పందిస్తూ.. ఒకప్పుడు తాను ఇలాంటి వాటికి కంగారు పడిపోయేదాన్నని.. ఇప్పుడు చాలా లైట్ అని.. మన వల్ల ఒకరు బతుకుతుంటే బతుక్కోని అనుకుంటున్నానని.. ఎవరేం చేసుకోవాలనుకుంటే అది చేసుకోవచ్చని ఆమె కామెంట్ చేసింది. తాను ఇంతకుముందు మీడియాతో మాట్లాడేటపుడు కూడా.. ఏం మాట్లాడితే ఏమవుతుందో అని జాగ్రత్తగా మాట్లాడేదాన్నని.. ఇప్పుడు అలాంటి ఫీలింగ్ ఏమీ లేదని.. ఏమనిపిస్తే అది మాట్లాడేయగలుగుతున్నానని మంచు లక్ష్మి వ్యాఖ్యానించింది.




## చమురు కూల్.. స్టాక్ మార్కెట్ ఖుష్..

### సెన్సెక్స్ 640 పాయింట్లు పైకి



దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు రెండ్రోజుల వరుస భారీ నష్టాల నుంచి బయట పడ్డాయి. ఇరాన్‌తో యుద్ధానికి త్వరలో ముగింపు పలుకుతామంటూ అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వ్యాఖ్యలు మదుపర్లకు ఊరటనిచ్చాయి. దీనికితోడు చమురు సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా ఆంక్షలను సడలిస్తున్నట్లు ట్రంప్ పేర్కొనడం సెంటిమెంట్ బలోపేతం చేసింది. దీంతో నిన్న 100 డాలర్ల ఎగువన ట్రేడైన బ్యారెల్ చమురు ధర.. 90 డాలర్ల దిగువకు చేరింది. ఈ క్రమంలో అంతర్జాతీయ మార్కెట్‌లతో పాటు దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు రాణించాయి. సెన్సెక్స్ ఓ దశలో 900 పాయింట్ల మేర లాభపడగా.. నిఫ్టీ 24,200 మార్కును దాటింది. సెన్సెక్స్ ఉదయం 78,375.73 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 77,566.16) లాభాల్లో ప్రారంభమైంది. రోజంతా లాభాల్లోనే కొనసాగింది. ఇంట్రాడేలో 78,526.25 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరికి 639.82 పాయింట్ల లాభంతో 78,205.98 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 233.55 పాయింట్ల లాభంతో 24,261.60 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 91.83గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో మహీంద్రా అండ్ మహీంద్రా, ఇండిగో, మారుతీ సుజుకీ, ఐసీఐసీఐ బ్యాంక్, ఏషియన్ పెయింట్స్ స్టాక్స్ ప్రధానంగా లాభపడ్డాయి. ఎటర్నల్, ఇన్ఫోసిస్, రిలయన్స్, భారతీ ఎయిర్‌టెల్, టీసీఎస్ స్టాక్స్ నష్టాల్లో ముగిశాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 91.36 డాలర్ల వద్ద కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 5,176.72 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

## చైనా ఎఫ్‌డీఐలకు కేంద్ర క్యాబినెట్ గ్రీన్ సిగ్నల్




భారత్‌తో సరిహద్దును పంచుకునే దేశాల నుంచి వచ్చే విదేశీ ప్రత్యక్ష పెట్టుబడుల విషయంలో కేంద్రం కీలక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. చైనా సహా మిగిలిన అన్ని దేశాల ఎఫ్‌డీఐల విషయంలో ఉన్ననిబంధనలను సరళతరం చేసేందుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని సంబంధిత వర్గాలను ఉటంకిస్తూ పీటీఐ వార్తా సంస్థ పేర్కొంది. ఈ మేరకు ప్రధాని మోదీ నేతృత్వంలో మంగళవారం జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు తెలిపాయి. గల్వాన్ లోయలో 2020లో భారత్- చైనా సైనికుల మధ్య చోటుచేసుకున్న ఘర్షణ కారణంగా ఆ దేశంతో సంబంధాలు క్షీణించాయి. దీంతో టిక్ టాక్, వియ్‌చాట్ వంటి 200 యాప్‌లను భారత్ నిషేధించింది. ఎలక్ట్రిక్ వాహన తయారీ సంస్థ బీవైడీ నుంచి వచ్చిన పెట్టుబడి ప్రతిపాదనలనూ భారత్ తిరస్కరించింది. ఆ దేశం నుంచి వచ్చే ఎఫ్‌డీఐల నిబంధనలనూ కఠినతరం చేసింది. ప్రభుత్వం నుంచి తప్పనిసరిగా ముందస్తు అనుమతి తీసుకోవాలని 2020లో ప్రెస్ నోట్ 3ని ప్రభుత్వం జారీ చేసింది. భారత్‌తో సరిహద్దులను పంచుకునే దేశాలన్నింటికీ ఈ ప్రెస్ నోట్ 3 వర్తిస్తుందని తెలిపింది. చైనా, బంగ్లాదేశ్, పాకిస్థాన్, భూటాన్, నేపాల్, మయన్మార్, అఫ్గానిస్థాన్ లాంటి దేశాలు ఇందులో ఉన్నాయి. రెండేళ్ల క్రితమే ప్రస్తావన ఎన్డీయే మూడోసారి అధికారంలోకి వచ్చిన కొద్దిరోజులకే చైనా ఎఫ్‌డీఐల అంశం ప్రస్తావనకు వచ్చింది. 2024లో అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో చైనా పెట్టుబడుల గురించి ప్రస్తావన ఉంది. చైనా ఎఫ్‌డీఐలతో దేశీయంగా తయారీని పెంచవచ్చని, తద్వారా ఇక్కడి నుంచి విదేశాలకు వస్తువులను ఎగుమతి చేయొచ్చని పేర్కొంది. అమెరికా, యూరప్‌లు చైనాకు ప్రత్యామ్నాయాన్ని చూస్తున్న వేళ.. ఆ ప్రయోజనాన్ని పొందొచ్చని పేర్కొంది. చైనా పెట్టుబడులను ఆహ్వానించి ఆ ఉత్పత్తులను ఎగుమతి చేయడం మెరుగైన ఆలోచనగా సర్వే అభిప్రాయపడింది. కాబట్టి చైనా ఎఫ్‌డీఐలను ప్రోత్సహించాలని పేర్కొంది. నిబంధనలు కఠినం కావడంతో చైనా నుంచి వచ్చే ఎఫ్‌డీఐలు తగ్గాయి. 2000 ఏప్రిల్ నుంచి 2025 డిసెంబర్ మధ్య చైనా నుంచి కేవలం 2.51 బిలియన్ డాలర్ల పెట్టుబడులు మాత్రమే వచ్చాయి. దేశంలోకి వచ్చే మొత్తం ఎఫ్‌డీఐల్లో చైనా 23వ స్థానంలో ఉంది.


## భారత్‌లో యాపిల్ జోరు..



ప్రపంచంలోనే రెండో అతిపెద్ద స్మార్ట్‌ఫోన్ మార్కెట్‌గా ఉన్న భారత్‌లో ఐఫోన్ తయారీ సంస్థ యాపిల్ (ూజూజూశ్రీవ) జోరు పెంచింది. ప్రపంచవ్యాప్తంగా విక్రయిస్తున్న ఐఫోన్లలో 25 శాతం భారత్‌లోనే తయారవుతున్నట్లు బ్లూమ్‌బెర్గ్ వార్తా సంస్థ వెల్లడించింది. 2025లో దేశంలో ఐఫోన్‌ల ఉత్పత్తి దాదాపు 53 శాతం పెరిగినట్లు తెలిపింది. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చైనాపై విధించిన భారీ సుంకాలను తప్పించుకొనేందుకు యాపిల భారత్‌లో ఉత్పత్తులను పెంచుతుండడమే దీనికి కారణమని పేర్కొంది.

బ్లూమ్‌బెర్గ్ ప్రకారం.. యాపిల్ ప్రపంచవ్యాప్తంగా ఏటా గరిష్ఠంగా 230 మిలియన్ల (23 కోట్ల) ఐఫోన్‌లను ఉత్పత్తి చేస్తుంది. 2024లో ఆ సంస్థ 36 మిలియన్ల ఐఫోన్‌లను భారత్‌లో అసెంబుల్ చేయగా.. గతేడాది ఆ సంఖ్య 55 మిలియన్లకు (5.5 కోట్లు) పెరిగింది. భవిష్యత్తులో ఐఫోన్ల తయారీలో భారత్ వాటా మరింత వేగంగా పెరిగే అవకాశం ఉంది. దేశీయ తయారీని పెంచే లక్ష్యంతో ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన ఉత్పత్తి ఆధారిత ప్రోత్సాహక పథకం సాయంతో యాపిల్ ఇటీవలి సంవత్సరాల్లో భారత్‌లో తన విస్తరణను వేగవంతం చేసింది. అధిక లాజిస్టిక్స్ ఖర్చులు, ఇతర నిర్మాణాత్మక సవాళ్లను భర్తీ చేయడానికి మోదీ ప్రభుత్వం ఇస్తున్న సబ్సిడీలు ఆ సంస్థకు సహాయపడుతున్నాయి. ప్రస్తుతం స్మార్ట్‌ఫోన్ ఉత్పత్తి సబ్సిడీలు మార్చి 31తో ముగియనున్నందున ఎగుమతులను పెంచడానికి నూతన ప్రోత్సాహకాలపై యాపిల్ సంస్థ కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరుపుతున్నట్లు తెలుస్తోంది.

## 9200 mAh బ్యాటరీతో షావోమీ కొత్త ప్యాడ్ 8



చైనాకు చెందిన ప్రముఖ ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల తయారీ సంస్థ షావోమీ దేశీయ మార్కెట్‌లోకి కొత్త ప్యాడ్‌ను లాంచ్ చేసింది. 9200హెూప్త బిగ్ బ్యాటరీతో ప్యాడ్ 8 (శఱశీఎఱ 8)ను విడుదల చేసింది. 11.2 అంగుళాల 3.2ఖ ఎల్‌సీడీ డిస్‌ప్లే అమర్చారు. 144ఎఓ రిఫ్రెష్ రేట్‌తో పనిచేస్తుంది. 800 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్ ఉంది. డాల్బీ డిస్‌ప్లే విజన్, హెచ్‌డీఆర్10, డీసీఐ-పీ3కు సపోర్టు చేస్తుంది. గ్రాఫైట్ గ్రే, టైటానియం బ్లూ రంగుల్లో లభిస్తుంది. 45ఔ టర్బో ఛార్జింగ్‌తో వస్తోంది. షావోమీ ఫోకస్ పెన్ ప్రో, కీబోర్డును అనుసంధానం చేసుకునే వెసులుబాటుతో ఈ ప్యాడ్‌ను తీసుకురావడం విశేషం. షావోమీ ప్యాడ్ 8కు వెనకవైపు 13వీూ ప్రధాన కెమెరా, 8వీూ ఫ్రంట్ కెమెరా ఇచ్చారు. స్నాప్ డ్రాగన్ 8ఎస్ జెన్ 4 ప్రాసెసర్ అమర్చారు. ఆండ్రాయిడ్ 16తో కూడిన హైపర్ ఓఎస్3తో పనిచేస్తుంది. దీని బరువు 485 గ్రాములు. ఈ ప్యాడ్ 5.75ఎఎ థిక్‌నెస్ కలిగిఉంది. మెటల్ బాడీ, మెటల్ ఫ్రేమ్‌ను ఇచ్చారు. సైడ్ ఫింగర్ ప్రింట్ మౌంట్ అమర్చారు. 6.0 బ్లూటూత్ వెర్షన్‌తో పనిచేస్తుంది. ఇక ధర విషయానికొస్తే.. ఈ ప్యాడ్‌ను మూడు వేరియంట్లలో తీసుకొచ్చారు. 8జీబీ ం128 జీబీ ధర రూ.33,999, 12+దీ ం 256+దీ ధర రూ.35,999గా నిర్ణయించారు. దీంతో 12+దీ ం 256+దీ స్టోరేజీతో నానో టెక్చర్ డిస్‌ప్లే వేరియంట్ ధరను రూ.38,999గా కంపెనీ నిర్ణయించింది. దీంతోపాటు క్రియేటర్ ఎడిషన్‌ను తీసుకొచ్చింది. దీని ప్రారంభ ధరను ?41,999గా నిర్ణయించింది. ఇదే మోడల్ నానో టెక్చర్ డిస్‌ప్లే ధరను రూ.43,999గా పేర్కొంది. మార్చి17 నుంచి అమెజాన్, షావోమీ వెబ్‌పోర్టల్‌లో విక్రయాలు ప్రారంభం కానున్నాయి. ఎస్‌బీఐ బ్యాంకు కార్డులతో కొనుగోలు చేసేవారికి రూ.3 వేల వరకు డిస్కౌంట్ లభిస్తుంది. మార్చి 17 నుంచి 31వ తేదీల మధ్య కొనుగోలు చేసేవారికి ఏడాది పాటు అదనపు వారెంటీ ఇస్తామని కంపెనీ పేర్కొంది. ప్యాడ్ 8తో పాటు కవర్ కూడా కొనుగోలు చేయాలంటే రూ.1499 చెల్లించాల్సి ఉంటుంది. ప్యాడ్8 కీబోర్డు ధర రూ.4,999, షావోమీ ఫోకస్ పెన్ ప్రో ధరను రూ.5,999గా నిర్ణయించారు. ప్యాడ్ 8 ఫోకస్ కీబోర్డు ధరను రూ.8,999గా కంపెనీ పేర్కొంది. ఈ యాక్సెసరీలు సైతం మార్చి 17 నుంచి లభ్యమవుతాయి.

# విస్తృతంగా హెచ్‌పివి వ్యాక్సినేషన్



**విజయనగరం, మార్చి 10 (నేటి మనదేశమ్)** : మహిళల్లో వచ్చే గర్భాశయ ముఖద్వార కేన్సర్ నివారణే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా చేపట్టిన హెచ్‌పివి వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ, 14 సంవత్సరాల వయస్సు గల బాలికలందరికీ హెచ్‌పివి టీకా వేయనున్నట్లు, ఈ ప్రత్యేక వ్యాక్సినేషన్ డ్రైవ్ మూడు నెలల పాటు కొనసాగనున్నట్లు కలెక్టర్ తెలిపారు. గర్భాశయ ముఖద్వార కేన్సర్‌ను ముందుగానే నివారించడంలో ఈ టీకా అత్యంత ప్రభావవంతమైనదని, మహిళల ఆరోగ్యానికి ఇది రక్షణ కవచంగా పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ ద్వారా అన్ని శాఖలకు స్పష్టమైన బాధ్యతలను అప్పగించారు. రెవెన్యూ, పంచా యతీ రాజ్ శాఖలు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ప్రజల్లో అవగాహన కల్పించగా, వైద్య ఆరోగ్య శాఖ ద్వారా ప్రభుత్వ ఆసు పత్రులు, సిహెచ్‌సిల్లో పీడియాట్రిషియన్లు అందుబాటులో ఉండేలా చర్యలు తీసు కుంటున్నట్లు చెప్పారు. అంగన్వాడీ కార్యకర్తల ద్వారా బడి బయట ఉన్న బాలికలను గుర్తించి వారికి కూడా టీకా అందించే చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు.

లయన్స్ క్లబ్, రోటరీ క్లబ్, ఐఎంఏ మరియు క్యాన్సర్ సొసైటీలు వంటి స్వచ్ఛంద సంస్థలు కూడా ఈ కార్యక్రమంలో భాగస్వాములై ప్రజల్లో అవగాహన పెంచాలని కలెక్టర్ కోరారు.

## కిడ్నీ బాధితునికి

# మంత్రి ఆర్థిక సాయం



**రామచంద్రపురం, మార్చి 10 (నేటి మనదేశమ్)** : ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్న కిడ్నీ బాధితునికి కార్మిక శాఖామంత్రి వాసంశెట్టి సుభాష్ రూ.30 వేలు ఆర్థిక సాయాన్ని సోమవారం అందజేశారు. డాక్టర్ బిఆర్.అంబేద్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడి వరం నియోజకవర్గం ఐ.పోలవరం మండలం కేసన కూరుపాలెం గ్రామానికి చెందిన వాసంశెట్టి శ్రీనివాస్ తన రెండు కిడ్నీలు పాడై అత్యవసర చికిత్స పొందుతున్నాడు. శ్రీనివాస్ కుటుంబ ఆర్థిక పరిస్థితిని స్థానిక కూటమి పార్టీల నాయకులు మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆయన తక్షణ సాయంగా రూ.30 వేలను అందిం చారు. ఆర్థిక సాయం అందించిన బాధితుని భార్య రేఖ మంత్రికి కృతజ్ఞతలు తెలిపారు.

# స్మార్ట్ కిచెన్‌లో కలెక్టర్‌కు సత్కారం




**కడప, మార్చి 10 (నేటి మనదేశమ్)** : నీతి అయోగ్ ప్రాంతీయ సదస్సులో నీతి ఆయోగ్ ఉపకార్యదర్శి సత్కారాన్ని కడప కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అందుకున్నారు. వైఎస్ఆర్ జిల్లాలో ప్రారంభించిన స్మార్ట్ కిచెన్ దేశానికే ఆదర్శమని నీతి అయోగ్ ప్రాంతీయ సదస్సులో నీతి ఆయోగ్ ఉప కార్యదర్శి గౌరవ్ కత్యార్, సభ్యులు కొనియాడారు. సోమవారం విశాఖపట్నంలో ఏ-1 గ్రాండ్ కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన ఆకాంక్షిత జిల్లాల కార్యక్రమం, ఆకాంక్షిత మండలాల కార్యక్రమంలో భాగంగా దక్షిణ ప్రాంత నీతి ఆయోగ్ ప్రాంతీయ సదస్సులో పాల్గొన్న జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరు కూరి ప్రశంసలు అందుకున్నారు. ఈ సంద ర్భంగా కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ...

ఃస్మార్ట్ కిచెన్ః కార్యక్రమం ద్వారా ఆహార తయారీ వ్యవస్థలో సామర్థ్యం, పరిశుభ్రత, పోషకాహార నాణ్యతను మెరుగుపరచడం లక్ష్యంగాపెట్టుకున్నామన్నారు.

# పరిశ్రమల ఏర్పాటుకు భూముల పరిశీలన



**మాకవరపాలెం, మార్చి 10 (నేటి మనదేశమ్)** : పరిశ్రమల ఏర్పాటు కోసం మండ లం లోని పైడిపాల, పెద్దిపాలెం, బూరుగు పాలెం, తూటిపాల రెవెన్యూ గ్రామాల్లో ప్రభుత్వ, డి.పట్టా భూములను సోమవారం రెవెన్యూ శాఖ ముఖ్యకార్యదర్శి ముకేశ్ కుమార్ మీనా, పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖల కార్యదర్శి యువరాజ్ పరిశీలించారు. సమీపంలో వున్న పాపయ్యపాలెం రిజర్వాయర్ గురించి స్థానిక అధికారులను అడిగి తెలుసు కున్నారు. మండలంలో 737 సర్వే నంబరులో ఏ కంపెనీని ఎంతెంత భూమిని కేటాయిం చారు? ఏయే కంపెనీలు ఏర్పాటవుతున్నాయి వంటి వివరాలను కలెక్టర్ విజయకృష్ణన్ నుంచి తెలుసుకున్నారు. కాగా పైడిపాల, పెద్దిపాలెం, బూరుగుపాలెం, తూటిపాల గ్రామాల పరిధిలో రెవెన్యూ అధికారులు ఇటీవల సర్వే చేసి 4,259 ఎకరాల ల్యాండ్ బ్యాంకు వున్నట్టు గుర్తించారు. తాజాగా ఈ భూములను, వీటికి సంబంధించిన మ్యాపులను రాష్ట్రస్థాయి అధికారులు పరిశీలించారు. వీటిల్లో అత్యధి కంగా డి.పట్టా భూములు వున్నాయి. ఇందులో సాగులో వున్న మామిడి, జీడిమామిడి, సరుగుడు తోటలను వారు చూశారు. వీరి వెంట ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ నరసింహా రావు, ఆర్డీవోఓ వీవీ రమణ, తహశీల్దార్ ముజీబ్, మండల సర్వేయరు వెంకటేశ్వరరావు వున్నారు.

## గుంకలాం ప్రధానోపాధ్యాయునికి

# జాతీయ అవార్డు



**విజయనగరం, మార్చి 10 (నేటి మనదేశమ్)** : విజయ నగరం మండలం గుంకలాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు డాక్టర్ వెలమల శ్రీనివాస్ విద్యా రంగంలో అందించిన విశిష్ట సేవలకు గాను ఇటీవల న్యూఢిల్లీలో నిర్వహించిన రాష్ట్రీయ సేవా సమ్మాన్ - 2026 అవార్డ్స్ కార్య క్రమంలో జాతీయ అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమాన్ని నీతి ఆయోగ్ మరియు కారవాన్ సంస్థలు సంయుక్తంగా నిర్వహించాయి. సోమవారం శ్రీనివాస్ ఈ అవార్డును జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి వద్ద ప్రదర్శించి, ఆయన చేతుల మీదుగా స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ శ్రీనివాస్‌ను అభినందిస్తూ, విద్యారంగంలో ఆయన చేసిన సేవలు ప్రశంస నీయమని పేర్కొన్నారు. విద్యార్థుల విద్యాభివృద్ధి, పాఠశాల అభివృద్ధి, నూతన బోధన విధానాల అమలులో ఆయన చేసిన కృషికి గాను జాతీయ అవార్డు లభించడం జిల్లాకు గర్వకారణమని తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇదే ఉత్సాహంతో విద్యా రంగంలో మరింత సేవ చేయాలని ఆకాంక్షించారు.

## డిఎంహెచ్ఓ పేరుతో వస్తున్న

# నకిలీ ఉద్యోగ ప్రకటనలు నమ్మవద్దు

### జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్ జీవన రాణి



**విజయనగరం, మార్చి 10 (నేటి మనదేశమ్)** : సామాజిక మాధ్యమాల్లో జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖలో ఉద్యోగాల భర్తీ జరుగుతున్నట్లు వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమని జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ ఎస్. జీవనరాణి స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ప్రస్తుతం జిల్లా వైద్య మరియు ఆరోగ్యశాఖ నుండి ఎటువంటి ఉద్యోగ నోటిఫికేషన్ విడుదల చేయలేదని తెలిపారు. సోషల్ మీడియా లేదా ఇతర మార్గాల ద్వారా వస్తున్న నకిలీ కాల్స్, మెసేజ్లు నమ్మి ఎవరూ మోసపోవద్దని సూచించారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు అడిగితే అస్సలు నమ్మవద్దని హెచ్చరించారు. ప్రభుత్వ ఉద్యోగాలకు సంబం ధించిన అధికారిక సమా చారం ప్రభుత్వం నిబంధనల ప్రకారం మాత్రమే ప్రముఖ దినపత్రికలు మరియు అధి కారిక వెబ్‌సైట్ల ద్వారా ప్రకటించబడుతుందని తెలిపారు. మోసపూరితమైన ఫోన్ కాల్స్, మెసేజ్లు లేదా నకిలీ నియామక పత్రాలను నమ్మి ఎవరూ డబ్బులు చెల్లించ వద్దని, ఇటువంటి పుకార్ల పట్ల అభ్యర్థులు మరియు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎస్. జీవనరాణి కోరారు.

# రామ్మోహన్‌నాయుడిపై విమర్శలు చేయడం తగదు

### ఎమ్మెల్యే మామిడి గోవిందరావు



**పాతపట్నం (శ్రీకాకుళం) మార్చి 10 (నేటి మనదేశమ్)** : కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడి పై వైసీపీ నాయకులు విమర్శలు చేయడం తగదని ఎమ్మెల్యే మామిడి గోవింద రావు అన్నారు.

తన క్యాంపు కార్యాలయంలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లా డుతూ.. వైసీపీ హయాంలో కనీసం రోడ్డు సౌకర్యమై నా కల్పించలేక పోయారని, ఇప్పుడు టీడీపీ హయాంలో ప్రతి గ్రామం అభివృద్ధి బాటపడు తుందన్నారు. ఒడిశాతో సంబంధ ముండే నీటిపారుదల సమస్యలపై కేంద్ర మంత్రికి అ వగాహన ఉందన్నారు. నేరడి బ్యారేజీ సమ స్య పరిష్కారం కోసం ఇప్పటికే హామీ ఇచ్చారన్నారు.

పాతపట్నంలో నీలమణి దుర్గ అమ్మ వారి ఆలయం వద్ద జాతీయ రహదారి న మూనా మార్చుడంలో చూపిన చొరవ అలాగే పలు రోడ్లు, విద్యాసంస్థల నెలకొల్పడంలోనూ చూ పుతున్న చొరవ ఎనలేనిదన్నారు.

# క్రోసూరులో డయేరియా భయం

### గ్రీవెన్స్‌లో వినతిపత్రం ఇస్తున్న నాయకులు



**పల్నాడు జిల్లా, మార్చి 10 (నేటి మనదేశమ్)** : మెట్లు లేక రెండేళ్ల నుండి శుభ్రం చేయని ట్యాంక్ నుండి సరఫరా అవుతున్న నీరు తాగుతున్నామని, పలు ప్రాంతాల్లో డయేరియా ప్రబలడం చూస్తే భయంగా ఉందని క్రోసూరు గ్రామస్తులు ఆందోళనకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో ట్యాంకుకు మెట్లు నిర్మించి ట్యాంక్ శుభ్రం చేసి శుద్ధి చేసిన నీటిని సరఫరా చేయాలని సిపిఎం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు నరసరావుపేటలోని కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో విన్నవించారు. సిపిఎం మండల కార్యదర్శి టి.హనుమంతరావు, క్రోసూరు గ్రామ కార్యదర్శి చిలకా ఏషియ్య మాట్లాడుతూ 300కు పైగా దళిత కుటుం బాలకు ఈ ట్యాంకు నుండే నీరు సరఫరా అవుతాయని, ట్యాంకు సమస్యను ఎంపిడిఒ దృష్టికి పలు మార్లు తీసుకెళ్లినా పట్టించుకోలేదని చెప్పారు. తాగునీటి అంశానికి ప్రాధాన్య మివ్వాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, పంచాయతీ, ఆర్‌డబ్ల్యూఎస్ శాఖలు ఒకరిపై ఒకరు చెప్పుకుంటూ కాలయాపన చేస్తున్నారని అన్నారు. గ్రామంలో జల్ జీవన్ మిషన్ కింద పైపులు వేసినా నీరు సరఫరా కావడం లేదని, మరికొన్ని ప్రాంతాలకు పైపులైను అసలు వేయలేదని తెలిపారు. అన్ని ప్రాంతాలకు పైపులైను వేసి, ప్రతి ఇంటికీ కుళాయిలు కనెక్షన్ ఇచ్చి రక్షిత నీటిని సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై జిల్లా పంచాయతీ అధికారి స్పందిస్తూ..

ట్యాంకుకు శాశ్వత మెట్ల నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని ఆర్‌డబ్ల్యూఎస్ అధికారు లను ఆదేశించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సిపిఎం నాయకులు నాగమల్లేశ్వరరావు, క్రోసూరు గ్రామస్తులు ఉన్నారు.

## 38 మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందజేత

**నిడదవోలు (తూర్పుగోదావరి) నేటి మనదేశమ్** : నిడదవోలు క్యాంపు కార్యాలయంలో 38 మంది లబ్ధిదారులకు రూ.26.32 లక్షల విలువైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను మంత్రి కందుల దుర్గేష్ సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. "కన్నీరు తుడిచే చేయి.. కష్టం తీర్చే గుండె.. కూటమి ప్రభుత్వానికి నిరంతర ఆయుధాలు" అని అన్నారు. 19 నెలల కాలంలో నిడదవోలు నియోజకవర్గంలో అక్షరాలా 673 మందికి రూ.5,12,20,251 లబ్ధి చేకూర్చామన్నారు. వైద్య ఖర్చుల భారంతో కుంగిపోతున్న కుటుంబాలకు ఈ నిధులు కొత్త ఆశలను చిగురింపజేస్తున్నాయని హర్షం వ్యక్తం చేశారు. ఇది నిరంతర ప్రక్రియ అని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు,లబ్ధిదారుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## గ్యాస్ ధరల పెంపుపై కోట జంక్షన్ వద్ద రాస్తారోకో

**విజయనగరం, మార్చి 10 (నేటి మనదేశమ్)** : కేంద్ర ప్రభుత్వం వంటగ్యాస్ సిలిండర్‌పై రూ.60, వాణిజ్య సిలిండర్‌పై రూ.115 పెంపును నిరసిస్తూ సోమవారం స్థానికులు సిపిఎం ఆధ్వర్యంలో కోట జంక్షన్ వద్ద రాస్తారోకో నిర్వహించారు. పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని నినాదాలు చేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రెడ్డి శంకరరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఇస్తామన్నా ఉచిత గ్యాస్ సిలెండర్లు సప్లై చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలు కారణంగా అన్ని రకాల నిత్యవసర సరుకులు ధరలు పెరిగి మరింత భారంగా మారనున్నాయన్నారు. పెరిగిన గ్యాస్ ధరలు వలన ఆటో ఛార్జీలు, తినుబండారాలు ధరలు పెరిగి మరింత భారంగా మారనున్నాయన్నారు.

## స్వచ్ఛ రథాన్ని ప్రారంభించిన ఎంఎల్ఏ

**అయినవిల్లి మార్చి 10 (నేటి మనదేశమ్)** : స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద స్వర్ణాంధ్ర-స్వచ్ఛ ఆంధ్ర కార్య క్రమంలో భాగంగా స్వచ్ఛ రథాన్ని ఎంఎల్ఏ గిడ్డి సత్యనారాయణ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'తుక్కు ఇవ్వండి సరకులు తీసుకోండి' అనే నినాదంతో ఈ స్వచ్ఛ రథం ఇంటింటికీ వెళ్లి ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరిస్తుందన్నారు. ప్రజలు తమ ఇంట్లో ఉన్న ప్లాస్టిక్ వ్యర్థాలను అందిస్తే, వాటి బదులుగా నిత్యావసర సరుకులను రథం సిబ్బంది అందజేస్తారని తెలిపారు. సేకరించిన వ్యర్థాలను రీసైక్లింగ్‌కు పంపడం ద్వారా పర్యావరణ సంరక్షణకు ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. ప్లాస్టిక్ వ్యర్థాల వల్ల పర్యావరణానికి కలిగే దుష్ప్రభావాలను తగ్గించాలంటే ప్రతి పౌరుడు బాధ్యతా యుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, అధికారులు పాల్గొన్నారు.


VASTU HOUSING FINANCE

**వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్**

యూనిట్ 203 & 204, 2వ అంతస్తు, "ఏ" వింగ్, నవభారత్ ఎస్టేట్, జకారియా బందర్ రోడ్, సేవ్రీ (వెస్ట్), ముంబై – 400015, మహారాష్ట్ర.
సీఐఎన్ నం.: U65922MH2005PLC272501

**స్థిరాస్తుల విక్రయ ప్రకటన**

భద్రపరచిన ఆస్తుల సెక్యూరిటైజేషన్ మరియు పునర్నిర్మాణం, అలాగే భద్రతా హక్కుల అమలు చట్టం, 2002 (SARFAESI ACT, 2002) ప్రకారం మరియు భద్రతా హక్కుల (అమలు) నియమాల్లు, 2002 లోని రూల్ 8(6) అనుకరణకు అనుసరించి ఈ ఈ-వేలం విక్రయ నోటీసు జారీ చేయబడుచున్నది. సాధారణ ప్రజలకు మరియు ముఖ్యంగా రుణగ్రహీత / సహ రుణగ్రహీత / తాకట్టు దారుడు(లు)కు తెలియజేయునది ఏమనగా, క్రింద వివరించబడిన స్థిరాస్తులను భద్రపరచిన అప్పుదాత అయిన వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ కు తాకట్టు పెట్టబడినవి. వీటి పై సంకేతాత్మక స్వాధీనం (SYMBOLIC POSSESSION) ను వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్ యొక్క అధీకృత అధికారి స్వీకరించినారు (ఇకపై "వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్"గా సూచించబడును). పై భద్రపరచిన ఆస్తులు "ఎక్కడ ఉన్నట్లయితే అక్కడే", "ఏ స్థితిలో ఉన్నాయో ఆ స్థితిలోనే", మరియు "ఏమైతే ఉందో అదే విధంగా" అనే నిబంధనల ఆధారంగా ఈ-వేలం ద్వారా విక్రయించబడును. ప్రజలకు తెలియజేయునది ఏమనగా, ప్రజలు ఈవేలం ప్రక్రియను HTTPS://SARFAESI.AUCTIONTIGER.NET వెబ్‌సైట్ ద్వారా నిర్వహించబడును.

| క్రమ సంఖ్య | ఖాతా నంబర్ మరియు ఋణగ్రహీత, సహ-ఋణగ్రహీత, తాకట్టు దారుల పేర్లు | 13 (2) సెక్షను క్రింద డిమాండు నోటీసు ఇచ్చిన తేదీ, బాకీ డబ్బు మరియు సంకేతాత్మక తేదీ స్వాధనం చేసుకున్న తేదీ | ఆస్తి/ఆస్తుల వివరాలు | రిజర్వ్ ధర భద్రతా డిపాజిట్ (రూ.) | ఇ-వేలం తేదీ మరియు సమయం, EMD సమర్పణ చివరి తేదీ, తనిఖీ తేదీ |
| --- | --- | --- | --- | --- | --- |
| 1 | LP0000000197735 జి బజరు (రుణగ్రహీత), గ్లిల్లి లిల్లీ (సహ-రుణగ్రహీత) | డిమాండ్ నోటీస్ తేదీ: 18/7/2025 మొత్తం: రూ. 730233/- 9/7/2025 నాటికి + వడ్డీ, ఖర్చులు మొదలైనవి మరియు 21/1/2026 | కర్నూల్ జిల్లా, డోన్ రిజిస్ట్రేషన్ జిల్లా, వెల్దుర్తి మండలం, నర్సాపురం గ్రామ పంచాయతి, నర్సాపురం గ్రామం, హౌస్ నెం. 1-88B, సర్వే నెం. 98, విస్తీర్ణం 222.22 చదరపు గజాలు లేదా 10(X) చదరపు అడుగులు,దానిలో నరసాపురం గ్రామ పంచాయతి ,నరసాపురం గ్రామంలో 222.22 చదరపు గజాల స్థలంలో నిర్మించబడిన ప్లింథ్ విస్తీర్ణం 1000 చదరపు అడుగుల ఆర్‌సీసీ (RCC) ఇల్లు.ఈ పరిమితులలో 222.22 చదరపు గజాల స్థలంలో మరియు దానిలో 1000 చదరపు అడుగుల ఆర్‌సీసీ ఇల్లు, ఇందులో అన్ని ఈజ్‌మెంట్ హక్కులు, ఫిక్చర్స్ మరియు ఫిట్టింగ్స్ సహా ఉన్నాయి. | రూ.2575330- రూ. 257533/- | 11/04/2026 సమయం ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 12:00 వరకు, 10/04/2026 సాయంత్రం 5:00 వరకు., 26/03/2026 |

1. ఆసక్తిగల పాల్గొనేవారు/బిడ్డర్లు అందరూ HTTPS://SARFAESI.AUCTIONTIGER.NET వెబ్‌సైట్‌ను సందర్శించవలెను . వివరాలు, సహాయం, విధానం మరియు ఇ-వేలంపై ఆన్‌లైన్ శిక్షణ కోసం, కాబోయే బిడ్డర్లు M/S ఇ-ప్రొక్యూర్‌మెంట్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ (వేలం)ని సంప్రదించవచ్చు; చిరునామా: ప్రధాన కార్యాలయం: B-705, వాల్ స్ట్రీట్ II, ఒరియంట్ క్లబ్ ఎదురుగా, గుజరాత్ దగ్గరకాలేజ్, ఎల్లిస్ బ్రిడ్జి, అహ్మదాబాద్ - 380 006 గుజరాత్ (భారతదేశం). సంప్రదించవలసిన వ్యక్తి: శ్రీ రామ్ శర్మ కాంటాక్ట్ నంబర్: 8000023297/9265562818/9265562821/079-68136842/6869. ఈమెయిల్ ఐడి: RAMPRASAD@AUCTIONTIGER.NET, SUPPORT@AUCTIONTIGER.NET
2. నిబంధనలు మరియు షరతులపై మరిన్ని వివరాల కోసం దయచేసి ఇ-వేలంలో పాల్గొనడానికి HTTPS://SARFAESI.AUCTIONTIGER.NET ని సందర్శించండి.
3. ఆస్తి గురించి మరిన్ని వివరాల కోసం దయచేసి అధీకృత అధికారిని సంప్రదించండి: రాజు రెడ్డి నీలపల్లి కాంటాక్ట్ నెం. 9949600034

**ఇది భద్రతా ఆసక్తి (అమలు) నియమాలు, 2002 యొక్క నియమం 8(6) ప్రకారం చట్టబద్ధమైన 30 రోజుల అమ్మకపు నోటీసు కూడా.**

తేదీ : 11.03.2026
స్థలం: కర్నూలు

అధీకృత అధికారి
వాస్తు హౌసింగ్ ఫైనాన్స్ కార్పొరేషన్ లిమిటెడ్

## జిల్లాలో వేరువేరు ప్రాంతాల్లో అదుపుతప్పి లారీలు బోల్తా




**పల్నాడు మార్చి 10 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పల్నాడు జిల్లా నకరికల్లు అడ్డరోడ్డు వద్ద అద్దంకి నార్కెట్పల్లి రాష్ట్ర రహదారిపై మంగళవారం లారీ అదుపుతప్పి బోల్తా కొట్టింది. ఈ ప్రమాదంలో లారీ కింది భాగంలో ఓ వ్యక్తి చిక్కుకున్నట్లు స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ప్రమాదం కారణంగా రహదారిపై ట్రాఫిక్ భారీ ఎత్తున నిలిచింది. పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం రెంటపాళ్ల గ్రామ సమీపంలో మంగళవారం ఇసుక లారీ అదుపుతప్పి బోల్తా కొట్టింది.. డ్రైవర్ సురక్షితంగా బయటపడటంతో పెను ప్రమాదం తప్పింది. లారీ రోడ్డుకు అడ్డంగా పడటంతో కొంతసేపు ట్రాఫిక్కు అంతరాయం కలిగింది పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఉత్తమ మహిళగా లాం నవమి కి గౌరవ పురస్కారం



**గుంటూరు మార్చి 10 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** జాతీయ స్థాయిలో క్రీడా, సాంస్కృతిక, సేవా రంగాల్లో ప్రతిభ చాటి ఉత్తమ మహిళగా గుర్తింపు పొందిన గుంటూరు నగరానికి చెందిన లాం నవమికు గుంటూరు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో గౌరవ పురస్కారం అందజేశారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ఈనెల 8న గుంటూరు జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు ఆధ్వర్యంలో మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీకి క్షేత్రస్థాయిలో సేవలు అందిస్తూ, వివిధ రంగాల్లో ప్రతిభ కనబరుస్తున్న అంగన్వాడి డ్వాక్రా సాధికార సంస్థ గుంటూరు పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి లాం నవమిని ప్రత్యేకంగా సత్కరించి గౌరవ పురస్కారం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పిల్లి మాణిక్యరావు మాట్లాడుతూ, లాం నవమి క్రీడా, సాంస్కృతిక, సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు అధిరోహించి ప్రజలకు మరింత సేవలు అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, మహిళా నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## వరుసకు అన్న... ప్రేమించమని వేధింపులు....




**పల్నాడు మార్చి 10 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** వరసకు అన్న..... ప్రేమించమని వేధింపులకు పాల్పడుతున్న వ్యక్తి..... వివరాల్లోకెళ్తే.. నరసరావుపేటలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థినిని ప్రేమించాలంటూ వేధింపులకు పాల్పడుతున్న యువకుడిపై మంగళవారం వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. బాధితురాలికి వరసకు అన్న అయ్యే రత్నరాజు తనను పెళ్లి చేసుకోవాలని కొంతకాలంగా వేధిస్తున్నట్లు తెలిపారు. వేధింపులు భరించలేక బాధితురాలు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఆదర్శమూర్తి సావిత్రిబాయి పూలే ఎమ్మెల్యే మాల కొండయ్య



**పొన్నూరు మార్చి 10 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** చీరాల శాసనసభ్యులు మద్దులూరి మాలకొండయ్య, యువ నాయకులు మద్దులూరి గౌరీ అమర్నాథ్ మంగళవారం చీరాల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో భారతదేశ తొలి మహిళా ఉపాధ్యాయురాలు, సామాజిక విప్లవకారిణి సావిత్రిబాయి పూలే వర్ధంతిని నిర్వహించి, ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి అంజలి ఘటించారు. అక్షర విప్లవం, అణచివేతకు వ్యతిరేకంగా, వివక్ష లేని సమాజం కోసం అక్షరాన్నే ఆయుధంగా మలిచిన తొలి తరం యోధురాలు సావిత్రిబాయి అని కొనియాడారు.

## కక్షి దారులకు సత్వర న్యాయమే లోకఅదాలత్ ల ముఖ్య ఉద్దేశం...

### కృష్ణా జిల్లా జడ్జి జి. గోపి



**మచిలీపట్నం మార్చి 10 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** పెండింగ్ లో ఉన్న రాజీ పడదగ్గ సివిల్ మరియు క్రిమినల్ కేసులను సత్వరమే పరిష్కరించడమే జాతీయ లోక్ అదాలత్ యొక్క ముఖ్య ఉద్దేశం అని కృష్ణా జిల్లా జడ్జి జి. గోపి అన్నారు. మంగళవారం జిల్లా కోర్టు ప్రాంగణంలోనిజిల్లా న్యాయ సేవాసదనము లో న్యాయమూర్తుల న్యాయవాదుల సంయుక్త సమావేశానికి జిల్లా జడ్జి జి.గోపి ముఖ్యఅతిథిగా విచ్చేశారు. మార్చి 14వ తేదీన దేశవ్యాప్తంగా జాతీయ లోక్ ఆదాలత్ నిర్వహిస్తున్నట్లు ఆయన తెలియజేశారు. కృష్ణా జిల్లా వ్యాప్తంగా మచిలీపట్నం విజయవాడ గుడివాడ నందిగామ నూజివీడు తో సహా అన్ని న్యాయస్థానాలలో లోక్ ఆదాలత్ బెంచ్ లు ఏర్పాటు చేసినట్లు జిల్లా జడ్జి వివరించారు. కేసులు సత్వర పరిష్కారానికి న్యాయవాదులు పోలీసులు ఇతర అధికారులు సహకరించాలని ఆయన తెలియజేశారు. సత్వర న్యాయం పొందడం ద్వారా ప్రజలకు న్యాయవ్యవస్థ పై మరింత నమ్మకం పెరుగుతుందని అన్నారు. ఇటీవల భోపాల్ లో జరిగిన జాతీయ స్థాయి న్యాయమూర్తుల సమావేశంలో పాల్గొన్న కృష్ణా జిల్లా జడ్జి జి. గోపి లోక్ ఆదాలత్ మరియు మీడియేషన్ యొక్క వివరాలను తెలియజేశారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఇటీవల కృష్ణా జిల్లాకు విచ్చేసిన సందర్భంగా మీడియేషన్ పై ప్రత్యేక సదస్సు నిర్వహించి కేసులు పరిష్కారానికి కృషి చేయాలని పిలుపునిచ్చిన విషయం జిల్లా జడ్జి తెలియ చేశారు. జిల్లా కోర్టులో కేసుత్వరిత పరిష్కారం కోసం వివిధ బెంచ్ లు న్యాయమూర్తులు న్యాయవాదులతో ఏర్పాటు చేసినట్లు, కక్షిదారులు తమ కేసులను లోకాదాలతో పరిష్కరించుకుని తగిన న్యాయం పొందాలని అన్నారు. చిన్న చిన్న తగాదాలు పరిష్కారం చేసుకోవడం ద్వారాగ్రామాల్లో శాంతి భద్రతలను కాపాడటానికి లోక్ ఆదాలత్ లు దోహదపడుతుందని అన్నారు. కేసులను సత్వరమే పరిష్కరించడం ద్వారా కక్ష దారులకు న్యాయ వ్యవస్థ పై మరింత నమ్మకం పెరుగుతుందని తద్వారా కొత్త కేసులు ముందుకు వస్తాయని అన్నారు. గత లోక్ ఆదాలత్ లో రాష్ట్ర స్థాయిలో నాలుగో స్థానంలో ఉన్న కృష్ణాజిల్లాను మొదటి స్థానం స్థాయికి తీసుకురావాలని అందుకు న్యాయమూర్తులు న్యాయవాదులు పోలీస్ అధికారులు కక్షిదారులు పరస్పర సహకారంతో ముందుకు వెళ్లాలని అన్నారు. లోక ఆదాలత్ లో పరిష్కారం చేసుకున్న సివిల్ ధావాలకు కోర్టు ఫీజు తిరిగి కక్షిదారులకు చెల్లిస్తారని అందుకోసం కృష్ణా జిల్లా కలెక్టర్ మరియు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ తో కూడా మాట్లాడినట్లు జిల్లా జడ్జి తెలియజేశారు. దేశవ్యాప్తంగా మార్చి 14వ తారీఖున జాతీయ లోక్ ఆదా లత్ ద్వారా కేసులు పరిష్కరించబడుతున్నట్లు తెలియజేశారు ఈ కార్యక్రమంలో కృష్ణాజిల్లా న్యాయసే వాధికారి సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జ్ రామకృష్ణయ్య, కృష్ణా జిల్లా అదనపు జిల్లా జడ్జీలు జీ. వెంకటేశ్వర్లు, బి.బాబు నాయక్ ఎస్. సుజాత మరియు బార్ అసోసియేషన్ అధ్యక్షులు డి. పోతురాజు, మాజీ బార్ అసోసియేషన్ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ, పుప్పాల శివరామకృష్ణ ప్రసాద్, పేర్ని సురేష్, మాజీ అసిస్టెంట్ గవర్నమెంట్ ప్లీడర్లు గంజి నాగేంద్రం, సిద్ధినేని సాయిబాబు, శిర్విశెట్టి నగధర్నాథ్, జి. రమాదేవి దేవి జి.వి రమణ, లంకి శెట్టి సాయి ఫణి సంతోష్, ఎం. సువర్ణ సోమరాజు, న్యాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు

## "సీఎంఆర్ఎఫ్" నూతన జవజీవాలు అందిస్తుంది

### -కృష్ణా జిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ



**మచిలీపట్నం మార్చి 10 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** సీఎం రిలీఫ్ ఫండ్ ఆపదలో ఉన్న కుటుంబాలకు నూతన జవజీవాలు అందిస్తుందని కృష్ణాజిల్లా తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి గోపు సత్యనారాయణ అన్నారు.కానూరు పంచాయతీలో చిన్న కానూరు గ్రామంలో మంగళవారం గోపు సత్యనారాయణ ఆధ్వర్యంలో వంకా సింధు కి 62500/- రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్ అందజేశారు.బైక్ ప్రమాదంలో గాయపడి చికిత్స పొందిన సింధూ కుటుంబాన్ని కలిసి ఆయన ఓదార్చారు. గాయాల తీవ్రత ఎక్కువగా ఉండడం చూసి కలత చెందారు. కుటుంబానికి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబంపై వైద్య ఖర్చుల భారం పడకూడదనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం సీఎం రిలీఫ్ ఫండ్ ను చంద్ర బాబు సమర్థవంతంగా అమలు చేస్తున్నారన్నారు. వంకా కాశీ ,ఆముదాలపల్లి వెంకటేశ్వరావు, వంకా భాస్కరరావు, చిటికీనేటి దేవి ప్రసాద్,బోట్ల వెంకటేశ్వరావు, వంకా నాదేశ్వరావు, మరీదు రఘవరావు, వంకా నాగమల్లేశ్వరావు, గుళ్ళపల్లి శరత్, వంకా శ్రీనివాసరావు, ఆముదాలపల్లి పిచ్చయ్య,ఆముదాలపల్లి భాస్కరరావు లు పాల్గొన్నారు.

## హిందూ ధర్మ పరిరక్షణ కోసం మంత్రి రవీంద్ర చేసే కృషి అనన్య సామాన్యం

### బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పివి ఫణి కుమార్.



**మచిలీపట్నం మార్చి 10 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** హిందూ ధర్మ పరిరక్షణలో మంత్రి కొల్లు రవీంద్ర చేసే కృషి అభినందనీయమని బ్రాహ్మణ వెల్ఫేర్ కార్పొరేషన్ డైరెక్టర్, పి. వి. ఫణి కుమార్ అన్నారు. శ్రీ గాయత్రి బ్రాహ్మణ పురోహిత సేవా సంఘం వారి కార్యాలయంలో మంగళవారం రాజారత్నపురం, బందరు కోట శ్రీ కోదండ రామస్వామి వారి దేవస్థానం లో శిలా రాజ గోపుర శిఖర ప్రతిష్ట మహోత్సవ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించి సంఘ సభ్యులకు పి. వి. ఫణి కుమార్ పంపిణీ చేశారు. ఫణి కుమార్ మాట్లాడుతూ బందరు కోట నందు రామాలయం నిర్మించి, ఆ దేవాలయంలో ధర్మ పరిరక్షణ కోసం మంత్రి రవీంద్ర చిత్తశుద్ధితో కృషి చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో అన్ని దేవాలయాలకు ఆధ్యాత్మిక భావాలు కలిగిన వారిని దేవాలయ కమిటీలలో మంత్రి కొల్లు రవీంద్ర ఏర్పాటు చేసి, దేవాలయాల అభివృద్ధికి మంత్రి కొల్లు రవీంద్ర ఆ కమిటీల ద్వారా విశేష కృషి చేస్తున్నారు అన్నారు. బందరు కోట శ్రీ కోదండ రామస్వామి వారి దేవస్థానం శిలా రాజగోపుర శిఖర ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి ఈ నెల 12వ తేదీ శ్రీరామ జన్మభూమి అయోధ్య నుండి శ్రీ రాజ్ నాథ్ పాండే, శ్రీ పీఠం కాకినాడ నుండి పూజ్యశ్రీ పరిపూర్ణానంద సరస్వతి స్వామి వారు, శ్రీ విద్యాపీఠం, శ్రీ ప్రణ వాశ్రమము గుడివాడ నుండి శ్రీ శ్రీ స్థైర్యానంద సరస్వతీ స్వామి వారు, ఆంధ్రప్రదేశ్ దేవాదాయ మరియు ధర్మాదాయ శాఖ మాత్యులు, ఆనం రామనారాయణ రెడ్డి తదితర ప్రముఖులు శిలా రాజగోపుర శిఖర ప్రతిష్ట మహోత్సవానికి విచ్చేయుచున్నందున అందరూ ఈ మహోత్తర కార్యక్రమంలో భాగస్వాములై విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గాయత్రి బ్రాహ్మణ పురోహిత సేవా సంఘం అధ్యక్షుడు, లోల్లా కుటుంబ శాస్త్రి, గౌరవ అధ్యక్షులు, లక్కావజ్జుల రామకృష్ణ, కోశాధికారి, తంగిరాల సుబ్రమణ్య కుమార శాస్త్రి, జొన్నలగడ్డ శ్రీనివాస శాస్త్రి, కార్యదర్శి , సీమశాస్త్రి, సభ్యులు, కుప్పా శ్రీకృష్ణమూర్తి లు పాల్గొన్నారు.

## భారీగా చేరికలు... వైకాపా నుంచి జనసేనలోకి




**ఉంగుటూరు మార్చి 10 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఏలూరు జిల్లా నిడమర్రులో వైకాపాకు ఎదురు దెబ్బ తగిలింది. నిడమర్రుకి చెందిన వైకాపా నాయకులు, కార్యకర్తలు భారీగా జనసేనలో చేరారు. ఉంగుటూరులోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనసేనాని పవన్ కల్యాణ్ సిద్ధాంతాలు, ఆశయాలు నచ్చి వైకాపా నాయకులు, కార్యకర్తలు జనసేనలో చేరుతున్నారని తెలిపారు. వైకాపా అరాచక పాలనతో రాష్ట్రంలో విధ్వంసం సృష్టిచారని ఆయన మండిపడ్డారు. కూటమి ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి వైపు పరుగులు పెట్టిస్తోందన్నారు. జనసేన నిడమర్ర మండల అధ్యక్షుడు నిమ్మల దొరబాబు, నాయకులు పాల్గొన్నారు.

## క్రీడలలో ఆంధ్రప్రదేశ్ అగ్రగామిగా ఎదగాలి...

### మచిలీపట్నం అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ




**మచిలీపట్నం మార్చి 10 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** రాష్ట్ర ప్రభుత్వం పిలుపుమేరకు ఆదివారం మచిలీపట్నం ఇండోర్ స్టేడియంలో బ్యాట్మెంటన్ షటిల్ పోటీలను మచిలీపట్నం బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు లంకిశెట్టి బాలాజీ ప్రారంభించి విజేతలకు బహుమతులు అందజేశారు. మచిలీపట్నంలో యువత ఎంతో కాలంగా ఎదురు చూస్తున్నా ఇండోర్ స్టేడియంలో జిల్లా స్థాయిలో క్రీడలో నిర్వహించటం అభినందనీయమని బాలాజీ అన్నారు. జిల్లా స్థాయిలో నిర్వహించే క్రీడలలో ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రస్థాయి క్రీడలకు ఎంపిక చేయడానికి రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ వారు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు యువత క్రీడల పట్ల మక్కువ పెంచుకుని ఆడాలని ఒలంపిక్స్ లో భారత దేశ పతకాల సంఖ్య పెరగాలని బాలాజీ అన్నారు. కృష్ణాజిల్లా స్పోర్ట్స్ అథారిటీ అధికారి ఝాన్సీ రాణి మాట్లాడుతూ పది నెలలపాటు క్రీడలు నిర్వహిస్తామని, ప్రతిభ కనబరిచిన వారిని రాష్ట్రస్థాయిలో అవకాశం కల్పిస్తామని తెలియజేశారు. ఆన్లైన్లో స్లాట్ ద్వారా క్రీడాకారులకు సమయం కేటాయింపు జరుగుతుందని తెలియజేశారు 45వ డివిజన్ ఇన్చార్జి రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ పి.వి. ఫణికుమార్ మాట్లాడుతూ మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు బాలశౌరి రాష్ట్ర ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర సమీక్ష ఆధ్వర్యంలో మచిలీపట్నంలో క్రీడలకు మరింత ప్రోత్సాహాలు కల్పిస్తున్నట్లు తెలియజేశారు. ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న క్రీడలను జిల్లా ప్రజలు ఉపయోగించుకోవాలని ఫణి కుమార్ అన్నారు. ఆదివారం ఉదయం నుండి వివిధ జట్లకు పోటీలు నిర్వహించి సాయంత్రం విజేతలకు బహుమతులు లంకి శెట్టి బాలాజీ అందజేశారు

## ముమ్మరంగా విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు

**మచిలీపట్నం మార్చి 10 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** మంగళవారం నగరంలో ముమ్మరంగా విద్యుత్ విజిలెన్స్ తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీలు డి వన్ సౌత్ సెక్షన్ పరిధిలో జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ పి రవీంద్రబాబు, విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సిహెచ్ వాసు, డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి .గోవిందరావు ఆధ్వర్యంలో జరిగాయి. ఈ సందర్భంగా సూపరింటెండింగ్ ఇంజనీర్ విద్యుత్ సిబ్బందికి భద్రతా ప్రమాణాలపై అవగాహన కల్పించి పలు సూచనలు చేశారు. 34 బ్యాచ్ లుగా ఏర్పడి 3,281 సర్వీసులు తనిఖీ చేశారు. వాణిజ్యానికి అదనంగా 46 కిలోవాట్స్ లోడ్ వాడుతున్న 33 సర్వీసులకు గాను 1.12,750/- రూపాయలు, 359 కిలోవాట్స్ అధిక లోడ్ వాడుతున్న 239 ఇళ్ల సర్వీసులను గుర్తించి 6,28,250/-రూపాయల అపరాధ రుసుము విధించినట్లు తెలిపారు.విద్యుత్ చౌర్యం చేయటం నేరమని విద్యుత్ చౌర్యం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు .ఎక్కడైనా విద్యుత్ చౌర్యం జరిగితే 9440812362 9440812363, 8331014951 నెంబర్లకు సమాచారం ఇవ్వాల్సిందిగా కోరినారు.ఈ కార్యక్రమంలో నగర డిఈఈ కె. రామకృష్ణ, డివిజన్ పరిధిలో ఉన్న డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## టీడీపీ నాయకుడి ఆధ్వర్యంలో వీల్ చైర్ అందజేత



**భీమవరం మార్చి 10 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** భీమవరంలో మంగళవారం, ప్రమాదవశాత్తు కాళ్లు విరిగిన పసల వెంకటేశ్వరరావుకు టీడీపీ నాయకులు జ.ు. రామకృష్ణచౌదరి, ఫ్రెండ్స్ యూత్ సభ్యుల సహకారంతో వీల్ చైర్ ను అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ుూజ చైర్మన్ పులపర్తి అంజిబాబు మాట్లాడుతూ సమాజ సేవ చేయడం నైతిక బాధ్యత అని అన్నారు. ఈ కార్యక్రమంలో చౌదరి, శివ, కమల్, రెడ్డి, పండు, జ్యోయల్, సిద్ధార్థరెడ్డి, మధు, సన్నీ, నాగేశ్వరరావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలను మోసం చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి: ఎమ్మెల్యే



**ఆదోని మార్కెట్ మార్చి 10 ( నేటి మనదేశమ్ ప్రతినిధి) :** ఆదోని పట్టణంలో బంగారు బజారులోని ఓ జ్యువెలర్స్ దుకాణంలో తాము తాకట్టు పెట్టిన బంగారాన్ని విడిపించి ఇప్పించాలని కౌతాళం మండలంలోని గ్రామానికి చెందిన దేవేంద్ర శారదమ్మ దంపతులు ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారధికి మంగళవారం విన్నవించారు. రెండేళ్ల క్రితం ఇంటి నిర్మాణం కోసం ఐదు తులాల బంగారాన్ని దుకాణంలో తాకట్టు పెట్టి రూ. లక్షన్నర అప్పు తీసుకున్నట్లు చెప్పారు. ప్రస్తుతం తన చిన్న కుమార్తె ఐశ్వర్య వివాహం ఉండడంతో తాకట్టు పెట్టిన బంగారం విడిపించుకునేందుకు వెళ్లగా.. దుకాణ యజమాని తమ బంగారాన్ని తిరిగి ఇవ్వకుండా ఇబ్బంది పెడుతున్నాడని వాపోయారు. స్పందించిన ఎమ్మెల్యే.. తాకట్టుకు బంగారాన్ని తీసుకొనే వ్యాపారుల జాబితాను తెప్పించుకున్నారు. పట్టణంలో 300కు పైగా బంగారు దుకాణాలు ఉంటే కేవలం 35 మంది మాత్రమే తాకట్టు వ్యాపారం చేసుకునేందుకు అనుమతులు తీసుకున్నారని ఎమ్మెల్యే తెలిపారు. ప్రజలను మోసం చేస్తున్న వారిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే.. పోలీస్ అధికారులను ఆదేశించారు.

Edited, Printed, Published and Owned by K.S. Rangasayi and published from D.No: 1-3/21-16, Kamakotinagar, Vidyadharapuram, Vijayawada-520 012. (A.P.) and Printed at SKYLINE PRESS, D.No: 1-3/21-16, Kamakotinagar, Vidyadharapuram, Vijayawada-520 012. (A.P.), Associate Editor : K. Neeraja, Ph: 0866-2411299. E-mail: netimanadesam.vja@gmail.com